# అస్త్రం

- వ్యాసాలు

## జె.యు.బి.వి.ప్రసాద్



శ్రీ
కౌముది
మీ మనోగతాల్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 16

# విషయ సూచిక

| | |
|---|---|
| మా 'మంచి' టీచర్లు | 4 |
| అమెరికాలో తెలుగు వారి 'సదాచారాలు' | 6 |
| బుడుగు చెప్పే 'ఈవ్ టీజింగ్' | 10 |
| అరకొర విలువల శంకరాభరణం | 13 |
| వంశవృక్షం | 17 |
| నక్సలైటూ - గేటెడ్ కమ్యూనిటీ | 22 |
| అత్తలేని కోడలుత్తమురాలు | 27 |
| ఇలాంటి మనుషులు కూడా ఉంటారు | 32 |
| పిల్లలున్నారు జాగ్రత్త | 38 |
| రాముడు ఎవరి సొత్తు | 44 |
| స్పందనకి ప్రతి స్పందన | 50 |

# అనేకానేక విషయాలు మరో కోణంపై నెలకో విమర్శనాస్త్రం

పొగడ్తలూ, పొగడ్తలూ! ఎక్కడ చూసినా సరే పొగడ్తలే గానీ, విమర్శలనేవే కనబడవు. అందులో తర్కబద్ధమైన విమర్శలు బొత్తిగా కనబడవు. ఎందుకంటే, విమర్శ అంటే ఎవరికీ నచ్చదు. నేనేదో విమర్శగా అన్నానని, ఒకాయన, "మీరెప్పుడూ నెగిటివ్‌గా మాట్లాడుతారండీ! నాకు నచ్చదు" అంటూ విమర్శకి పెడముఖం పెట్టి, నాతో ఓ రెండేళ్ళు మాట్లాడ్డం మానేశాడు. అంటే ఎవరికీ, తాము ఇష్టపడుతున్న వాటికీ, అంగీకరించిన వాటికీ విరుద్ధంగా వినడం బొత్తిగా ఇష్టం వుండదు. అలా అని అందరూ, "మాకు విమర్శలంటే ఇష్టం వుండదండీ" అని అంటారా? ఊహూ! అలా అనరు. పైపెచ్చు విమర్శలని ఆహ్వానిస్తున్నామనే అంటారు. కానీ విమర్శలు మాత్రం పూలు విసిరినట్టుగా వుండాలి! ఘాటుగా వుండకూడదు! ఓ వెయ్యి పొగడ్తల మధ్యలో, ఒక చిన్న విమర్శ బహు జాగ్రత్తగా పొందు పరచాలి. అప్పుడు మాత్రమే వారు విమర్శకి బ్రహ్మరథం పడతారు! ఆ మధ్య కాలంలో ఒకాయన ఏదో మారుపేరుతో, ఓ వెబ్ పత్రిక్కి ఒక పెద్ద "విమర్శ"నాత్మక వుత్తరం రాశాడు. పత్రిక వారు దానికి పెద్ద పటం కట్టి, ప్రశంసలతో వేసుకున్నారు. నేనదేదో పెద్ద "విమర్శ" అనుకుని, సంబరపడి, చదివి భంగ పడ్డాను. "స్టేజీ మీద అధ్యక్షుని కావలించుకోవాలనిపించింది" లాంటి ప్రశంసల మధ్య ఓ చిన్న విమర్శ అక్కడక్కడ. అది చదివితే ఓ కార్టూన్ గుర్తొచ్చింది. అందులో ఒక బలవంతుడి కాలి కింద ఒక బలహీనుడి కాలు వుంటుంది. అప్పుడా బలహీనుడు, "అయ్యా! ఎలాగో పొరబాటున నా కాలు మీ కాలి కిందకి వెళ్ళిపోయింది. కాస్త దయచేసి తీసుకోనిస్తారా?" అని ప్రాధేయపడుతూ వుంటాడు.

విమర్శ అనేది పొగడ్తల మధ్యలో దూరి వుండనక్కర్లేదు. "విమర్శలు మా అభివృద్ధికి సాయం చేస్తాయండీ" అని, రాసేవాళ్ళు అంటూ వుంటారు. విమర్శ ముఖ్యోద్దేశం ఒక విషయంలోని మంచి చెడ్డలను బేరీజు వెయ్యడమే గానీ, అది రాసిన వాళ్ళను అభివృద్ధి పరచడానికి కాదు. విమర్శలు చదివి తమ రాతలు దిద్దుకుంటే, అది మంచి విషయమే. రాసేవాళ్ళు ఆనందంగా తీసుకునేట్టు చెయ్యడం విమర్శకుల బాధ్యత కాదు. అలాగే విమర్శకుల వెటకారానికి (హాస్యానికి) నొచ్చుకుంటే, విమర్శకులు చేసేదేమీ వుండదు. తర్క రహితమైన చర్చనీయాంశంలోంచే వెటకారాలు పుట్టుకొస్తాయి.

ఈ మధ్యనే ఒక కోట్ చదివాను ఎక్కడో. "సరైన దార్లూ, అవీ బాగా తెలిసీ, డ్రైవింగు మాత్రం రానివాడు విమర్శకుడు" అని. ఇది పూర్తిగా కరెక్టు కాదు. విమర్శకులు కూడా రచయితలు కావచ్చును. ఇంకో విషయం. విమర్శలనేవి ఇంకొకరి రచనల గురించే కానక్కర్లేదు అస్తమానూ. సమాజంలో అనేక విషయాలు గమనిస్తూ వుంటాము. వాటి మీద కూడా విమర్శలుంటాయి.

# మా 'మంచి' టీచర్లు

అది ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తెలుగు మీడియం కెమిస్ట్రీ క్లాసు. కొత్తగా జూనియర్ కాలేజీలో చేరిన విద్యార్థులు, ఒకరినొకరు "మీరు", "మీరు" అని పిలుచుకుంటూ, తమ కొచ్చిన కొత్త పదవికి మురిసిపోతున్నారు. మొత్తానికి అందరూ కలిసి, రాబోయే కెమిస్ట్రీ లెక్చరరు కోసం ఎదురుచూస్తున్నారు. బ్రౌన్ రంగు బెల్ బాటం పాంటూ, టక్ చేసి, పై రెండు బొత్తాలూ వదిలేసిన పింక్ రంగు పొడుగు చేతుల చొక్కా (చొక్కా చేతులు మోచేతి వరకూ మడిచి వున్నాయి, ఎందుకంటే చేతికున్న కప్పంత వాచీ కనబడాలి గదా అందరికీ!), అరచెయ్యంత బకిల్‌తో వెడల్పాటి తోలు బెల్టూ, బకిల్ మీద 007 అనే నెంబరూ, మీసాల కింద వరకూ వచ్చిన సైడ్ బర్న్సూ, మెడ దిగిన జుట్టూ వున్న ఇరవై రెండేళ్ళ కెమిస్ట్రీ లెక్చరర్ క్లాసులో అడుగుపెట్టాడు. పిల్లలంతా ఆ అవతారం చూసి తెల్లబోయారు. వెనకాల బెంచీ లోని కొందరు అల్లరి కుర్రాళ్ళు జేమ్సు బాండు సినిమా సంగీతం ప్రసారం చేశారు చిన్న గొంతుకల్తో. ముసి ముసి నవ్వులతో కెమిస్ట్రీ పుస్తకం తెరిచి పాఠం చదవడం మొదలుపెట్టాడు ఆ కుర్ర లెక్చరరు. ఇంగ్లీషు ఏక్సెంటుతో వెలువడుతున్న రసాయన శాస్త్ర పదాలు పిల్లల కర్థం అయితే వొట్టు. పాఠం చదవడమే పాఠం చెప్పడమయితే, ఇంకేం అర్థం అవుతుంది పాఠం? ఎమ్మెస్సీ ఆ సంవత్సరమే పాసయి, చిరు రికమెండేషనుతో జూనియర్ లెక్చరరుగా చేరాడా కుర్రాడు మరి!

అది బి.యస్సీ ఫిజికల్ కెమిస్ట్రీ ఇంగ్లీషు మీడియం క్లాసు. నిండుగా చీర కట్టుకుని, తల నిండా పూలతో, చేతుల నిండా గాజులతో క్లాసులో అడుగు పెట్టింది ఫిజికల్ కెమిస్ట్రీ లెక్చరర్. ఆవిడ అవతారం చూసి కొంచెం తెల్లబోయినా, మొత్తానికి కాస్త గౌరవంగానే అటెండెన్సు పలికారు విద్యార్థులు. ఆ పని కాగానే, ఆవిడ చిన్న సూట్‌కేసంత వున్న తన హేండ్‌బేగులోంచీ కెమిస్ట్రీ నోట్సు కాగితాల కట్టలు తీసింది. తనకు కావల్సిన కట్ట వుంచుకుని, మిగిలినవి హేండ్‌బేగులో పెట్టుకుంది. విద్యార్థుల వేపు ఒక చిరునవ్వు విసిరి, బోర్డు వేపు తిరిగి, చేతిలో కట్టలో వున్న నోట్సంతా, గాజుల చప్పుళ్ళతో బోర్డు మీద రాయడం మొదలు పెట్టిందావిడ. రాస్తున్నదంతా బిగ్గరగా చదువుతూ రాయడం మర్చిపోలేదావిడ. అలా బోర్డు వేపు తిరిగినావిడ, క్లాసు బెల్లు అయ్యేవరకూ వెనక్కి తిరగలేదు పాపం! అలా రాసుకుంటూ, చెరుపుకుంటూ, మళ్ళీ రాసుకుంటూ, రాసేది చదువుకుంటూ పోయిందావిడ. క్లాసు రూమంతా మల్లెపూల వాసన. మొదటి బెంచీలో కాస్త బుద్ధుండి, భయస్తులైన విద్యార్థులు ఆవిడ బోర్డు మీద రాసిందంతా తమ నోట్సులోకి ఎక్కించుకున్నారు. మిగిలిన పిల్లలు కబుర్లు చెప్పుకుంటూనో, నిద్రపోతూనో కాలం గడిపి, అప్పుడే బెల్లు కొట్టేశారా అని ఆశ్చర్యపోతున్నారు. "ఎమ్మెస్సీ పాసయ్యావు గదా, కాలేజీ లెక్చరరుగా వుద్యోగం చేసి, సంసారానికి చేదోడు, వాదోడుగా వుండకూడదూ" అనే భర్త మాటల్ని భక్తిగా తలకెక్కించుకుని, తెలిసున్న వాళ్ళ ద్వారా ఉద్యోగం సంపాదించిందావిడ మరి!

అది ఎమ్మెస్సీ (టెక్నాలజీ) ఎలక్ట్రానిక్సు మూడో సంవత్సరం క్లాసు. ఆ యేడే వాళ్ళకి టీవీ ఇంజినీరింగు సబ్జెక్టు మొదలుపెడుతున్నారు. అప్పుడప్పుడే జనాల ఇళ్ళళ్ళోకి టీవీ ప్రవేశించడంతో, క్లాసు పిల్లలకి టీవీతో కాస్త పరిచయం వుండి, ఆ సబ్జెక్టు ఆసక్తితో నేర్చుకోవాలని కూర్చుని, కొత్త లెక్చరరు కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా పిహెచ్. డీ డిగ్రీ వుంటేనే గానీ, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకి టీచ్ చేసే అర్హత వుండదు. కానీ ఇప్పుడు రాబోయే కొత్త లెక్చరరు పెద్ద రెకమెండేషనుతో వస్తున్నాడు. అందుకని అయిదేళ్ళ లోపున పిహెచ్.డీ చేస్తే సరిపోతుందన్న షరతుతో వుద్యోగం ఇచ్చారు. కొత్త లెక్చరరుని చూసి ఆశ్చర్యపోయారు విద్యార్థులు. చెప్పకపోతే, వాళ్ళలో ఒకడుగా వున్నాడు. గబగబా అటెండెన్సు తీసుకున్నాడు. చాక్‌పీస్ తీసుకుని బోర్డు మీద టీవీ ఇంజినీరింగ్ అని రాశాడు. తరవాత కాస్సేపు అటూ, ఇటూ దిక్కులు చూశాడు. చమటలు పట్టేశాయి అతనికి. "ఫేన్ తిరగడం లేదా క్లాస్‌రూంలో" అని సీలింగు వేపు చూశాడు. ఫుల్ స్పీడులో దాని మానాన అది తిరుగుతూనే వుంది. కాస్సేపు క్లాసు బయటకి చూశాడు. బలవంతంగా నవ్వాపుకుంటున్న విద్యార్థుల

మొహాలు చూడకుండా వుండటానికి చాలా ప్రయత్నించాడు. చేతి వాచీ చూసుకున్నాడు. ఇంతా చూస్తే ఆయన క్లాసులోకి వచ్చి అయిదు నిమిషాలే అయింది. ఇంక వుండలేక, పుస్తకం తీసుకుని క్లాసులోంచీ బయటకి నడిచాడాయన. వెనక నించీ విద్యార్థుల నవ్వులు వినిపిస్తూనే వున్నాయి.

అది ఎం. ఫిల్ కంప్యూటర్ సైన్సు విద్యార్థుల క్లాసు. వాళ్ళ కోర్సు కోఆర్డినేటరే వాళ్ళకి "ఆపరేటింగ్ సిస్టం" క్లాసు కూడా తీసుకుంటాడు. ఈ విద్యార్థులు ఫెలోషిప్ కోసం, యూనివర్సిటీకి వచ్చాక, రిజిస్టరులో సంతకం పెట్టాలి పొద్దున్నే. రిజిస్టరు వాళ్ళ కోఆర్డినేటరు కూర్చునే బల్ల పక్కనే వుండేది. వాళ్ళు సంతకం చెయ్యగానే, వాళ్ళని ఆయన అక్కడే పట్టుకునేవాడు. కూర్చోపెట్టి కుల, గోత్రాలడిగేవాడు ముందర. వాళ్ళు ఆశ్చర్య మొహాలతో చూస్తే, "చాలా మంది పెళ్ళి సంబంధాల కోసం నన్నడుగుతూ వుంటారు. వాళ్ళకిద్దామనీ ఈ వివరాలన్నీ" అని నవ్వుతాడు. తరువాత ఫోర్ట్రాన్‌కీ, కోబాల్‌కీ తేడాలు చెప్పమంటాడు. వాళ్ళేం చెప్పినా అది కరెక్టు కాదంటాడు. మొత్తానికి కేఫిటేరియాలో వాళ్ళ బ్రేక్‌ఫాస్ట్ టైం అయిపోయి, క్లాసు మొదలుపెట్టే టైం అయ్యాక గానీ వదిలేవాడు. ఏ రోజు ఆయనకి బలవుతారో తెలియక విద్యార్థులు సతమత మవుతూ వుండేవారు. ఆయన తీసుకున్న క్లాసులో ఓ కుర్రాడి చేత టెక్స్టు బుక్ గట్టిగా చదివించేవాడు. మిగిలిన వాళ్ళని దానికి అర్థం చెప్పమనే వాడు. అంతే అదే ఆయన టీచింగు! ఎదురు తిరిగి ఏమన్నా అనడానికి విద్యార్థులకి భయం.

"కౌముది" పత్రికలో "మా మంచి టీచరు" అంటూ పాఠకులు తమ అనుభవాలని సంతోషంగా చెప్పుకుంటే, నేనిలా నెగిటివ్‌గా చదువు చెప్పడం రాని టీచర్ల గురించి రాస్తున్నానని అనుకుంటున్నారా? నా పాయింటు అది కానే కాదు.

ఎలిమెంటరీ స్కూల్లో చదువు నేర్పాలంటే టీచర్ ట్రైనింగు అయి తీరాలి. హైస్కూల్లో చదువు చెప్పాలంటే, బి. ఇడీ గానీ, ఎం. ఇడీ గానీ చదివి తీరాలి. కానీ, జూనియర్ కాలేజీలో చదువు చెప్పడానికి గానీ, కాలేజీలో చదువు చెప్పడానికి గానీ, యూనివర్శిటీలో చదువు చెప్పడానికి గానీ వేరే క్వాలిఫికేషన్‌లు ఎందుకక్కర్లేదూ? పెద్ద క్లాసుల పిల్లలకి చదువు చెప్పాలంటే, స్పెషల్ ట్రైనింగు ఎందుకు అవసరం లేదూ? ఎవరినయినా "మీకు ఎక్కువగా నచ్చిన టీచరు ఎవరూ?" అని అడిగితే, ఎక్కువ మంది ఎలిమెంటరీ స్కూలు టీచరునో, హైస్కూలు టీచరునో చెబుతారు. వారు ఏ టీచరు ట్రైనింగో, లేదా బి. ఇడీ డిగ్రీయో చేసి వుంటారు.

విద్యార్థులకి చదువు చెప్పాలంటే, చెప్పాల్సిన పద్ధతులూ, విద్యార్థుల మనస్తత్వ విశ్లేషణా, వగైరాలన్నీ నేర్చుకోవాలి కదా! ఎమ్మెస్సీ పాసవడమేనా బి.యస్సీకి చదువు చెప్పడానికి కావల్సిన అర్హత?

ఈ గోల అమెరికాలో కూడా కాస్త వున్నట్టే వుంది. మా కజిన్ భార్య ఒక ఎలిమెంటరీ స్కూల్లో స్పెషల్ చిల్డ్రన్‌కి చదువు చెబుతారు. వుద్యోగం కోసం ఆవిడ చదివిన చదువులూ, తీసుకున్న ట్రైనింగులూ ఎన్నో వున్నాయి. ఒక్క క్లాసు కోసం ఎంత ప్రిపేర్ అవ్వాలో ఆవిడ చెబుతూ వుంటే, ఆశ్చర్యం వేసేది. అలాగే హైస్కూల్లో కూడా చదువు చెప్పాలంటే ఏదో టీచింగ్ లైసెన్సు తీసుకోవాలని అన్నారు. మరీ కాలేజీ వచ్చేసరికి ప్రొఫెసర్లు ఎటువంటి ట్రైనింగు తీసుకుని వున్నారూ? పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు "టీచింగ్ అసిస్టెంట్లు" అనే పేర్లతో, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకి డిస్కషన్ క్లాసులు తీసుకుంటూ వుంటారుట. వీళ్ళు నిన్న గాక మొన్న అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు. అందులో వచ్చిన కాసిని గ్రేడ్లు తప్పితే, ఎటువంటి ట్రైనింగూ చేసిన వాళ్ళు కారు.

కాలేజీల్లోనూ, యూనివర్సిటీల్లోనూ లెక్చరర్లకి చదువు చెప్పడం సరిగా వచ్చా, రాదా అన్నది విద్యార్థుల "అదృష్టం" మీద ఆధారపడి వుంటోందన్న మాట! సబ్జెక్టు తెలియడమే టీచ్ చెయ్యడానికి కూడా అర్హత అయిపోయింది.

ఈ పరిస్థితులు ఇప్పట్లో మారతాయన్న నమ్మకం మాత్రం లేదు.

****

# అమెరికాలో తెలుగువారి 'సదాచారాలు'

నేను అమెరికా రాకముందు చెన్నైలో వుండేవాడిని. ఒకసారి పని మీద హైదరాబాదు వెళ్ళినపుడు, చూద్దామని మా బావమరిది ఇంటికెళ్ళాను. ముందరగదిలో ఓ మూల ఇనుపరేకు మంచం మీద కూర్చుని చదువుకుంటోంది ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్సు చదువుతున్న వాళ్ళ రెండో కూతురు. నేను తిన్నగా అక్కడకే వెళ్ళి, ''ఏమ్మా, బాగున్నావా?'' అని పలకరిస్తూ తల మీద చెయ్యేశాను. ''అయ్యో!'' అంటూ కెవ్వున పెద్ద కేక పెట్టింది. నాకు గుండెలు అవిసినట్టయి, ఆ మంచం మీదే చతికిలపడి, ''ఏమైందేమైంద''ని కంగారు పడ్డాను. మాకు కాస్త దూరంగా వున్న మా బావమరిది, కూతురికి ఏదో సైగ చేసి, ''అబ్బే, ఏమీ లేదండీ, ఏదో వులిక్కిపడి వుంటుంది, అంతే'' అన్నాడు ఇబ్బందిగా నవ్వుతూ. అప్పటికి ఆ పిల్ల తల్లీ, అక్కా కూడా ఆ గదిలోకి వచ్చి, నేను మంచం మీదే కూర్చోడం చూసి తెల్లబోతూ నిలబడ్డారు.

''అవునంకుల్! ఏం లేదు, ఏం లేదు'' అని ఆ అమ్మాయి అంది కంగారు, కంగారుగా.

ఆ వాతావరణం చూసి నాకు కాస్త కాస్త అర్థం అయింది, ఇదేదో 'నెలసరి' వ్యవహారం కాబోలు అని. అదికాక పోతే, నేను ముట్టుకున్నందుకు అంత కంగారెందుకూ? నాకు ఒళ్ళు మండింది. అయినా, నేనూ ఏమీ ఎరగనట్టు, కాస్సేపు ఆ మంచం మీదే కూర్చుని మాట్లాడేను. వచ్చే ముందు మా బావమరిదిని కావలించుకుని, అతని భార్యకి షేక్‌హాండ్ ఇచ్చి, పెద్దకూతురి తల నిమిరి, ''వెళ్తానండీ'' అంటూ బయట పడ్డాను.

నేను బయట పడ్డ వెంటనే, బాత్‌రూం వేపు పరిగెత్తబోయే మా బావమరిదినీ, వాళ్ళనీ తలుచుకుని చాలా నవ్వుకున్నాను.

ఇంకో నాలుగు రోజులు పోయాక మళ్ళీ వాళ్ళింటికెళ్ళాను. అప్పుడా అమ్మాయి వాకిట్లో కూర్చుని, ఏదో నోట్సు రాసుకుంటోంది. ''ఏమ్మా, రాధికా! చదువుకుని, జ్ఞానం తెలుసుకుంటున్న పిల్లవి కదా? రేపో, మాపో పెద్ద ఇంజనీరువై, 'సత్యం కంప్యూటర్స్' లాంటి కంపెనీలో వుద్యోగం కూడా చేస్తావు. ప్రతీ నెలా స్త్రీలకి అది ప్రకృతి ధర్మమే కదా? ఆ విషయం విడిగా కూర్చుంటూ నలుగురికీ తెలియజేసుకోవాలా? అది నీకు సిగ్గుగా అనిపించదా?'' అని గబగబా అడిగాను.

''అదేం లేదంకుల్! 'అమ్మని బాధ పెట్టడం ఎందుకు', అన్చెప్పి అలా చేస్తాను. అంతే!'' అంటూ, కొంచెం సిగ్గుపడుతూ, నవ్వింది.

ఆ విధంగా ఆ అమ్మాయి తన తప్పిదాన్ని తల్లి మీదకి తోసేసింది. నాకేం నమ్మబుద్ధి కాలేదు ఆ మాటలు. ఈ రోజుల్లో పిల్లలు ఎన్ని విషయాలకో తల్లితండ్రుల్ని ఎదిరిస్తున్నారు. తమ కిష్టమైన బట్టలూ, ఫాషన్‌లూ, ...... పెద్దవాళ్ళు వద్దన్న వాటిని మానేస్తున్నారా? దీనికి ఎదురు తిరగొచ్చు కదా? రేపీ అమ్మాయి పెద్దయితే, తన పిల్లల పట్ల కూడా ఇలాగే ప్రవర్తిస్తుంది.

అమెరికాకి వెళ్ళే అవకాశం వచ్చినపుడు, అక్కడకి వెళ్ళిన వాళ్ళలో ఇండియా వాళ్ళ చాదస్తాలు వుండవని సంతోషించాను.

.......................

అమెరికా ఆఫీసులో నాతో పని చేసే ఒక తెలుగాయన, కామేశ్వరరావు, ఆలస్యంగా వచ్చాడు ఆఫీసుకి. (ఈ వ్యాసంలో ఏ పేర్లూ నిజం పేర్లు కావు.)

"ఏమయిందండీ, ఆలస్యంగా వచ్చారూ? అందరూ బాగానే వున్నారా?" అంటూ పలకరించాను.

"ఏమీ లేదు. మా అమ్మాయి పెద్ద మనిషయింది. అందుకే కాస్త ఆలస్యం అయింది" అనంటూ సీటు వేపు వెళ్ళిపోయాడు.

మొదట తెల్లబోయాను. ఆ తరువాత ఆశ్చర్యపోయాను కాస్సేపు. ఆ పై తరువాత కాస్త సిగ్గేసింది. తండ్రులు ఇలా మాట్టాడతారని తెలియదు. కాస్సేప్పోయాక ఇంటి నించీ ఫోను. సారాంశం - మా కొలీగ్ భార్య తమ కూతురు పెద్ద మనిషయిందని సాయంకాలం పేరంటం చేస్తున్నారట. మా ఆవిడ్నీ రమ్మని పిలిచారట.

ఇంక వుండబట్టలేకపోయాను. మా కొలీగ్ భార్యతో కూడా మంచి పరిచయమే వుంది. ఆవిడకి ఎన్ని దైవ నమ్మకాలున్నా, కాస్త అభ్యుదయంగానే మాట్టాడుతుంది సాంఘిక విషయాల్లో. వెంటనే ఆవిడకి ఫోను చేశాను. డైరెక్టుగానే విషయంలోకి దిగిపోయాను.

"చూడండీ, పార్వతిగారూ! పూర్వకాలంలో రక రకాల మూఢ నమ్మకాల వల్ల ఆడపిల్లలు పెద్ద మనుషులవగానే అందరికీ చెప్పేవారు. కొన్ని కులాల్లో అయితే అలా చెయ్యడం, తమింట్లో పెళ్ళి కెదిగిన ఆడపిల్ల వున్నట్టు తెలియజెయ్యడం. అప్పుడు మగ పెళ్ళి వారెళ్ళి పిల్లనివ్వమని అడుగుతారు. అగ్ర కులాల్లో అయితే పెద్దమనిషవడం బ్రహ్మ హత్యా పాతకంగా భావిస్తారు. పురాణ కథలో ఇంద్రుడు ఒక మునిని సంహరిస్తాడు ఏదో వివాదంలో. దాంతో వాడికి బ్రహ్మ హత్యా పాతకం చుట్టుకుంటుంది. అప్పుడు విష్ణువు వచ్చి ఆ పాతకాన్ని నాలుగు భాగాలు చేస్తాడు. అది నాలుగు రకాలుగా పోతుందని ఆ మార్గాలు చెబుతాడు. ఒకటోది-చెట్లకి గాటు పెడితే వచ్చే పాల రూపంలోనూ, రెండోది-భూమికి చవిటి నేల రూపంలోనూ, మూడోది-సముద్రానికి కెరటాల మీద వచ్చే నురుగు రూపంలోనూ, నాల్గోది-స్త్రీలకి బహిష్టు రూపంలోనూ పోతాయి అంటాడు. అయితే అదంతా పుక్కిటి పురాణం తప్ప, నిజం కాదు కదా? ప్రజల్లో కొందరైనా అదంతా గ్రహించుకున్నారు. అప్పట్నించీ అది నమ్మడం మానేశారు. సముద్రం మీద నురగని ముట్టుకోని మనిషి గానీ, చవిటి నేల మీద అడుగు పెట్టని మనిషి గానీ, చెట్టు గాటు నించీ వచ్చే పాలని తాకని మనిషి గానీ వుండరు కదా, సాధారణంగా? చాలా మంది ఆ నాలుగో నమ్మకాన్ని కూడా వదిలేశారు. అది ప్రకృతి ధర్మమనీ, శుభ్రంగా వుండాలి తప్పితే, మరేమీ కాదనీ గ్రహించుకుని అలాగే ప్రవర్తిస్తున్నారు. ఆ విషయం ఇంకొకరికి తెలియాల్సిన అవసరం కూడా లేదని స్త్రీలు అర్థం చేసుకున్నారు. మీరిక్కడ ఇలా అమెరికాలో పేరంటాలు చెయ్యడం చాలా చాదస్తంగా వుంటుంది. మనల్ని చూసి అందరూ నవ్వుతారు. వద్దు, మానెయ్యండి" అంటూ పెద్ద లెక్చరిచ్చాను ఆశతో.

ఆవిడ నా లెక్చరంతా ఒక్క మాటతో ఎగరగొట్టింది.

"మీరు నాస్తికులు కాబట్టీ, ఇలా మాట్టాడుతున్నారు. మాకు దైవ నమ్మకాలున్నాయి. మేం శాంతి కోసం పూజ చెయ్యాలి. పేరంటం చెయ్యాలి. మాకు తప్పదండీ" అంది.

"మీకు దైవ నమ్మకాలుంటే, ఇంటిల్లిపాదీ కూర్చుని పూజ చేసుకోండీ! ఎవరు అభ్యంతరం చెబుతారు? కానీ ఈ విషయం అందరికీ చెప్పడం ఎందుకూ? పేరంటం ఎందుకూ? మీ అమ్మాయి కూడా, తోటి మగ పిల్లలకి ఈ విషయం తెలిసిందంటే, సిగ్గు పడదా?" ఇంకా ఆశ పూర్తిగా చావలేదు నాకు. "ఆలోచించండి" అని ఫోను పెట్టేశాను.

ఒక అరగంటలో పార్వతిగారు మళ్ళీ ఫోను చేసింది.

"మా అమ్మాయిని అడిగాను మీరు చెప్పిన విషయం. 'పేరంటం చేసుకోవడం నాకు సరదాగానే వుంటుంది మమ్మీ' అంది. కాబట్టి మీరు మీ ఆవిడ్ని పేరంటానికి పంపండి" అన్చెప్పి ఫోను పెట్టేసిందావిడ.

ఇలాంటి జనాల్ని అమెరికా మారుస్తుందేమో అనుకున్నాను ఇదివరకు చాలాసార్లు. ఈ కుటుంబం వాళ్ళు మా కన్నా ముందే వచ్చారు. ఇండియావాళ్ళు ఇక్కడికి వచ్చి 'తమ సంస్కృతి'ని ఎంత గట్టిగా కాపాడుకోవాలనుకుంటున్నారో కదా అనిపించింది. ఇంతకాలం అగ్ర కులాల వారికే ఈ చాదస్తం అనుకునేవాణ్ణి. మా కొలీగ్ విషయం జరిగాక, ఈ చాదస్తం కులాల కతీతంగా వుందని అర్థం అయింది.

జరిగిందంతా మా ఫ్రెండ్స్ సర్కిల్లో అందరికీ తెలిసిపోయింది. ఇంక వీళ్ళందరూ వాళ్ళ పిల్లలకి కూడా పేరంటాలు మొదలు పెడతారు కాబోలు అని దిగులు పడుతూ వుండేవాణ్ణి. అలా కొన్నేళ్ళు గడిచాయి గానీ, మళ్ళీ ఎక్కడా ఆ వార్తలు వినలేదు. అమెరికాలో మన తెలుగు వారు ఆ 'చాదస్తాలు' వదిలేశారని చాలా సంతోషం కలిగింది. అదే మాట ఒక ఫ్రెండుతో అన్నాను. ఆయనకి మగపిల్లలే. ఆడపిల్లలు లేరు.

"అదంతా మీ భ్రమండీ! అందరిళ్ళలోనూ అటువంటి పేరంటాలు జరగనే జరిగాయి. జరుగుతూనే వున్నాయి. మీరు పెద్ద పెద్ద వుపన్యాసాలు ఇస్తారని చెప్పి, అందరూ మీకు తెలియనివ్వకుండా జాగ్రత్తగా చేసుకున్నారు. అన్నింటికీ వెళ్ళింది మా ఆవిడ" అన్నాడాయన నవ్వుతూ.

మొహం చిట్లించుకోవడం తప్ప, ఏమీ చెయ్యలేక పోయాను. ఇంతింత పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళలో, అంత చిన్న మార్పు రాలేదే అని చింతించాను.

...........................

ఈ మధ్యకాలంలో కొత్తగా అమెరికా వచ్చిన, తెలుసున్న వాళ్ళింటికి చూద్దామని వెళ్ళాను మా అబ్బాయితో. మేం వెళ్ళేసరికి వాళ్ళింటి నిండా బోల్డుమంది ఆడాళ్ళున్నారు. కాస్సేపు బయట తిరిగి మళ్ళీ వచ్చాము. అది శ్రావణ మాసం. ఏదో నోముల విషయం అనుకున్నాను. లోపలకెళ్ళాక చేతిలో చిమ్మిలుండలు పెట్టారు తినమని. అప్పుడు కూడా బుర్రలో లైటు వెలగలేదు. తినేసి, బాగుందని ఇంకోటి పెట్టమన్నాను.

"ఏమిటీ విశేషం? చిమ్మిలి చేశారెందుకూ? నా చిన్నతనంలో, మా వూళ్ళో నందికేశుని నోముకని చిమ్మిలి చేసి పెట్టేవారు. ఎంత బాగుండేదో" అన్నాను లొట్టలేసుకుంటూ.

అప్పుడు చెప్పిందా ఇంటావిడ అసలు విషయం. వాళ్ళ చిన్న పిల్ల పెద్ద పిల్ల అయిందిట. కీడు పోతుందని నలుగురాడవాళ్ళని పిలిచి, నువ్వుల చిమ్మిలి తొక్కిందట. తెలిశాక నోరంతా చేదయి పోయింది. "పెద్ద పిల్లవడం ఏమిటి?" అని మా పిల్లాడు అడిగితే, "తర్వాత చెబుతాలే" అన్నాను.

.............................

"నేను కులాలనసలు పట్టించుకోనండీ!" అన్నారు రామస్వామి 'చౌదరి'గారు.

"నేను కూడా అంతేనండీ!" అన్నారు విశ్వనాథ 'రెడ్డి'గారు.

"కాదు మరీ!" అని వంత పాడారు ఈశ్వరానంద 'శర్మ', సీతారామ 'శాస్త్రి'గార్లు.

"మేం మాత్రం తక్కువ తిన్నామా? మాకూ కులాల నమ్మకాలు లేవండీ!" అన్నారు రమేష్ 'నాయుడు'గారూ, సుబ్బి'శెట్టి'గారూ, రాజ'వర్మ'గారూ.

ఇలా తమ పేర్లలో కులాలను తగిలించుకుని, కుల నమ్మకాల్ని నిర్మూలించడానికి పాటు పడుతూ వుంటారు ఈ 'అభ్యుదయ వాదు'లు. అమెరికాలో వుండే తెలుగు వాళ్ళయితే, ఏ కులానికాకులం విడిపోయి వున్నారు. చౌదర్లూ, రెడ్లూ, శాస్త్రుల్లూ, .....

ఈ సాంప్రదాయం 'అభ్యుదయ' వాదుల్లోనూ వుంది, కొంత మంది 'మార్క్సిస్టుల్లో'నూ వుంది, కొంత మంది 'నాస్తికుల్లో'నూ వుంది.

అన్నట్టు అమెరికాలో తెలుగు వారికి ఇంకో పెద్ద 'సదాచారం' వుంది. అది శ్రావణ మాసం నోములూ, వరలక్ష్మీ వ్రతం చేసుకోవడం, గట్రా. అసలు సమస్య అది కాదు. అగ్రకులాల వాళ్ళు అగ్రకులాలు కాని వాళ్ళకి వాయనాలు ఇవ్వరు నోములు నోచుకుంటే.

ఒకసారి తెలుసున్న వారింటికి వెళ్ళాను. ఆవిడ పేరు సావిత్రమ్మ. ఆవిడతో ఏదో మాట్లాడుతున్నాను. అంతలో వారి అపార్ట్‌మెంటు డోరు బెల్లు మోగింది. ఆ తలుపుకి దగ్గరలో వున్న నేను తలుపు తెరిచాను. బయట ఒకావిడ పట్టుచీర కట్టుకుని, తల నిండా పూలతో, మెడ నిండా నగలతో, నుదుటిన తిలకం బొట్టుతో పాటు కుంకుం బొట్టుతో, నొసటన కుంకుమతో, చేతిలో ఒక బుట్టతో నించుని వుంది. ఆవిడనెప్పుడూ చూడలేదు. అడ్డు తొలిగి ఆవిడకి దారిచ్చాను లోపలకి. సావిత్రమ్మగారు కూడా ఈవిడెవరా అని ఆశ్చర్యంగా చూస్తోంది.

వచ్చినావిడ, "నా పేరు సుభద్రండీ! సుబ్బాయమ్మగారు మీరు మన వాళ్ళే అని చెబితే, నోము వాయనం ఇవ్వడానికి వచ్చానండి. చూస్తూ, చూస్తూ ఇంత నోమూ నోచి, వాయనం శూద్రాళ్ళకివ్వలేం కదండీ?" అంటూ బుట్టలో సామగ్రి అంతా బయటకి తీసింది.

సావిత్రమ్మగారు నవ్వు ముఖంతో కింద కూర్చుంది. ఆ వచ్చినావిడ బుట్ట లోంచి తీసి ఈవిడ కాళ్ళకి పసుపు రాసింది. ఈవిడ నుదుటి మీద అప్పటికే వున్న కుంకుం బొట్టు మీద మళ్ళీ కుంకుం బొట్టు పెట్టింది. ఓ నల్ల అట్లకాడ తీసి, దాని మీద వున్నకాస్త మసిని కాటుకలా కంటికి రాసింది. చేతిలో వాయనం, అక్షంతలూ పెట్టి, కాళ్ళకి దణ్ణం పెట్టింది. సావిత్రమ్మ సంతోషంగా అన్నీ చేయించుకుంది.

చివర్లో, సుభద్రమ్మ, "ఇంకా ఇవ్వాల్సిన వాయనాలు చాలా వున్నాయండీ! ఈ అపార్ట్‌మెంట్లలో మన వాళ్ళు చాలా మంది వున్నారుట కదండీ? మీరు వాళ్ళ అపార్ట్‌మెంట్ల నెంబర్లు చెబితే, వెళ్ళి వాళ్ళకి కూడా వాయనాలు ఇచ్చి వెళ్తానండీ!" అంది ప్రాధేయపడుతూ.

సావిత్రమ్మగారు ఆ వివరాలన్నీ ఇచ్చింది. సుభద్రమ్మ వెళ్ళిపోయింది నవ్వు ముఖంతో. ఇంక ఆవిడ, తెలుసున్న వేరే కులం వాళ్ళు కనబడకుండా, తక్కుతూ, తారుతూ, దొంగలా, తెలియని తమ కులం వాళ్ళిళ్ళకి వెళ్ళి వాయనాలు ఇస్తుందన్న మాట.

నేను వెర్రిమొహం వేసుకుని సావిత్రమ్మ భర్త వేపు చూశాను. ఎందుకంటే అతను బయట వాళ్ళతో మాట్లాడేటప్పుడు, కుల వివక్ష చూపించకూడదని అంటూ వుంటాడు. అతనూ కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

భార్యతో అన్నాడు, "ఇదిగో! నువ్విలాంటి నోము గనక నోచుకుంటే, అన్ని కులాల వాళ్ళకీ వాయనం ఇవ్వాల్సిందే, తెలుసా? నాకు అన్ని కులాల స్నేహితులూ వున్నారు మరి".

ఆవిడ ఈయన్ని ఒక వెర్రివాణ్ణి చూసినట్టుగా చూసి, "అలాగే లెండీ" అంటూ లోపలకెళ్ళి పోయింది.

ఆ అపార్ట్‌మెంటు కాంప్లెక్సులో ఒకావిడైతే, తమ కులస్థుల చేత నోములూ నోయించేసి, వాయనాలు ఎవరికి ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో చెప్తూ, ఓ పెద్ద దిక్కులా వుంటుందట. ఆ పెద్ద దిక్కావిడ ఓ యేడాది నోము నోచుకుంటుంటే, వేరొకావిడ అడిగిందిట, "ఏవమ్మా! మీకు కిందటేడాది తోటే ఈ నోము వుద్యాపనై పోయిందనుకున్నాను. మళ్ళీ ఈ యేడాది కూడా చేశారేం?" అని ఆరాగా.

"ఎందుకడుగుతావు లేమ్మా! కిందటేడాది ఓ అరిష్టం జరిగింది. ఆ నోము రోజున మా ఆయన క్లోజు ఫ్రెండు, భార్యతో సహా మా ఇంటికి వచ్చాడు చూడ్డానికి. ఇంక ఆవిడకి వాయనం ఇవ్వక తప్పలేదు. వాళ్ళు మన వాళ్ళు కాదు అని తరువాత తెలిసింది. దాంతో ఆ యేడాది నోము చెల్లనట్టయింది. అందుకని ఈ యేడాది మళ్ళీ నోచాను" అంది సాగదీస్తూ ఆ పెద్ద దిక్కు.

ఒకసారి ఒక చిన్న కులం ఆవిడని ఆరాగా అడిగాను.

"యేమండీ! ఈ నోములూ, వాయనాలూ, అవీ పెద్ద కులాల వాళ్ళు మీకు ఇస్తారా? మిమ్మల్నసలు నోముల దగ్గరకి పిలుస్తారా?"

"అందరూ పిలవరు గానీ, ఎవరైనా పిలుస్తారు. ఒకసారి ఓ అగ్ర కులస్తులావిడ వాళ్ళింట్లో పూజకని పిలిస్తే వెళ్ళాను. అక్కడికి ఆ పెద్ద దిక్కావిడ కూడా వచ్చింది. నన్ను చూసి ఆ ఇంటి వాళ్ళతో, నాకు వాయనం ఇవ్వద్దనీ, వుత్త ప్రసాదమే పెట్టమనీ అంది. అప్పుడు

ఇలాంటినమ్మకాలు లేని ఇంకో అగ్ర కులస్థులావిడ ఆ గృహిణితో, "ఇంటికి పిలిచి అలా అవమానం చెయ్యకూడదు. ఈ రోజుల్లో కూడా ఇంకా కులాలెక్కడేడిశాయీ?" అంది. ఆ వాదోపవాదనలు నా ముందరే, నాకు వినబడే లాగే జరిగాయి. అప్పుడా ఇంటావిడ నాక్కూడా వాయనం ఇవ్వబోయింది" అని చెప్పుకొచ్చిందావిడ.

*సరదా సరదాగా..!*


"అయితే మీరప్పుడా వాయనం తీసేసుకున్నారా?" అనడిగాను కంగారుగా.

"లేదండీ! తీసుకోలేదు. నాకు చాలా అవమానం అనిపించింది. 'మీకీ కులాల పిచ్చి వున్నట్టయితే నన్ను పిలిచి వుండకూడదు. నాకీ వాయనం అక్కర్లేదు' అనంటూ లేచిపోయాను. 'మీకు ఇస్తున్నానుగా, వద్దనుకుంటే ఎందుకిస్తానూ?' అని ఆ ఇంటావిడ అంది. నేను, 'వద్దులెండీ. మీరంతా గుంప జంపేలు పడి, ఇష్టం వుండీ, లేకా ఇస్తున్నారు. అలాంటిది నాకెందుకు లెండి' అన్చెప్పి వచ్చేశాను.

ఆవిడలో వున్న ఆ కాస్త చైతన్యానికే, ఆవిడకి చేతులెత్తి దణ్ణం పెట్టాలనిపించింది.

****

# "బుడుగు చెప్పే ఈవ్ టీజింగ్"




ఈ మధ్య కాలంలో ముళ్ళపూడి వెంకటరమణ గారి "బుడుగు" పుస్తకం చదివాను. చిన్న పిల్లల అమాయకత్వం, వాళ్ళ అల్లరీ, వాళ్ళు చదువుకి చూపించే విముఖత్వం, కుటుంబంలో వుండే ఆప్యాయతలూ ఎంతో చక్కగా చిత్రీకరించాడు రచయిత. ముచ్చటేస్తూ, నవ్వుగా వుంటాయి ఈ సంఘటనలు. కానీ ఇప్పుడు చదివినప్పుడు కొన్ని నెగిటివ్ అంశాలు లేకుండా వుంటే ఇంకా బాగుణ్ణనిపించింది.

"బుడుగు" కథ బాగుంటుందనీ, ఆ భాషా, సంఘటనలూ అందరికీ ఇష్టంగా వుంటాయనీ తెలుసు. నేను కూడా ఈ పుస్తకాన్ని ఇష్టపడ్డాను. ఈ పుస్తకం చిన్నప్పుడు చదివినప్పుడు ఏ పొరపాట్లూ కనబడలేదు. ఇప్పుడు చదువుతున్నప్పుడు కొన్ని చోట్ల ఆశ్చర్యం వేసింది. ఈ పుస్తకం లోని నెగిటివ్ అంశాలని గమనించాను.

"బుడుగు" పుస్తకంలో ముఖ్యంగా, ముందుగా కనిపించే నెగిటివ్ విషయం "ఈవ్ టీజింగ్". చక్కటి తెలుగులో "ఆడపిల్లల్ని యేడిపించడం".

బుడుగు బాబాయీ, అతని స్నేహితులూ కలిసి రోడ్డు మీదా, గుడి దగ్గరా కనిపించే అమ్మాయిల్ని "ఈలలు" వేసి యేడిపిస్తూ వుంటారు. అది వీరి దృష్టిలో ఒక సరదా. ఇదోక మామూలు విషయంగానే రాస్తాడు రచయిత కూడా. పైపెచ్చు ఈ "పెద్దమనుషులు" ఆ

ఈలలేవో తామే వేసుకుని వూరుకోలేక, బుడుగు చేత కూడా వేయిస్తారు. యేడేళ్ళ పిల్లాడు అలా ఒక ఆడపిల్లకి "ఈల" వెయ్యడం వెకిలితనం కాక, హాస్యం ఇక్కడ!

"అందుకని బాబాయి వురేయ్ వురేయ్ బుడుగూ మరేమోనూ, నువ్వూ ఆ సీతని ఏడిపించరా అంటాడు" (బుడుగు, పేజీ 50)

చాలా మంది పాఠకులకి ఇది చాలా మామూలు విషయం లాగా వుంటుంది. అంతకు మించి చైతన్యం వుండదు వారికి ఇలాంటి విషయాల్లో.

అదే యేడేళ్ళ పిల్లాడికి ఇద్దరక్కలూ, వాళ్ళ వెనకాల ఈలలు వేసే కుర్రాళ్ళు వుంటే, అప్పుడు అది హాస్యంగా వుండదు. ఎందుకంటే నూటికి తొంభై తొమ్మిది మంది అక్కలు, అలా బయటి వాళ్ళు వెకిలిగా ఈల వేసినపుడు, చాలా బాధ పడతారు. వారి బాధను చూసిన యేడేళ్ళ తమ్ముళ్ళెవరూ అది సరదా అనుకోరు. ఈ పుస్తకంలో ఆడపిల్లలెవరూ బాధ పడ్డట్టు చూపించరు. కానీ నిజ జీవితంలో అయితే, ఆ ఆడపిల్లలూ, వారి తమ్ముళ్ళూ గట్టి క్షోబకి గురవుతారు.

బుడుగు బాబాయి సీత అనే అమ్మాయికి ప్రేమలేఖ బుడుగు చేతి కిచ్చి పంపుతాడు. అది కాస్త సరదాగానే వుంటుంది. ఎందుకంటే ఆ సీత అనే అమ్మాయి కూడా ఈ బాబాయిని ఇష్టపడ్డట్టే వుంటుంది. వాళ్ళిద్దరూ కాస్త చనువుగా కూర్చోడాన్ని ఈ పిల్లాడు చూస్తాడు.

"బాబాయి వరస ఏమిటంటే, అసలు బాబాయి, సీత ఒక వరసగా కూచుని చదువుకోరు. నేను, మా ప్రవేటు మేష్టరు ఎదురుగా కూర్చుంటామా, వీళ్ళు అలాగ కూర్చోరు. అందుకే బామ్మ వాళ్ళ వరస బాగులేదంది. నేనూ అలాగే అనుకున్నా." (బుడుగు, పేజీ: 8)

నిజానికి పక్క పేజీలో వేసిన బొమ్మలో వాళ్ళిద్దరూ ఎదురెదురుగానే కూచున్నారు మరి. అంటే బొమ్మ వేసే ఆయనకి కథ గుర్తున్నట్టు లేదు.

ఈ బాబాయే మళ్ళీ వేరే రెండు జడలమ్మాయిలని చూస్తూ వుంటాడు. దానికి ఈ చిన్న పిల్లాడి సాయం!

దీనికన్నా చిరాకు కలిగించే విషయం, బుడుగు తండ్రి, పిల్లాడి చేత ఎవరో అమ్మాయికి ఈల వేయించి, అమ్మకి చెప్పొద్దని, పిల్లాడిని ముద్దు పెట్టుకుంటాడు.

"నాన్నెప్పుడేనా రోడ్డు మీద రెండు జెడల సీతలాంటిదాన్ని చూసి బావుంది కదరా బుడుగూ, మెల్లిగా ఈల వెయ్యగలవా అంటాడనుకో. అప్పుడు నేను ఈల వేస్తే ఆ పిల్ల హు అని ఇలా మొహం పెట్టి కోపంగా గబగబా వెళ్ళిపోయి, సందు చివర వెనక్కి తిరిగి నవ్వి, మళ్ళీ వెళ్ళి పోతుందనుకో. ఆనకేమో, నాన్న నన్ను ముద్దు పెట్టుకుని అమ్మతో చెప్పకేం అంటాడు గదా?"(బుడుగు, పేజీ: 12)

ఇలాంటి సంఘటనలు పాత్రలని తక్కువ స్థాయిలో చూపిస్తాయి.

ఆడపిల్లలని యేడిపించడం అనేది మగ పిల్లలకి మాత్రమే సరదా. ఆడపిల్లలకి అది ప్రాణ సంకటంగానే వుంటుంది. బుడుగు లాంటి కథల్లో ఈ యేడిపించడం అనేది ఈల వెయ్యడం తో టీ, కళ్ళు పెద్ద చేసుకుని నవ్వుతూ చూడ్డం తో టీ ముగుస్తుంది. కథల బయట అయితే, పరిస్థితులను బట్టీ, సందర్భాన్ని బట్టీ ఇది దారి తప్పుతూ వుంటుంది. "నిన్నే పెళ్ళాడుతా" అనే సినిమాలో హీరోయిన్ "ఈవ్ టీజింగ్" అంటే ఆడపిల్లలందరూ మురుస్తూ వుంటారని పాట పాడుతుంది. ఇదీ నాగరికతకి చిహ్నం!

చిన్నప్పుడు చదివిన బుడుగు కథలో బాబాయి బుడుగుని ఎవరన్నా రెండు జడల సీతలొస్తుంటే చెప్పమని వీధరుగు మీద కాపలా పెడతాడు. ఒకరోజు బుడుగు, "బాబాయి, బాబాయి చప్పున రా బాబాయి. కొత్త రెండు జడల సీతొస్తోందీ" అని కేకేస్తాడు. బాబాయి పరిగెత్తుకొస్తాడు ఆశగా. చూస్తే అమ్మాయి ఒక యేడేళ్ళ అమ్మాయి. బాబాయి బుడుగుకి ఒక జెల్లకాయ కొట్టి వెళ్ళిపోతాడు. అంటే బుడుగుకి బాబాయి వయసు అమ్మాయిలూ, తన వయసు అమ్మాయిలూ ఒకేలా కనబడ్డం మొదలుపెట్టారన్న మాట. అందరినీ అదే దృష్టితో చూడ్డం.

ఇంకా ఈ కథలో ప్రవేటు టీచర్లు చిన్న పిల్లల్ని హింసిస్తూ వుంటారు. ఆ హింసంతా ఒక జోక్‌లా వుంటుంది ఈ కథలో.

మా అబ్బాయి చిన్నప్పుడు ఒక యేడాది మద్రాసులో ఒక స్కూల్లో చదివాడు. అప్పుడు వీడు సరిగా ఏదో రాయలేదని, వాడిని చీకటి గదిలో పెట్టి, చేతి మీద స్కేలుతో కొట్టి, తలుపేసేశారట. వాడికి అప్పుడు మూడేళ్ళు. ఇప్పటికీ అది తల్చుకుని ఆ టీచర్లని తిడుతూ వుంటాడు. ఇలాంటి విషయాలు ఏం నవ్వు పుట్టిస్తాయీ?

టీచర్లు పెట్టే హింస సరదాగా, విమర్శ లేకుండా చూపించకూడదు. పిల్లల్ని ఎంతో ప్రేమగా చూసుకునే తల్లితండ్రులు కూడా, చదువు విషయం వొచ్చేసరికి, ఓ టీచరుకి పిల్లల్ని కొట్టడానికి అన్ని హక్కులూ ఇచ్చేస్తూ వుంటారు. చదువు చెప్పే సహనం లేకే ఈ కొట్టడం. ఆ సహనం లేని వాళ్ళు చదువు చెప్పడం మానెయ్యాలి.

మా ఇంటి దగ్గర అద్భుతంగా పాడగలిగీ, మంచి సంగీత జ్ఞానం వున్న టీచరు ఒకావిడ వుంది. అయితే ఈవిడకి బొత్తిగా సహనం లేదు. పిల్లల్ని సరిగా పాడలేదని బాగా తిట్టి అవమానం చేస్తూ వుంటుంది. ఆ అవమానాలు భరించలేని పిల్లలు సంగీతం నేర్చుకోవడం మానేస్తారు. కనీసం ఆవిడ దగ్గర మానేస్తారు . "తిడితే తిట్టిందిలే, టీచరన్నాక తిట్టకుండా వుంటుందా" అనే తల్లితండ్రులు, ఆవిడ సంగీతానికి ముగ్ధులై, పిల్లల్ని ఆ టీచరు దగ్గరకే వెళ్ళమని సతాయిస్తూ వుంటారు.

సీతతో పెళ్ళి కుదిరిన బాబాయిని, సుబ్బలక్ష్మి??? ముక్కు బావుందన్నాడని, మద్రాసు పంపించేశారుట. సీత సంగతి ఏమయిందో!

ఈ కథల్లో పిల్లలూ, పెద్దాళ్ళూ తెగ అబద్ధాలు ఆడేస్తూ వుంటారు. మళ్ళీ ఇదంతా హాస్యమే!

ఈ బుడుగు దగ్గర కొన్ని భయంకరమైన అయిడియాలు కూడా వున్నాయి. పాపాయి యేడుస్తుంటే, ఆ యేడుపాపటానికి , "నాన్న జేబురుమాలు పెట్టి పాపాయి మూతి కట్టెయ్యడం", "పాపాయిని ఊచి పుచ్చుకుని ఒకటి కొట్టేసి పోవడం"; ఇంకా "సీత జెడ కత్తిరించడం", "లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడి గుండు మీద సూటిగా రాయితో కొట్టడం" లాంటివి. ఏ తొమ్మిదేళ్ళ పిల్లాడో ఈ కథ చదివి, ఇలాంటివి "సరదాగా" చెయ్యడానికి ప్రయత్నిస్తే ఎంత ప్రమాదం?

"ఆడపిల్లలు", "ఇందిర అనే రెండు జడల సీత ఖథ"ల నిండా ఈ "ఈవ్ టీజింగ్" గోలే. చదువుతూ వుంటే ఒళ్ళు మండుతుంది.

చిన్నపిల్లలు ప్రేమల గురించీ, పెళ్ళిళ్ళ గురించి మాట్టాడుతూ వుంటే, చాలా ఎబ్బెట్టుగా వుంటుంది. పిల్లల కథల పుస్తకంలో చిన్న పిల్లాడికి ఇటువంటి సంఘటనలు ఎబ్బెట్టుగా వుంటాయి. ఇటువంటి మాటలు ముదురుగా వుంటాయి.


ఆ రోజుల్లో కూడా పిల్లల కథలో "టుపాకీ" గురించి మాట్టాడుతారన్న మాట. "వంటింట్లో వంద రూపాయల కేసు ఖద"లో పిల్లాడి దగ్గర శవం గురించి మాట్టాడుతారు. "శవం అంటే నాకు తెలీదు" అని అంటూనే, బుడుగు భయపడి వాళ్ళమ్మ దగ్గరకి వెళ్ళిపోతాడు. చిన్నపిల్లాడూ, శవం - ఒక కథ! ఈ కథలో మిగిలిన పదాలు - రత్తం, కూనీ, గ్రటా!

ఇంక సిగరెట్ల సంగతి చెప్పక్కర్లేదు ఈ కథల నిండా. ఆ చిన్నపిల్లాడు సిగరెట్ల గురించి ఇంత మాట్టాడేక, తప్పకుండా ఏ పన్నెండేళ్ళకో సిగరెట్లు కాల్చడం మొదలుపెట్టేస్తాడు.

చిన్నప్పుడు ఇవన్నీ పొరపాట్లనిపించలేదు. ఇప్పుడు అవే విషయాలు చాలా పొరపాటుగా అనిపిస్తున్నాయి. రచయితకి కూడా ఇవి రాసినప్పుడు పొరపాటుగా తోచి వుండక పోవచ్చు. ఇప్పుడు కూడా అలా అనిపించదా? ఈ రచయిత ఇంకా మంచి సంఘటనలతో చాలా చక్కగా రాయగలిగే చాకచక్యం వున్న మనిషి. ఈ పిచ్చి సంఘటనలు వొదిలేసి, చిన్న పిల్లల సంఘటనలతో సంతోషం కలిగించేలా రాస్తే ఎంతో బాగుంటుంది. ఈ రచయితకి ఆ శక్తి వుంది.

*****

# అరకొర విలువల "శంకరాభరణం"




"శంకరాభరణం" సినిమా వచ్చి, దాదాపు 26 యేళ్ళు దాటింది. ఆ రోజుల్లో అయితే, ఈ సినిమాకి బ్రహ్మరథం పట్టేశారు ప్రేక్షకులు. ఒక వారం ముందుగా బుక్ చేసుకుంటేనే గానీ టికెట్లు దొరికేవి కావు. చాలా మంది ఈ సినిమాని మళ్ళీ మళ్ళీ చూశారు. ప్రసిద్ధులైన వాళ్ళు ఈ సినిమాని మెచ్చుకుంటూ, చాలా సమీక్షలు రాశారు. ఈ సినిమాకీ, ఇందులో పని చేసిన వారికీ అవార్డులు కూడా వచ్చాయి. ఈ నాటికీ, చాలా మందికి ఈ సినిమా పేరు చెబితే ఒళ్ళు పులకరిస్తుంది. ఈ సినిమాలో వున్న 'విలువలు', ఈ నాటికీ 'విలువలు' గానే వున్నాయి. అందుకే ఈ సినిమా గురించి 26 యేళ్ళ తర్వాత కూడా పట్టించుకుని, పరిశీలించడం.

నిజానికి ఈ సినిమా కథ బాగానే వుంటుంది. చిత్తశుద్ధీ, నిజాయితీ, గట్టి పట్టుదలా, ఇతరులకి సాయపడాలనే ధోరణీ వున్న ఒక సంగీత విద్వాంసుడు, ఇతరులకి సాయపడే విషయంలో తన వారిని కూడా ధిక్కరిస్తూ, శాస్త్రీయ సంగీతానికి విలువ తగ్గి, పేదరికంలో పడిపోతాడు. నాట్యం తెలిసిన తులసి అనే స్త్రీ, ఆ సంగీత విద్వాంసుడిని ఆరాధించి, కొడుకుని ఆయన దగ్గర సంగీతం నేర్చుకోవడానికి చేర్పిస్తుంది. తులసి ఏర్పాటు చేసిన శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో, ఆ విద్వాంసుడు తులసి కొడుకుని తన వారసుడిగా ప్రకటించి, మరణిస్తాడు. ఆ విద్వాంసుడితోనే తులసి కూడా మరణిస్తుంది.

ఈ కథని సినిమాగా తీసినపుడు ఎన్నెన్ని ఫ్యూడల్ విలువలు ఈ సినిమాలో చోటు చేసుకున్నాయో, చూపించడమే ఈ వ్యాసం ముఖ్య వుద్దేశం. అంతే కాదు, ఇందులో సరిగా లేని సన్నివేశాలూ, కృత్రిమ విషయాలూ, వగైరాల గురించి చర్చించడం కూడా ముఖ్యం. అయితే ఈ సినిమా తప్పకుండా చూసి, తీరాల్సిన సినిమా. ఎన్నో లోపాలు వున్నప్పటికీ, మొత్తానికి ఇది చక్కటి సినిమా.

"శంకరాభరణం" సినిమా, "శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గాన రసం ఫణిః" అనే ఆర్యోక్తితో మొదలవుతుంది. "పాములు సంగీతాన్ని ఆస్వాదిస్తాయి" అని అంటే, అది, "పాములకి చెవులు లేవు" అనే సైంటిఫిక్ విషయాన్ని ధిక్కరించడమే. పాములకి చెవులు లేవన్న విషయం ఈ సినిమా రావడానికి చాలా యేళ్ళ కిందటే సైంటిఫిక్‌గా రుజువయింది. అయినా ఆ విషయాన్ని పట్టించుకోకుండా, ఈ ఆర్యోక్తిని యాంత్రికంగా వాడుతూనే వుంటారు, చిత్తశుద్ధి లేకుండా.

ఈ సినిమాలో శంకరశాస్త్రి ఒక ఫ్యూడల్ యజమాని. ఈయనకి కాళ్ళు పిసకడానికి సేవకుడు కావాలి. నూతి లోంచీ నీళ్ళు తోడి నెత్తి మీద పోయడానికి సేవకుడు కావాలి. గుర్రం బండి తలుపు తియ్యడానికి సేవకుడు కావాలి. వంట చెయ్యడానికి సేవకురాలు కావాలి. వీపు రుద్దడానికి సేవకుడు కావాలి. ఈ సేవకులకి ఈయన సహాయాలు చేసిన దాఖలాలు ఏమీ లేవు ఈ సినిమా కథలో. పైపెచ్చు గుర్రం బండి తలుపు కాస్త ఆలస్యంగా తీశాడనీ, నూతిలోంచీ నీళ్ళు కాస్త ఆలస్యంగా తోడి నెత్తి మీద పోశాడనీ, సేవకులని,

"హు" అని విసుక్కుంటాడు. ఎప్పుడో తప్ప ప్రసన్న వదనం పెట్టకుండా, ఫ్యూడల్ యజమాని గాంభీర్యాన్ని అన్ని వేళలా ప్రదర్శిస్తూ వుంటాడు.

ఈ ఫ్యూడల్ సంగీత విధ్వాంసుడు తాను మాత్రం ఫస్ట్ క్లాసు కంపార్ట్‌మెంటులో ప్రయాణించి, మిగిలిన ఆర్కెస్ట్రా వాళ్ళని సెకండ్ క్లాసు కంపార్ట్‌మెంటులో తీసుకెళతాడు. సంగీత ఆర్కెస్ట్రాలో పాట పాడే వాళ్ళు మొదటి స్థాయీ, మృదంగం రెండవ స్థాయీ, వయొలిన్, వీణా, ఫ్లూట్ వంటివి తృతీయ స్థాయీ అన్నమాట! ఈ స్థాయీ బేధాలు ఫ్యూడల్ లక్షణాలే.

ఈ సినిమా ముగింపు ఏమిటంటే, తులసి కొడుకు శంకరాన్ని, శంకరశాస్త్రికి కళలో వారసుడిని చెయ్యడమే. అలా వారసుడిని ప్రకటించడం కూడా ఫ్యూడల్ లక్షణమే. లేకపోతే, వారసుడిని ప్రకటించడానికి శంకరశాస్త్రి ఎవరు? ఈయన అనుకుంటే సరిపోతుందా? ప్రజలే ఆ కుర్రాడి గానం విని, ఇతనే శంకరశాస్త్రికి ఈ కళలో నిజమైన వారసుడు అని అనాలి. ఇదంతా ఒక్క రోజులో, శంకర శాస్త్రి తన కాలి గండ పెండేరాన్ని కుర్రాడి కాలికి తొడిగేస్తే అయిపోదు. కాలక్రమేణా కుర్రాడి సంగీతం విని ప్రజలు అలా అనుకుంటారు. ఇదేదో రాజ్యాభిషేకం లాంటిది కాదు రాజు తన వారసుడిని నిర్ణయించడానికి. ఇక్కడ ఇంకో ప్రశ్న ఏమిటంటే అన్నేళ్ళూ, చిన్నప్పటి నించీ, చల్లటి నది నీళ్ళలో గొంతు వరకూ దిగి, సంగీత సాధన చేసిన శంకరశాస్త్రి కూతురు శారద ఎందుకు ఆయనకి వారసురాలు కాలేకపోయింది? పైపెచ్చు శంకరం కొంత సంగీతాన్ని శారద దగ్గర కూడా నేర్చుకుంటాడు. శారద బాగా కళని అభ్యసించలేక పోయిందా అంటే, ఆ విషయాన్ని చూపే సంఘటనలేవీ లేవు సినిమాలో. ఆడపిల్ల అంటే, పెంచి, కాసింత సంగీతం నేర్పించి, ఆ తర్వాత పెళ్ళి చేసి అత్తవారింటికి పంపేయాలనే దృష్టితోనే వుంటారు వీళ్ళంతా. శంకర శాస్త్రికి కూతురు బదులు కొడుకు వుండి వుంటే, ఆ కొడుకు కూడా వారసుడు కానట్టు సినిమా కథ నడిపేవారా? అబ్బే, లేనే లేదు. వారసులు అంటే మగవాళ్ళే అవాలి, వాడు బొడ్డూడని కుర్రకుంక అయినా సరే! ఫ్యూడల్ సమాజంలో ఆడవాళ్ళు వారసులుగా వుండరు. అందుకనే శారద అద్భుతంగా పాడగలిగినప్పటికీ, శంకరమే శంకరశాస్త్రి కళకి వారసుడయి, గండ పెండేరం ధరించే అర్హత సంపాదిస్తాడు.

ఎప్పటి నించో నాకో ప్రశ్న. శంకరశాస్త్రిని స్త్రీ పాత్ర చేసి, తులసి పాత్రని పురుషుడి పాత్ర చెయ్యగలరా? అలా చేస్తే, ఈ సినిమా ఎవరూ చూడరు. ఒక స్త్రీ అద్భుతంగా పాడుతూ వుంటే, ఒక పురుషుడు, ఆ స్త్రీని ఆరాధిస్తూ, ఆ పాటకి తన్వయత్వంతో నాట్యం చేస్తాడా ఈ ఫ్యూడల్ విలువల ప్రకారం? ఆ సంగీత విద్వాంసురాలు చాలా పట్టుదలగా, గంభీరంగా వున్నట్టు చూపిస్తే, ప్రజలు చూసేవారా? చూడరు. ఎందుకంటే స్త్రీ, పురుష స్థాయిలు ఫ్యూడల్ విలువల ప్రకారం సమాజంలో స్థిరపడి వున్నాయి. వాటికి వ్యతిరేకంగా చూపిస్తే, ఎబ్బెట్టుగా వుంటుంది జనాలకి.

ఇన్ని విలువల ప్రకారం శంకరమే ఆ కళకి వారసుడు! శంకరశాస్త్రి పాత్ర పురుషుడిగానే రాణిస్తుంది!

పక్షపాతం చూపిస్తూ కూతురుకి కాకుండా, వేరే వాళ్ళ అబ్బాయికి కాలి గండ పెండేరం ఇవ్వడం అనేది మంచి విషయమే. కానీ ఇక్కడ అటువంటి మంచి విషయం గురించి మాట్లాడ్డం లేదు. వారసులుగా మగవాళ్ళు మాత్రమే వుండాలి అనేది చూస్తున్నాము

నేనీ మధ్యలో ఈ సినిమాని మళ్ళీ చూశాను. తులసి పాత్ర చేసిన నాట్యం చూస్తే ఒళ్ళు మండిపోయింది. 1980లో, నాట్యం గురించి ఏమీ తెలియని రోజుల్లో, ఈ పాత్ర గెంతులే మంచి నాట్యం అనుకుని సంతోషించేశాను. ఆ తర్వాత, ఓ నాలుగేళ్ళు నాట్యం స్వయంగా అభ్యసించి, ఇంకో ఆరేళ్ళు నాట్యశాస్త్రాన్ని స్టడీ చేశాక, తులసి పాత్ర చేసిన నాట్యం ఒళ్ళు మండించింది. నాట్యానికి ముఖ్యంగా అవసరమైనది అరమండి. అంటే, కాళ్ళు రెండూ డైమండ్ షేపులో వంచి, నాట్యం చేయడం. ఈ తులసి పాత్ర మోకాళ్ళు రెండూ ముందుకు (పక్కలకి వుండాల్సినవి) పెట్టి నాట్యం చేస్తుంది. అరచేతులు పతాక స్థాయిలో వుండాల్సినవి, వేళ్ళ మధ్య బోలెడంత ఖాళీ చూపిస్తూ వుంటాయి. ఇంక, వుండుండి, అటూ ఇటూ అనవసరంగా వంగడం. ఈ పాత్ర చేసిన శాస్త్రీయ నాట్యంలో సినిమా గంతులే ఎక్కువ. ఈ నాట్యంలో అభినయం సంగతి ఇంక అడక్కండి.

ఫ్యూడల్ విలువల ప్రకారం పురుషులు గంభీరంగా వుండాలి. అవసరమయినా చురుగ్గా పరిగెట్ట కూడదు. వీలు కుదిరినపుడు గంభీరంగా ఒక చిన్న వుపన్యాసం ఇవ్వాలి. ఆ వుపన్యాసంలో అసలు విషయం సరిగా లేకపోయినా సరే. శంకరశాస్త్రి విషయంలో ఒక సంఘటన ఇటువంటి విలువని స్పష్టంగా చూపిస్తుంది.

తులసిని ఇంటికి తీసుకు వచ్చాక, "వంటత్తయ్య" పని మానేసి వెళ్ళిపోతుంది, " అనాచారం భరించలేనంటూ". అప్పుడు ఎనిమిదేళ్ళ శారద, తల నిండా స్నానం చేసి, ఒళ్ళు తుడుచుకోకుండా, తడి చీర చుట్టుకుని, మడి కట్టుకుని, నీళ్ళ బిందె వంట కోసమని మోసుకువస్తూ, బిందెతో సహా పడిపోతుంది. ఆ పిల్ల బాధతో గట్టిగా అరుస్తుంది. తులసి బొమ్మలా చూస్తూ వూరుకుంటుందే గానీ కదలదు. రక్తాలు పులమడానికయితే మడులు అడ్డు రావు గానీ, పడిపోయిన చిన్న పిల్లని లేవనెత్తడానికి మడి అడ్డం వొస్తుంది ఈ తులసికి. అయితే శంకరశాస్త్రి కూడా పరుగున వచ్చి పడిపోయిన కూతుర్ని లేవదీసి, దెబ్బ ఎక్కడ తగిలిందో చూడడు. పూజగది కిటికీ లోంచీ కింద పడ్డ కూతుర్ని గంభీరంగా (ఎందుకలా పడిపోయావు అన్నట్టు) చూస్తూ వుంటాడు. ఇదే తల్లి అయితే అలాగే, చూస్తూ వుంటుందా? ఎంత గంభీర ప్రవర్తనా, పట్టుదలా వున్న మనిషయితేనేం, అది తల్లయితే పరుగున వెళ్ళి, పిల్లని పైకెత్తి, దెబ్బ తగిలిందా అని చెక్ చేసి, అప్పుడు ఇస్తుంది కావల్సిన లెక్చరు. శంకరశాస్త్రి తండ్రి కాబట్టీ, అలా గంభీరంగా చూస్తూ, బండతనంగా వుండిపోవచ్చు. శంకరశాస్త్రి పరుగున వెళ్ళి, పిల్లని ఎత్తుకుని, అప్పుడు లెక్చరిస్తే, ఫ్యూడల్ విలువల పోషకులకి ఎబ్బెట్టుగా వుంటుంది. శంకరశాస్త్రి తల్లయితే, ఆ పిల్లకి వంట చేయాల్సిన అవసరమే వుండేది కాదు లెండి. ఆ తల్లే ఏ కీర్తనలో పాడేసుకుంటూ, సంగీత శాస్త్రం లోనే కాదూ, పాక శాస్త్రంలో కూడా ప్రావీణతని చూపించేది.

పిల్లని లేవనెత్తడం మానేసి, శంకరశాస్త్రి ఇచ్చిన లెక్చరు ఏమిటీ? ఈ సాంప్రదాయం (మడి) అనేది మనుషులని క్రమ పద్ధతిలో వుంచడానికి మాత్రమే అని. మరి అగ్రకులం కాని వారికి క్రమ పద్ధతి అక్కరలేదా అనే దానికి జవాబుండదు ఇక్కడ. మడికీ, శుభ్రానికీ చాలా దూరం వుంది నిజానికి. ఆ లెక్చరు విన్న తులసి చేసిందేవిటీ? తడి బట్టలతో, ఫ్యూడల్ ప్రేక్షకులకి కనువిందు చేస్తూ, వంటగది లోకి వెళ్ళడం. అదీ శుభ్రం అంటే! ఈ శుభ్రం వంటయ్యాక వుండదు. ఒంటి నిండా, బట్టల నిండా పడ్డ ఆ వంట మరకలతోనే వుంటారు గానీ, మళ్ళీ స్నానం చెయ్యరు. మడి నేర్పే శుభ్రం ఇదీ! చిన్న పిల్లకి తడి చీర చుట్టడం కదూ సాంప్రదాయం అంటే? ఆ గోల లేకపోతే శారద పడిపోకుండా, శుభ్రమైన బట్టలతో, శుభ్రంగా చిన్న బిందెతో నీళ్ళు పట్టుకెళ్ళ గలిగేదే! అప్పుడు ప్రేక్షకుల గుండెలకి హత్తుకుపోయే ఈ సంఘటన వుండేది కాదు మరి!

ఇక ప్రాశ్చాత్య సంగీత విషయానికి వద్దాం. ఏ సంగీతం గొప్ప దానిదే, ఒకదానితో ఒకటి పోల్చకూడదు, అంటూ శాస్త్రీయ సంగీతం చేతిలో ప్రాశ్చాత్య సంగీతాన్ని ఓడగొడతాడు శంకరశాస్త్రి. ఎటొచ్చీ ఆ ఓడిపోయిన వాళ్ళు వొట్టి జులపాల వెధవలు కాబట్టి, ఎవరికీ (నాక్కూడా) వాళ్ళంటే జాలి కలగలేదు. ప్రాశ్చాత్య సంగీతం వాళ్ళు పాడింది తను చాలా సులభంగా పాడేస్తాడు. కానీ, అతను పాడింది మాత్రం ఆ ప్రాశ్చాత్య సంగీతం వాళ్ళు పాడలేరు. అప్పుడు ఏ సంగీతం ఓడినట్టు? ఒకదానితో ఒకటి పోల్చకూడదు, అంటూనే ఈ పైత్య వికారాలు చూపిస్తారు. "మా భాష గొప్ప మాది, మేం ఇతర భాషలతో పోల్చం, ఇతర భాషల వాళ్ళు కూడా మా ప్రదర్శనలు చూడొచ్చు" అని చెప్పుకునే, ఈ తెలుగు ఆర్గనైజేషను వాళ్ళు, "దేశ భాషలందు తెలుగు లెస్స" అని పెద్ద బేనర్లు కట్టుకుంటారు, సిగ్గనేది లేకుండా. ఇది కూడా అలాగే.

సినిమా చివరికి తులసి కూడా శంకరశాస్త్రితో మరణించడం కృత్రిమంగా వుండే సన్నివేశం. శంకరశాస్త్రి అంటే, గుండె పట్టుకుని, దగ్గి, దగ్గి, పాడ లేక మరణించాడు. అర్థముంది ఇందులో. కానీ తులసి సడన్‌గా చనిపోవడమేమిటీ, సినిమా ట్రిక్ కాకపోతే? ఏదో శంకరశాస్త్రి మరణం చూసి తట్టుకోలేక పోయిందా అంటే అదీ లేదు. తులసికి శంకరశాస్త్రి పోయినట్టు తెలియదు, ఆయన కాళ్ళ మీద మోకరిల్లేసరికి. సినిమా మరణం ఇది.

ఒకరికి తెలియకుండా ఇంకొకరిని గుడికి రమ్మని, శారదనీ, కామేశ్వరావునీ గుడికి రప్పించి, వాళ్ళిద్దరినీ దగ్గరగా రప్పించి, వాళ్ళ పెళ్ళికి శంకరశాస్త్రి ఒప్పుకున్నారని చెప్పి, కిల కిల లాడుతూ పారిపోతాడు శంకరం. చిన్న పిల్లల చేత ఇటువంటి నటన కృతకంగా వుంటుంది. ఇది చూస్తే, "అంజలి" సినిమాలో, అర్ధరాత్రి పూట, "మొట్టమాడి, మొట్టమాడి, లవ్ జోడి, లవ్ జోడి" అని పాట పాడుతూ, రహస్యంగా ప్రేమికులిద్దరినీ కలిపే "రౌడీ పిల్లలు" గుర్తొచ్చారు నాకు. ఎటొచ్చీ ఈ సినిమాలో అది కాస్త సాఫ్ట్‌గా వుందంతే!

శంకరం, "తల్లీ, తండ్రీ పోయారనీ", "అంతకుముందు, ప్రాశ్చాత్య సంగీతం వాళ్ళని వెక్కిరించడానికే, అలా డాన్సు చేస్తూ తలుపులు బాదాననీ", అబద్ధాలు ఆడేస్తూవుంటాడు. చిన్న పిల్లాడి చేత అబద్ధాలు ఆడించడం అనవసరం. కధని అలా కాకుండా కూడా నడిపించొచ్చు.

ఇంకో విషయం. తులసి, హత్య కేసు లోంచీ చట్టబద్ధంగా ఎలా తప్పించుకుందో నాకర్థం కాలేదు. తులసి తనపై అత్యాచారం చేసినందుకు వాణ్ణి చంపలేదు. వాడు శంకరశాస్త్రి ఫోటో తన్ని, బద్దలు చేసినందుకూ, శంకరశాస్త్రిని దూషించినందుకూ, చంపింది. ఇక్కడ ఆత్మ రక్షణ అన్న విషయమే లేదు. పైపెచ్చు తులసి తల్లిని పోలీసులు జైల్లో పెడతారు. ఎందుకో దర్శకులు చెప్పరు. ప్రేక్షకులు వూహించుకోవలిసిందే కూతుర్ని వ్యభిచారానికి బలవంతం చేసిందని పెట్టారో, కూతురు ఎవర్నో పొడిచిందని పెట్టారో తెలియదు. ఎటొచ్చీ ఆ తల్లి పాత్ర చెడ్డది కాబట్టి, ఎవరూ పట్టించుకోరు. పైపెచ్చు తులసిని శారీరకంగా నిర్బంధించి, ఆ వృత్తికి బలవంతం చేసే మేనమామని మాత్రం వదిలేస్తారు చట్టబద్ధంగా. దుర్మార్గుణ్ణి పొడిచెయ్యడమే కాకుండా, ఆ రక్తాన్ని శంకరశాస్త్రి కాళ్ళకి పులుముతుంది తులసి. ఆ శంకరశాస్త్రి కదలకుండా, మెదలకుండా, శ్రావణ మంగళవారం నోము నాడు పసుపు రాయించుకున్నట్టు, రాయించుకుంటాడు రక్తాన్ని. మామూలు మనుషులయితే, తుళ్ళి పడి, లేచి గెంతేస్తారు అలా ఎవరన్నా రక్తాన్ని తమ కాళ్ళకి పులుముతుంటే. గాంభీర్యాన్ని జీర్ణించుకున్న ఫ్యూడల్ మనుషులు మాత్రమే కుయ్యనరు, కయ్యనరు. భారతంలో పాంచాలీ శపథం ఘట్టం గుర్తొచ్చేటట్టుగా వుంది ఈ సీను.

ఇంకా ఈ పాత్రలకి కళంకం వచ్చే విషయాలు కొన్నున్నాయి. అవి వేరే విమర్శకులు రాసెయ్యడం వల్ల, ఆ విషయాలు ఇక్కడ ఎత్తడం లేదు.

తులసిని చేరదీసినప్పుడు దూరమై పోయిన మిగిలిన ఆర్కెస్ట్రా వాళ్ళూ, శ్రోతలూ, మళ్ళీ తులసి శంకరశాస్త్రిని వదిలి పెట్టి వెళ్ళిపోగానే, శంకరశాస్త్రికి దగ్గరవుతారు, ప్రాశ్చాత్య సంగీతం వెల్లువలో, శాస్త్రీయ సంగీతం కొట్టుకుపోయే వరకూ. ఈ విషయంలో శంకరశాస్త్రికి వారి పైన విమర్శ అనేదే వుండదు.

ఇంకో ప్రశ్న. ప్రాశ్చాత్య సంగీతం శాస్త్రీయ సంగీతాన్ని నొక్కేసిన కాలం ఇండియాలో నిజంగా వుందా? వుంటే, అది ఏ సంవత్సరం నించీ, ఏ సంవత్సరం వరకూ? ఇండియాతో ప్రాశ్చాత్య దేశాల సంబంధాలు మొదలయ్యాక, ఆ సంస్కృతిలో అన్నింటితో పాటు, సంగీతం కూడా ఇండియాలో ప్రవేశించింది. ఇషపడ్డ వాళ్ళు ఇష్ట పడ్డారు. మనం ఇష్టపడేదే గొప్ప సంగీతమూ, ఇతరులు ఇష్టపడేది కానట్టూ కాదు కదా? సరే! అలాగే నొక్కేసిందే అనుకుందాం. ఎక్కువమంది ప్రజలు ప్రాశ్చాత్య సంగీతం మోజులో పడిపోయి, శాస్త్రీయ సంగీతాన్ని పట్టించుకోలేదనుకుందాం. మరి సినిమా చివరికి, తులసి, శంకరశాస్త్రి పాట కచ్చేరి ఏర్పాటు చేయిస్తే, అంత మంది జనం ఎలా వచ్చారు? శాస్త్రీయ సంగీతాన్ని ప్రజలు ఇష్టపడటం లేదు కదా? వారందరూ ఎలా మారిపోయి ఆ సభకు వచ్చారూ? జవాబు లేని ప్రశ్న ఇది!

****

# వంశవృక్షం

సాయంకాలం వరకూ ఆఫీసులో జీతం కోసం అడ్డమైన చాకిరీ చేసి ఇంటికి చేరాను. కారు గేరేజీలో పెట్టి, లోపలకి నడిచాను.

"నాన్నా, నాన్నా, నాకు ఫామిలీ ట్రీ కావాలి నాన్నా" అంటూ మీదకి వురికింది నాలుగో క్లాసు చదివే మా అమ్మాయి.

"అక్కకేది కొంటే, నాకూ అదే కొనివ్వాలన్నట్టు" మొహం పెట్టి, పులుకూ, పులుకూమని చూస్తున్నాడు ఒకటో క్లాసు చదివే మా అబ్బాయి.

"పాపం, ఏదో చెట్టు కావాలిట. కొనిచ్చేయకూడదూ పిచ్చి ముండకి" అని మా వరలక్ష్మి నాకో రెకమెండేషను పారేసి, "అబ్బా, నువ్వూరుకోవే, నాన్న కొనేట్టు చూసే పూచీ నాదీ! సరేనా?" అంటూ మా అమ్మాయిని సముదాయించింది, అల్లరిగా నవ్వుతూ.

"అయ్యో, అమ్మా! అది చెట్టూ కాదూ, పాడూ కాదూ! ఫామిలీ ట్రీ పెద్ద కార్డు మీద గీసివ్వాలి. అది మా స్కూలు ప్రాజెక్టు. రేపే సబ్మిట్ చెయ్యాలి. దాంట్లో మన ఫామిలీలో అందరి గురించీ రాయాలమ్మా!" అనంటూ మా అమ్మాయి వాళ్ళమ్మకి బోధించింది ముదినాపసాని లాగా.

ఏడేళ్ళ వయసులో అమెరికా వచ్చిన మా అమ్మాయికి తెలుగు బాగానే వచ్చు. ఈ మధ్య కాలంలో వాళ్ళమ్మతో తెలుగు సినిమాలు బోల్డు చూసి, ఇంకా పెద్ద, పెద్ద మాటలన్నీ నేర్చుకుంది. నాలుగేళ్ళకే అమెరికా వచ్చేసిన మా పిల్లాడికి వచ్చింది అరకొర తెలుగు మాత్రమే. కానీ తనకి ఎక్కడ అన్యాయం జరిగి పోతుందోననే దుగ్ధతో, వాళ్ళక్కా, వాళ్ళమ్మా మాట్లాడే మాటలు అర్థం చేసుకోవడానికి తెగ ప్రయత్నించేస్తాడు.

మా పిల్ల హోం వర్కు విషయం ఆఖరి రోజు వరకూ చెప్పదు. చెప్పాక, ఇంటిల్లిపాదీ ఇంక దాని మీదే పని చెయ్యాలి.

"ఓ! వంశవృక్షమా! అంతేనా! ఈ మాత్రం దానికి నాన్న దాకా ఎందుకే, పిచ్చి మొహమా? నేను లేనూ?" అనంటూ మా వరలక్ష్మి నా వేపు గొప్పగా చూసి లోపలకి వెళ్ళింది.

తెలుగు మీడియం బియ్యే వరలక్ష్మి ఇంగ్లీషులో కాస్త వీకు. నాకైతే కాస్త ఇండియా ఇంగ్లీషు వచ్చు గానీ, ఈ అమెరికా ఇంగ్లీషు బొత్తిగా నములుడు పడదు. ఏ పదం ఎలా పలకాలో తెలిసి చావదు. చాలా వీకు నేను అమెరికా ఇంగ్లీషులో. మా పిల్లలు మా ఇద్దరితో ఎలాగో అలాగ వేగుకుంటూ వస్తున్నారు. మా వరలక్ష్మి మాత్రం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు తెగ చదివేస్తుంది. ఈ మధ్య కాలంలో అయితే పాత, కొత్త సాహిత్యాలని కాచి వడ పోసేస్తోంది కూడా.

"నాన్నా, నాక్కూడా ఫామిలీ ట్రీ కావాలి నాన్నా" అంటూ మా అబ్బాయి నా చెయ్యి గుంజాడు.


వీళ్ళందరి గొడవతో ఆఫీసు అలసట పూర్తిగా మర్చిపోయాను.

"అలాగేనర్రా! మీ అమ్మ 'నేనున్నానంటూ' లోపల కెళ్ళింది కదా? వంటింట్లో చేస్తోందేమో వంశవృక్షాలు. రెండు ప్లేట్లలో చెయ్యమందాం. నీకోటీ, తమ్ముడికోటీ!" అన్నాను పిల్లలిద్దరినీ దగ్గరకు తీసుకుంటూ, ఎలాగో అలాగ మభ్యపెట్టడానికి.

"వంశవృక్షం వద్దు నాన్నా! ఫామిలీ ట్రీ కావాలి. ప్లేట్లో వద్దు. పెద్ద బోర్డు మీద కావాలి" అంటూ మా అమ్మాయి ఏడుపు మొహం పెట్టింది. వాళ్ళమ్మ 'వంశవృక్షమ'నే పదార్థం ప్లేట్లో పెట్టి పట్టుకొస్తుందని, మా అబ్బాయి నోరూరించుకుంటూ, స్థిమితంగా ఎదురు చూస్తున్నాడు.

వరలక్ష్మి లోపల్నించీ ఓ కాగితంతో వచ్చి, "హో, హో" అని పిల్లలిద్దరూ దడుచుకునేలా, ఓ వికట్టహాసం చేసి, విజయగర్వంతో నా మొహం వేపు చూసింది. ఆవిడ చేతిలోంచి కాగితం లాక్కుని చూశాను, మళ్ళీ ఏమన్నా కవిత్వం గిలికిందేమోనని. దాంట్లో ఈ బొమ్మ వుంది.

వంశవృక్షం




మా అమ్మాయి ఆత్రుతగా కాగితం నా చేతిలోంచీ లాక్కుని, ఏడుపు మొహం పెట్టింది తెలుగు చదవడం రాక.

"ఏం రాసింది నాన్నా, అమ్మ ఈ ఫామిలీ ట్రీలో?" ఏడుపొక్కటే తక్కువ పిల్లదానికి.

నేను పిల్లకి వాళ్ళమ్మ రాసిందంతా ఇంగ్లీషులోకి అనువాదం చేసి చెప్పాను గొప్పగా.

పిల్ల మళ్ళీ యేడుపు మొహం పెట్టింది.

"మళ్ళీ ఏమైందే నీకు? అస్తమానూ యేడుపు మొహం పెడతావేం?" అంది వరలక్ష్మి విసుక్కుంటూ.

వాళ్ళమ్మ ఏదో తినడానికి పట్టుకొస్తుందనుకున్న మా పిల్లాడు చాలా నిరాశ పడ్డాడు ఆ కాగితం మీద పిచ్చి గీతలు చూసి.

మా పిల్లకి వాళ్ళమ్మా, వాళ్ళమ్మ విసుగూ రెండూ అలవాటే.

"అబ్బా, అది కాదే! మా ఫ్రెండు లూసీ పెద్ద బోర్డు మీద ఫామిలీ ట్రీ వేసి పట్టుకొచ్చింది. ఈ చిన్న కాగితం సరిపోదమ్మా!" అంటూ మా ముదినాపసాని వాళ్ళమ్మనే తిరిగి విసుక్కుంది.

ఫక్కున నవ్వాను నేను.

"ఎందుకా నవ్వు రాక్షసుడిలా?" అంటూ వరలక్ష్మి వురుముతూ చూసింది నా వేపు.

"అది కాదోయ్! వంశవృక్షమంటే, వంశం లోని అందరి పేర్లూ రాయాలి. వుత్త మన కుటుంబం మాత్రం రాస్తే సరిపోదు. ఆ వంశంలో వారు పెళ్ళి చేసుకున్న వారి పేర్లూ, వాళ్ళ పిల్లల పేర్లూ, ఆ పిల్లలు పెళ్ళి చేసుకున్న వారి పేర్లూ, మళ్ళీ వాళ్ళ పిల్లలూ, ... ఇలా పెద్ద వంశవృక్షం తయారు చేయాలి. తెలుసా?" అంటూ జ్ఞాన బోధ చేశాను పెద్ద శాస్త్రవేత్తలాగా.

వరలక్ష్మి నోరు తెరుచుకు వింది చెప్పిందంతా.

"ఎందుకంట వాళ్ళ పేర్లన్నీ? మన చంటిది వాళ్ళ ముక్కూ, మొహాలన్నా ఎరిగుండదు కదా? ఆ పేర్లు వాళ్ళ టీచరుకి ఎందుకూ? `పిల్లల పేర్లు` అనే పుస్తకమేమన్నా రాస్తోందా, ఇవన్నీ కలెక్టు చెయ్యడానికి?" అని విస్తుబోయింది.

"అదేం కాదు లేవోయ్! ఎవరి వంశంలో వారిని, వారు తెలుసుకోవాలనీ, వాళ్ళ వంశం గురించి పిల్లలు `గర్వ పడా`లనీ స్కూలు వారి ఆశయం."

"కాకి వంశం కాకికి గర్వం. అదేం గొప్ప? అమ్మమ్మా, నాయనమ్మా, తాతలూ తెలిస్తే చాలదా? ఎప్పుడో పోయిన ముత్తాతలు ఎందుకూ? బతికున్న మనుషులతో అభిమానాలతో వుండటం లేదు గానీ, పోయిన వాళ్ళందరి గురించీ గర్వపడటం! అది సరే గానీ, `వంశం`, `వంశం` అంటున్నావూ, ఎవరి వంశం? మీ వంశమా? మా వంశమా? పిల్ల ఎవరి వంశవృక్షం గీయాలి?"

"ఆ మాత్రం కూడా తెలియదా? నువ్వు నన్ను పెళ్ళి చేసుకుని మా వంశంలోకి వచ్చేశావు కదా? కాబట్టి మా వంశం గురించే గీయాలి" అన్నాను పొంగిపోతూ.

"పళ్ళు రాలగొడతాను ఆ మాటంటే! పెళ్ళి తర్వాత నేను ఇంటి పేరు మార్చుకోనే లేదు. నేను నీ వంశంలోకి వచ్చేశానంటావేమిటీ? నా వంశం నాదీ, నీ వంశం నీదీ! నువ్వే నీ ఇంటి పేరు మార్చుకుని నా వంశంలోకి వచ్చేయకూడదూ, ఇంచక్కా బాగుంటుందీ?" అని కోపంగా మొదలుపెట్టి, సానునయంగా ముగించింది వరలక్ష్మి.

"స్త్రీ స్వేచ్ఛ నుపయోగించి ఇప్పటికే భర్తని నువ్వంటున్నావు. ఆ పాపానికే ఒక కన్ను పోతుంది. ఇప్పుడు నన్ను నీ వంశంలోకి ఇల్లరికం రమ్మంటున్నావు. ఆ పాపానికి రెండో కన్ను కూడా పోతుంది మరి!" అన్నాను వుడుక్కుంటూ.

"పోతే పోనీ లేద్దూ! కొత్త కళ్ళు కొనుక్కుంటానులే!" అంది వరలక్ష్మి నిర్లక్ష్యంగా.

విస్తుబోయి చూశాను ఆ బడాయి మాటలకి.

నేనేమీ అనకపోవడం చూసి, "అయితే మా `కూచి` వారి వంశం ఖరారు చేసెయ్యనా?" అని అడిగింది ప్రేమగా నవ్వుతూ.

"అదేం కుదరదు. మీ `కూచి` వారి వంశం కన్నా, మా `బొక్కా` వారి వంశమే గొప్ప బాబూ!" అన్నాను మొండిగా.

" ఆ మాటే అనొద్దనేది! నన్నేమైనా అను గానీ, నా బంగారు వంశాన్ని మాత్రం ఏమీ అనకు. మళ్ళీ బాగుండదు. నాకైతే నలుగురన్నదమ్ములూ, ముగ్గురు అక్కలూ వున్నారు. నీకూ? లింగు లిటుకుమంటూ, నువ్వూ, మీ అక్కా! అంతే కదా? కాబట్టీ, `కూచి` వారి వంశం అయితే పెద్ద వంశవృక్షం గియ్యొచ్చు" అంది వరలక్ష్మి లాజిక్కు తీస్తూ.

"ఏం కాదు, మా బొక్కావారి వంశమే!"

"అంతకన్నా కాదు, మా కూచి వారి వంశమే!"

"బొక్కావారు"

"కూచివారు"

"బొక్కా"

"కూచి"

"అబ్బబ్బా! మిమ్మల్ని దెబ్బలాడుకోవద్దని ఎన్నిసార్లు చెప్పానూ? అమ్మా, నాన్న అన్నీ కొంటాడు కదా? అందుకని నాన్న మాట విందామని చెప్పానా, లేదా?" అంటూ మా ముదినాపసాని నన్ను వెనకేసుకొచ్చింది.

"ఏం కాదు! అమ్మ అన్నీ వండి పెడుతుంది. అమ్మ మాటే వినాలి" అంటూ వచ్చీ రాని తెలుగులో మా దుడుకు వెధవ వాళ్ళమ్మ తరఫున యుద్ధానికి సిద్ధమయ్యాడు.

"కాదు, నాన్న మాటే!"

"కాదు, అమ్మ మాటే!"

"నాన్నే!"

"అమ్మే!"

"నాన్నే అని చెప్పానా?" అంటూ తమ్ముడి చెయ్యి మీద ఒక్కటేసింది అక్క.

"అమ్మే అని చెప్పానా?" అంటూ ఎదురు తిరిగి అక్క వీపు మీద ఒక్కటేశాడు తమ్ముడు.

ఇద్దరూ కలియబడ్డారు పిల్లుల్లాగా.

మేమిద్దరం వాళ్ళిద్దర్నీ విడదీసి, పట్టుకున్నాము. ఎప్పుడొదుల్తామా, మళ్ళీ కలియబడదాం అని వుత్సాహంగా చూస్తున్నారు అక్కా, తమ్ముళ్ళిద్దరూ.

"సరే, కూచి వారి వంశమే ఒప్పుకుందాం అనుకో! అది కూడా నీకు మీ నాన్న నించీ వచ్చింది గానీ, మీ అమ్మ నించీ కాదు కదా? అదీగాక నీకు మాత్రం మీ అమ్మ వేపు వాళ్ళూ, నాన్న వేపు వాళ్ళూ ఎవరు తెలుసేంటీ?" అన్నాను రాజీకొస్తూ.

"భర్త దాస్యం కన్నా, తండ్రి దాస్యం నయం ఆడదానికి. తండ్రంటే జన్మనిచ్చాడు కాబట్టి, కనీసం ఆ మనిషి ఇంటి పేరు మొయ్యడం నయం, నీ ఇంటి పేరు మొయ్యడం కన్నా! నీకు మాత్రం నీ మేనత్తల పేర్లు తెలుసా? వాళ్ళ నెప్పుడన్నా చూశావా? మీ అమ్మ వేపు వాళ్ళు కొంతమంది తెలుసనుకో నీకు" అంది ధాటీగా.

"చలం పుస్తకాలు చదవొద్దంటే వింది కాదు. ఇప్పుడెలా మాట్టాడుతోందో!" అని మనసులోనే విసుక్కున్నా ను.

వరలక్ష్మి మాట్టాడినవన్నీ నిజాలే మరి! మా నాన్న వేపు వారితో మాకు సంబంధాలేవీ లేవు. చిన్నప్పుడే, చితకబాదారని, ఇంట్లోంచి పారిపోయి, సొంత జీవితం మొదలు పెట్టాడు మా నాన్న. చాలా యేళ్ళు పోయాక, మళ్ళీ వాళ్ళతో రాకపోకలు మొదలుపెట్టాడు. పిల్లలు పుట్టేక అవి కూడా పోయాయి. పాత అయిష్టాలే మిగిలియి. వాళ్ళ పేర్లు కూడా తెలియకుండా, బొక్కావారి వంశవృక్షం ఎలా గీసేదీ?

"ఈ వూళ్ళో మా నాన్న వేపు వాళ్ళు ఎవరో వున్నారుట. వాళ్ళనడిగి కనుక్కుంటాను ఆ పేర్లన్నీ!" అన్నాను నంగిగా.

ఓటమి ఒప్పుకో బుద్ధి కాదు నాకు బొత్తిగా.

"ముక్కూ, మొహం తెలియని వాళ్ళ పేర్లూ, ప్రేమాభిమానాలు లేని వాళ్ళ పేర్లూ రాసుకోవడానికి సిగ్గనిపించదా నీకూ?" అని వరలక్ష్మి తీవ్రంగా అడిగింది.

నిజమే మరి! మా అమ్మ వేపు కూడా చుట్టాలు బోలెడంత మంది వున్నారు గానీ, ప్రేమాభినామాలు తక్కువే. సున్నితత్వం వదిలేసుకుని, నిజమైన ప్రేమాభిమానాలు అక్కర్లేదనుకుంటే, బోలెడు మంది వచ్చి చేరుతారు వంశవృక్షంలోకి. ఎటొచ్చీ చుట్టాలన్న వాళ్ళు జీవితాల్లో ఎన్ని తప్పులు చేసినా, భరించి, చూసీ చూడనట్టు వూరుకోవాలి. వాళ్ళ బండ ప్రవర్తన్ని భరించాలి. అప్పుడు బోల్డు బలగం వుందని చెప్పుకోవచ్చు. అలా చేతగాకపోతే, చిన్న కుటుంబంగానే మిగిలిపోతాం మరి. ఇక చుట్టాల్ని ఒదిలేసి, జగదేక కుటుంబం, వసుదైక కుటుంబం అనుకుటూ, చుట్టూ వున్న వాళ్ళతోనే సంబంధాలు ఏర్పరచుకోవాలి.

"అయినా చిన్న పిల్లల కెందుకీ వంశవృక్షాలు? వాళ్ళకేం తెలిసేడుస్తుంది తల్లీతండ్రుల మధ్య సంబంధం? ఏం అర్థమవుతుందీ?" అన్నాను కాస్త విసుక్కుంటూ.

"నిజమే! మంచి పాయింటే! ఇంకో విషయం చూడు. మనలో మన మాట. ఎవరన్నా ఒక పది తరాల వంశవృక్షం తయారు చేశారనుకో. అందులో వున్న వారంతా ఆ వంశానికే చెందిన వారని ఎలా రుజువు చెయ్యగలరూ? మగవాళ్ళలో వ్యభిచారం ఎక్కువగానే వుంటుంది కదా సమాజంలో? మగవాళ్ళు కూడా వ్యభిచారం చేసేది ఆడవాళ్ళతోనే కదా? ఆ విధంగా ఆ గొప్ప వంశంలో ఎక్కడో ఏదో తప్పు జరిగి, వంశక్రమం తప్పి వుండొచ్చు కదా అప్పుడు ఆ వంశవృక్షానికున్న ఆథెంటిసిటీ ఏమిటీ?" అని అడిగింది వరలక్ష్మి గబగబా.

ఏమో నాకేం తెలుసు అవన్నీ? అయినా, అమ్మో, అమ్మో! వరలక్ష్మి కెన్ని విషయాలు తెలుస్తున్నాయో!

"అవునూ, ఇలా వంశవృక్షాలు గీసుకోవడం ఎందుకూ?" అని అడిగాను వరలక్ష్మి అభిప్రాయం కోసం.

ఈ మధ్య కాలంలో వరలక్ష్మి పుస్తకాలు తెగ చదివేస్తోంది. వాటిల్లోంచీ నేర్చుకున్న విజ్ఞానాన్ని కాస్త నాకు ఒలకపోస్తుందేమోనన్న ఆశ.

"వంశవృక్షం వల్ల చాలా లాభాలున్నాయి మరి. ఒకటి: మా తాతలు నేతులు తాగారూ, మా మూతులు వాసన చూడండీ అని గర్వంగా చెప్పుకోవచ్చు. రెండు: ఇంటి పేర్లతో వాళ్ళ కులగోత్రాలు తెలిస్తే, పెళ్ళి సంబంధాల కుపయోగపడతాయి. కంపాటిబిలిటీ కోసం రక్త పరీక్షలు చేయించుకోరు గానీ, ఇంటి పేరూ, కులగోత్రాలూ బాగా చూస్తారు. ముప్ఫై రెండు: ముక్కూ, మొహం తెలియని వాళ్ళని మా వంశమే అని వంశగర్వంతో చెప్పుకోవచ్చు. తొంభై యారు: ఎవరి వంశవృక్షంలో ఎక్కువ మంది వుంటే, వారి వంశం అంత ఎక్కువ గొప్పన్న మాట. అందులో బాగా డబ్బున్న వారి పేర్లు వుంటే ఇంకా గొప్ప. నూరు: వంశవృక్షం వల్ల కీర్తి వొస్తుంది సంఘంలో. ప్రేమాభిమానాలు రావు గానీ, బోల్డు కీర్తి వొస్తుంది మరి. ఆ కీర్తితో బోలెడు పనులు జరిపించుకోవచ్చు. ఇలా నూరు లాభాలున్నాయి వంశవృక్షం వల్ల" అని వరలక్ష్మి గీత బోధ చేసింది.

మా వరలక్ష్మి జ్ఞానం చూస్తే, ముచ్చటేసింది నాకు. తెలివిగల భార్యలుంటే, ఎన్ని వుపయోగాలో అని మురిసిపోయాను. కానీ ఆ మాట బయటకి ఒప్పుకోవడానికి చిన్నతనం నాకు.

"నీ వేపు మాత్రం? నీ తోబుట్టువులు తప్ప నీకెవరూ తెలియరు కదా?" అన్నాను మళ్ళీ మొదటికొస్తూ.

"అవును, నిజమే! మా నాయనమ్మ తప్ప మా నాన్న వేపు ఎవరూ తెలియరు. ఆవిడ కూడా సొంత నాయనమ్మ కాదు. మా సొంత నాయనమ్మ చెల్లెలు. ఆవిడకి పిల్లలు లేక, మా నాన్నని చేరదీసి, మా నాన్న దగ్గరే వుండి పోయింది. తన ఆస్తులన్నీ మా నాన్నకే కట్టబెట్టింది. మా అమ్మ నా చిన్న తనంలో చుట్టాలున్నారని, పదేళ్ళకోసారి తెనాలి వెళ్ళొస్తుండేది రెండ్రోజుల కోసం. వాళ్ళెప్పుడూ మా కొంపకి రాలేదు మరి. మేనమామలూ, పెద్దమ్మలూ, పిన్నిలూ, మేనత్తలూ, పెదనాన్నలూ, బాబాయిలూ ఎవరూ తెలియరు మాకు. అయినా సరే, మా ఎనమండుగురు పిల్లలతోనే హడావుడిగా వుండేది ఇల్లెప్పుడూ" అంది కాస్త దిగులుగా.

"నీది మూసివుంచిన గుడ్డి కన్ను. చుట్టాలెవరూ లేరు. నాది తెరిచివుంచిన గుడ్డి కన్ను. మా చుట్టాలు ఇదే వూళ్ళో వున్నా, అభిమానాలు మాత్రం లేవు. తోబుట్టువుల పిల్లల మధ్య అభిమానాలు సరిగా వుండటం లేదు ఈ రోజుల్లో. కాలక్షేపానికి సంబంధాలు మెయింటైన్ చెయ్యడమే గానీ, నిజమైన అభిమానాలు ఎక్కడేడిశాయీ?" అన్నాను నేనూ ఇంకొంచెం దిగులుగా.

"అవునూ! మన పిల్లల సంగతేమిటీ? వీళ్ళిద్దరూ అభిమానంగా వున్నా, రేపు వాళ్ళ పిల్లలు అభిమానంగా వుంటారా? ఎవరి జీవితాల్లో వాళ్ళు బిజీ అయిపోతారు కదా? మనం మన కజిన్సుతో ప్రేమాభిమానాలతో లేకుండా, మన మనవళ్ళని వాళ్ళ కజిన్సుతో ప్రేమాభిమానాలతో వుండాలంటే, ఎలా కుదురుతుందీ?" అంటూ వరలక్ష్మి కళ్ళనీళ్ళు పెట్టుకోబోయింది.

ఇందాకట్నించీ మేం మాట్టాడుకుంటున్న మాటలు ఒక్కటీ అర్థమవక, పిల్లలిద్దరూ ఆటలో పడ్డారు.

మేం కాస్త తేరుకుని చూసేసరికి, మళ్ళీ పిల్లలిద్దరూ కలియబడుతున్నారు. ఇంతలో ఆడుకుంటారు, అంతలో కొట్టుకుంటారు.

"మళ్ళీ ఏమయిందర్రా?" అంటూ వాళ్ళని విడదీశాం.

"వాడు నన్ను కొట్టాడు నాన్నా" అంది పిల్ల తన తప్పేం లేనట్టు.

"అక్క నన్ను స్టుపిడ్ అందమ్మా!" అన్నాడు పిల్లాడూ తన తప్పు అసలు లేనట్టు.

నేను వీళ్ళని ముద్దుగా బురద పందీ, ముళ్ళ పందీ అని పిలుచుకుంటాను. మా పిల్ల బురద పంది. అంటే, ఏమీ ఎరగనట్టు, తన ఒంటి మీద బురదని తమ్ముడి మీద పడేలా ఒళ్ళు విదిలిస్తుంది అమాయకత్వం నటిస్తూ. మా పిల్లాడో ముళ్ళ పంది. వాళ్ళక్క ఏదన్నా అనగానే, ముందూ వెనకా చూడకుండా, వాళ్ళక్కని కుమ్మేయడానికి మీదకి వెళ్ళిపోతాడు ముళ్ళ పందిలాగా.

"నువ్వూరుకో, అక్క సంగతి నే చూస్తాగా" అని వరలక్ష్మి పిల్లాడికి భరోసా ఇచ్చింది.

"తమ్ముడి పని నేను పడతాగా" అని పిల్లకి నేను భరోసా ఇచ్చాను.

మొత్తానికి అలిసిపోయి, అందరం భోజనాలకి లేచాం.

"నాన్నా, మరి నా ఫామిలీ ట్రీ సంగతేం చేశావూ?" అంది మా పిల్ల పడుకోబోతూ.

"రేప్పొద్దున్నే తొందరగా లేచి, గీసి పెడతాలే. నువ్వు హాయిగా పడుకో!" అన్నాను నమ్మకంగా.

మర్నాడు ఇంట్లో అందరికన్నా తొందరగా లేచి, పెద్ద కేన్వాసు బోర్డు మీద వంశవృక్షం గీసాను. దానికి 'కూచీ-బొక్కా' అనే వంశం పేరు పెట్టాను. వరలక్ష్మి వేపూ, నా వేపూ ముత్తాతలూ, వాళ్ళ తాతలూ, అందరూ వున్నారు ఆ వంశవృక్షంలో. అప్పటికి పిల్లలిద్దరూ స్కూలుకి వెళ్ళడానికి తయారయ్యారు.

"భలే పెద్దది గీశావు నాన్నా! లూసీ ఫామిలీ ట్రీ కన్నా పెద్దది నాది. భలే, భలే!" అంటూ పిల్ల సంతోషంగా ఆ కేన్వాసు బోర్డు తీసుకుని, స్కూలుకెళ్ళడానికి బయలుదేరింది.

"ఇద్దరి వేపు వాళ్ళ పేర్లూ ఇద్దరికీ తెలియవు కదా? రాత్రికి రాత్రి ఎలా తెలుసుకున్నావు అవన్నీ?" అడిగింది వరలక్ష్మి ఆశ్చర్యంగా.

"ఆ, నా మొహం! నీ వేపూ, నా వేపూ వాళ్ళ పేర్లు నోటికొచ్చినవి రాశాను ఇంటి పేర్లతో సహా. ఇలాంటి పనికిరాని ప్రోజెక్టులకి ఎథిక్సు ఒక్కటే తక్కువ. ఈ రోజు తర్వాత మళ్ళీ స్కూలు వాళ్ళు గానీ, పిల్లలు గానీ ఆ వంశవృక్షం గురించి పట్టించుకోరు జీవితంలో, తిరిగి తమ పిల్లలకి గియ్యడానికి తప్ప. పిల్ల చూడు, ఎంత సంబరపడి పోయిందో పెద్ద వంశవృక్షం చూసి. పిల్ల ఆనందం కన్నా, ఎథిక్సు ముఖ్యమా ఇలాంటి పనికిరాని విషయాల్లో?" అన్నాను నన్ను నేను సమర్థించుకుంటూ.

వరలక్ష్మి పెద్దగా నోరు తెరిచి, చూస్తూ వుండిపోయింది.

"ఆశ్చర్యపోయింది చాలు, ఇక ఆ నోరు మూసెయ్యి. నేను ఆఫీసుకెళ్ళొస్తాను" అన్నాను బయల్దేరుతూ.

అప్పటికి కాస్త తేరుకుని, "సాయంకాలం వచ్చేటప్పుడు వంశవృక్షం పట్టుకు రండి" అంది.

"ఏంటీ? జోకులా?" అడిగాను గుర్రుగా.

"అబ్బే! అది కాదు. నేను తెమ్మన్నది బాపూ "వంశవృక్షం" సినిమా డీవీడీ" అంది నవ్వు దాచుకుంటూ.

వుడుక్కుంటూ బయల్దేరాను ఆఫీసుకి.

****

# నక్సలైటూ X గేటెడ్ కమ్యూనిటీ

నేను అమెరికాలో ఓ నాలుగేళ్ళు పని చేసి, భార్యాపిల్లలతో ఇండియా వచ్చేశాను. ఇక్కడే కలో, గంజో కాచుకుందామని. తీరా చూస్తే, కలో, గంజో ఏం ఖర్మ, రోజూ పరమాన్నమే వండుకునే వుద్యోగం దొరికింది. అమెరికా వెళ్ళే ముందు ఓ పది వేలు యేడాదికి ఇవ్వడానికి ఏడిచే ఈ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఇప్పుడు పది లక్షల పైన ఇవ్వడానికి పోటీ పడుతున్నాయి. అవును మరి, ఆఫ్‌షోర్ అంటూ, దానికి వంద రెట్లు సంపాదిస్తున్నాయి కదా మరి? అదీగాక, ఎంతైనా నేను అమెరికా రిటర్న్‌డ్ కదా?

ఏమయితేనేం, మంచి కార్లు రెండు కొనుక్కున్నాము. పిల్లల్ని ఖరీదైన ప్రైవేటు ఇంటర్నేషనల్ స్కూల్లో వేశాము. ఒక కారు నేను వాడితే, ఇంకో కారు పిల్లలకీ, మా ఆవిడకీ. పిల్లల్ని స్కూల్లో దింపడానికి ఓ డ్రైవర్‌ని కూడా పెట్టుకున్నాము ఇంచక్కా.

ఇంక ఇల్లు. అమెరికాలో మిగుల్చుకున్న డాలర్లు రూపాయల్లోకి మార్చుకుని మంచి ఇల్లు ఓ గొప్ప కాలనీలో కొన్నాము. లోన్ గోలే లేదు. మొత్తం డౌన్ పేమెంటు మరి! అమెరికా రిటర్న్‌డా, మజాకానా? మా కాలనీలో ఒక పాతిక వరకూ ఇళ్ళున్నాయి. మా కాలనీకి ఓ మేనేజ్ మెంటు బోర్డు కూడా వుంది. కాలనీ చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడా, లోపలకి రావడానికి పెద్ద గేటూ, దానికో వాచ్‌మేన్ - 24/7 అన్నమాట. వెరసి మా కాలనీని 'గేటెడ్ కమ్యూనిటీ' అంటారు కిట్టనివాళ్ళు. అది కూడా ఓ బిరుదులా అనిపించి, మేం కూడా గర్వంగా, "మాది 'గేటెడ్ కమ్యూనిటీ' అండీ!" అని చెప్పుకోసాగాం.

ఆ గేటు పుణ్యమా అని జంతువులూ, ముష్టి వాళ్ళూ, గంగిరెద్దుల వాళ్ళూ, గట్రా లోపలకి వచ్చేవాళ్ళు కాదు. మేం వాళ్ళ కష్టాలు చూసి తట్టుకోలేని కరుణా హృదయులం కదా? కూరగాయల బళ్ళని మాత్రం లోపలకి పంపమనే వాళ్ళం, బోలెడు పెట్రోలు పోసి, బోలెడు దూరం వెళ్ళి కూరలు కొనుక్కోలేక. అయితే ఆ కూరగాయల బళ్ళ వాళ్ళ దగ్గర్నించీ మా వాచ్‌మేన్ మామూలు దండుకుంటాడని తెలిసినా, మా గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళం పట్టించుకునే వాళ్ళం కాదు. మరి మా మేనేజ్‌మెంటు బోర్డు ఇచ్చే జీతానికి ఆ వాచ్‌మేన్ బతకలేడుగా మరి?

ఆ గేటు వాచ్‌మేన్, పిల్లుల్ని మాత్రం ఆపలేక పోయేవాడు. ఒకటి రెండు సార్లు కోతులు కూడా వొచ్చాయి. మా గేటెడ్ కమ్యూనిటీలో పిల్లులు వీర విహారం చేసేవి. ఇళ్ళలో మేం ముద్దుగా పెంచుకునే కుక్కలు తప్ప, మా కాలనీలో వేరే వూర కుక్కలు లేవు రోడ్డు మీద. ఒక రోజు ఎలాగో ఓ వూర కుక్క, వాచ్‌మేన్ పళ్ళ బళ్ళ వారితో బేరసారాల్లో వున్నప్పుడు, పారిపోయి వచ్చి, మా ఇళ్ళ ముందర తిరగడం మొదలు పెట్టింది. మా ఇళ్ళలో కుక్కలు, "ఇంట్లోకి రా, నీ పని చెబుతాం" అని మొరగసాగాయి ఆ వూర కుక్క మీద. అదేం తక్కువ తిందా? "రోడ్డు మీదకి రండి, మీ పని చెబుతాను" అంటూ తిరిగి మా ఇళ్ళ కుక్కల మీద మొరిగింది. వాచ్‌మేన్ దాని వెంటబడి, చాలా కష్టపడి బయటకి తరిమాడు. ఆ హడావుడిలో ఇంకో రెండు వూర కుక్కలు కాలనీ లోకి జొరబడ్డాయి. కానీ, మా ఇళ్ళ కుక్కలు అరిచి, గోల చెయ్యడం వల్ల, అవి మా వాచ్‌మేనుకి దొరికిపోయాయి. అతను వాటిని కూడా విజయవంతంగా బయటకి తరిమి, సగర్వంగా గేటు వేసేశాడు.

మా గేటెడ్ కమ్యూనిటీ పిల్లల కోసం అని ఒక పార్కు కూడా కట్టారు. ఇంచుమించు మా కాలనీలో ఓ ముప్ఫై మంది పిల్లలున్నారు. పార్కులో ఓ నాలుగు వుయ్యాలలు కూడా వున్నాయి. ఎటొచ్చీ సాయంకాలాలు పిల్లలు వుయ్యాల వూగాలంటే వాళ్ళ టర్న్ కోసం ఎదురు చూడాలంతే! ఎంత గేటెడ్ కమ్యూనిటీ అయినా ముప్ఫై వుయ్యాలలు కట్టుకోలేం కదా పార్కులో?

ఎటొచ్చీ మా గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళు 'అలగా జనం' లాగా కొట్టుకోరు. తమ వంతు వచ్చినపుడు తల్లి తన బిడ్డని వుయ్యాలలో కూర్చోపెట్టి వూపేది. మిగిలిన వాళ్ళు ఎదురు చూసేవారు తమ వంతు కోసం. ఐదు నిమిషాలు అవగానే, తల్లి, "హనీ! స్వీటీ! ఇంక మన టర్న్ అయిపోయిందమ్మా!" అని ముద్దుగా బిడ్డకి చెప్పేది.

"మమ్మీ, ప్లీజ్! కెన్ ఐ హేవ్ ఫైవ్ మోర్ మినిట్స్?" అని బిడ్డ ముద్దుగా ఇంగ్లీషులో అడిగేది.

తల్లి బిక్కమొహం వేసేది. ముద్దు ఆపుకోలేక పోయేది.

"ఎక్స్యూజ్ మీ! ఇంకో ఫైవ్ మినిట్స్ తీసుకుంటే, మీకు ఓకేనా?" అని మర్యాద ఒలకపోస్తూ, తమ వంతు కోసం ఎదురు చూస్తున్న బిడ్డ తల్లిని అడిగేది.

బిడ్డ తల్లి, ఏడవలేక, నవ్వు మొహం పెట్టి, "ఫరవాలేదండీ! ప్లీజ్ కేరీ ఆన్" అని అనేది.

పిల్లలు కూడా మర్యాదగా వూరుకునేవారు. అయితే, ఆ ఐదు నిమిషాలూ తమ వంతు కోసం ఎదురు చూస్తున్న వాళ్ళు గంటు మొహాలు పెట్టుకుని వుండేవాళ్ళు. పిల్లలు ఇంటికెళ్ళగానే గొడవ చేసేవారు. తల్లులు కూడా ఇళ్ళు చేరాక, మర్యాద ముసుగులు తీసే సి, మిగిలిన వాళ్ళని విమర్శించే వాళ్ళు.

ఈ గోల పడలేక, పక్కింటావిడ వాళ్ళ బేక్ యార్డులో పిల్లల కోసం ఒక వుయ్యాల కట్టించుకుంది. మొదట్లో ఆవిడ పిల్లలిద్దరూ వంతు కోసం కొట్టుకునేవారు మొహమాటం లేకుండా. రాను రాను వాళ్ళకి ఇంట్లో వుయ్యాల వూగడం విసుగు పుట్టి, "పార్కుకే పోదాం" అని గొడవ చేసేవారు.

కథ మళ్ళీ మొదటికే వచ్చేది.

మగవాళ్ళు మాత్రం ఏమీ తక్కువ తినలేదు. రైలు టికెట్టు రిజర్వేషను కోసం క్యూ లో కొట్టుకోకపోయినా, మిగిలిన విషయాల్లో పోటీగా వుండేవారు. ఎవరు ఏ కంపెనీలో స్టాకులు కొన్నారో, ఎవరికి ఎంత 'లాభం' వొచ్చిందో - ఒకటే పోటీ. ఇంక ఖరీదైన కార్లూ, ఎలక్ట్రానిక్సు సామానులూ కొనే విషయమైతే చెప్పక్కర లేదు.

అలాంటివి అడపా తడపా జరగడం తప్ప, మా గేటెడ్ కమ్యూనిటీ సుఖ, శాంతులతో వర్థిల్లుతూ వుంది.

ఒకసారి నాకు బాగా మనసు నొచ్చుకున్న విషయం జరిగింది. మా చుట్టాలాయన వాళ్ళూరు నించీ రైల్లో బయలుదేరి మా ఇంటికి వద్దామని బయల్దేరాడు. గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళం మేమే గానీ, మా చుట్టాలు కాదు గదా, కార్లో గానీ, విమానంలో గానీ రావడానికి? వస్తున్నట్టు మాకు తెలీదు, పోనీ రైలు స్టేషను కెళ్ళి రిసీవ్ చేసుకుందమనుకున్నా. రైల్లో ప్రయాణం చేసి, మట్టి కొట్టుకుని, మా గేటెడ్ కమ్యూనిటీ ముందర ఆటొ దిగితే, వాచ్‌మేన్ ఆయన్ని లోపలకి రానియ్యలేదు. వాచ్‌మేన్నీ, అతనితో పాటు మమ్మల్నీ, మిగిలిన గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళనీ తిట్టిపోసి, వెనక్కి పోయాడాయన. ఆ విషయం ఇంకొన్ని రోజులకి వేరే చుట్టాల ద్వారా తెలిసింది. వాచ్‌మేన్ని, "ఇదేంటయ్యా?" అని అడిగితే, "నాకు తెల్వదు సాబ్!" అనేశాడు.

బాసరలో చుట్టాలింట్లో పెళ్ళి కెళ్ళాము. మా ఆవిడ, ఉన్న నగలన్నీ దిగేసుకుని, చుట్టాలందరికీ చూపించి మురిసిపోయింది. పెళ్ళవగానే, భోజనాలు చేసి, కార్లో హైదరాబాద్ బయల్దేరాము.

అర్థరాత్రి పూట డ్రైవ్ చెయ్యడమంటే భయం నాకు. ఎక్కడ దొంగలొచ్చి దోచుకుంటారోననే భయం. అవును మరి, ఉన్న వాడికేగా దోచుకుంటారనే భయం? మర్నాడు పొద్దున్న కంపెనీలో బోనస్ మీటింగు లేకపోతే, అంత రాత్రి వేళ బయలు దేరేవాడినే కాదు. ఈ సారి రాబోయే బోనస్‌తో ఏం కొనుక్కోవాలో తోచి చావడం లేదు.

కొంచెం దూరంలో రోడ్డు మీద అడ్డంగా రాళ్ళు పెట్టి వుండటం చూసి, కారుకి సడన్ బ్రేకు వేశాను. మా ఆవిడ కారు దిగనని మొరాయించడం వల్ల, నేనే దిగి ఒక్కొక్క రాయీ ఎత్తి, దూరంగా రోడ్డు పక్కన పెట్టసాగాను. ఉన్నట్టుండి ఇంకో జత చేతులు నాకు తోడొచ్చాయి. అవి కూడా రాళ్ళెత్తి పక్కన పారేయసాగాయి. మొదట మా ఆవిడే మనసు మార్చుకుని వచ్చిందనుకున్నా. చిమ్మ చీకట్లో ఏమీ సరిగా కనబడటం లేదు. రాళ్ళెత్తడం పూర్తయి కారు దగర కెళ్ళాక, హెడ్‌లైట్ వెలుగులో ఆ జత చేతులకి సంబంధించిన ఆకారం కనబడింది. ఆ ఆకారం మొగ మనిషని పోల్చుకున్నాను. నల్ల దుప్పటి కప్పుకున్నాడు.

"చాలా థాంక్సండీ, రాళ్ళెత్తి సాయం చేసినందుకు" అన్నాను కృతజ్ఞతతో.

అప్పటికీ ఆ శాల్తీ ఎక్కడ నించీ వచ్చిందో అర్థం లాలేదు. దూరంగా బోలెడు చెట్లతో అడవి కనబడుతోంది.

"థాంక్సు ఎందుకూ? సహాయం చేయడం మానవధర్మం. మీరు ఇబ్బంది పడుతున్నారని సాయం చేస్తున్నాను. మామూలు ప్రజలకు సాయం చేస్తాం, పెట్టుబడిదారులకి సాయం చెయ్యం గానీ!" అందా శాల్తీ కాస్త గట్టిగా.

దోపిడీ దొంగేమోనని సందేహం కలిగింది. దొంగైతే సాయం ఎందుకు చేస్తాడూ?

"ఆ! పెట్టుబడిదారులా! వాళ్ళెవరూ? మీరెవరూ?" అని అడిగాను ఆశ్చర్యంతోనూ, భయంతోనూ.

"నేను నక్సలైటుని" అన్నాడా శాల్తీ గంభీరంగా.

మొదట ఆశ్చర్యపోయాను. తరువాత 'అన్న'ని కలిసినందుకు సంబర పడ్డాను. నా కన్నా చాలా చిన్నగా కనిపించినా, నాకు 'అన్నే' మరి! అన్నలు భూస్వాముల్నీ, పెట్టుబడిదారుల్నీ, రాజకీయ నాయకుల్నీ, పోలీసుల్నీ, చెడ్డ ప్రభుత్వ వుద్యోగుల్నీ మాత్రమే దోచుకుంటారని నేను విన్నాను. అస్సలు భయం వేయలేదు నాకు.

"మీరు 'అన్న' అన్నమాట! మేం పెట్టుబడిదారులం కామండీ! ఏదో కంప్యూటర్ కంపెనీలో పని చేస్తున్న బడుగు వుద్యోగులం. అంతే!" అన్నాను మురుసుకుంటూ.

ఆ హడావుడికి మా ఆవిడ కారు దిగింది. ఆ చీకట్లో కూడా ఆకాశంలో వున్న పిసరంత వెలుతురుకీ, కారు హెడ్‌లైట్ల కాంతికీ ఆవిడ మెడలో వున్న నగలూ, నడుంకున్న వడ్డాణం, చెవులకున్న రవ్వలూ, ముక్కు పుడకా, చేతులకున్న రవ్వల గాజులూ, బంగారు పట్టీలూ, వగైరా మెరిసిపోయాయి. మీరు నమ్మరు గానీ, ఆవిడ గుళ్ళోంచి షికారు కొచ్చిన అమ్మవారిలా వుంది. నా కళ్ళల్లో చిన్న భక్తి భావం తొణికిసలాడింది.

'అన్న' మా ఆవిడని తేరిపారా చూశాడు.

"ఇంత బంగారం పెట్టుకుని, బడుగు వుద్యోగులం అంటావేమిటీ?" ఆశ్చర్యంగా అడిగాడు అన్న.

"అలా అనకండి. మేం బాగా చదువుకుని, పైకొచ్చిన వాళ్ళం. గేటెడ్ కమ్యూనిటీలో వుంటాం. ప్రభుత్వానికి టాక్సులు కడుతూనే వున్నాము. మీరు కూడా మీ పిల్లల్ని బాగా చదివిస్తే, మా స్థాయికి వస్తారు. మా మీద ఎవరూ పడి ఏడవనక్కరలేదు. ఇదంతా మా కష్టార్జితం!" అంటూ గబగబా చెప్పేసింది మా ఆవిడ.

అసలు విషయం ఏమంటే, ఆ మధ్య ఓ పత్రికలో "గేటెడ్ కమ్యూనిటీ" అనే కథ వొకటొచ్చింది. అది చదివినప్పటి నించీ మా ఆవిడకి వుత్సాహం పెరిగిపోయింది. ఆ డైలాగులు ఎవరి దగ్గర వల్లిద్దామా అని ఎదురు చూస్తోంది ఇన్నాళ్ళూ!

ఆ కథ కుప్తంగా ఇదీ. ఒకాయన గేటెడ్ కమ్యూనిటీలో వుంటాడు. ఆయన కన్నా తెలివైన (చిన్నప్పుడు చదువులో), చిన్నప్పటి స్నేహితుడు (చాకలి వాళ్ళ అబ్బాయి) కలుస్తాడు. ఆ స్నేహితుడి కుటుంబం రైల్వేస్టేషన్‌లో క్యూ కోసం, పార్కులో పిల్లల వుయ్యాల కోసం ఘర్షణలు పడుతూ వుంటారు. తాము తక్కువ తరగతికి చెందిన వాళ్ళం కాబట్టి, తమకి అలాంటి ఘర్షణలుంటాయనీ, గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళకి అలాంటి కష్టాలుండవనీ అంటాడు. దానికి ఆ మొదటాయన భార్యకి కోపం పొడుచుకొస్తుంది. "మేం గవర్నమెంటుకి టాక్సులు కడుతున్నాం. కష్టపడి చదువుకుని పైకొచ్చాం. మీరూ మీ పిల్లలకి మంచి చదువులు చెప్పించి పైకి రావాలని చూస్తున్నారు కదా? భవిష్యత్తులో మీరు కూడా మాలాంటి గేటెడ్ కమ్యూనిటీ లోకే వొస్తారు. మా లాంటి వాళ్ళని ఆడిపోసుకోవడం ఎందుకూ?" అని ఝుమాయించి అడుగుతుంది. ఆ స్నేహితుడి కుటుంబం ఏమీ జవాబు చెప్పలేక, "అవును కదా, నిజమే కదా?" అనుకుంటుంది. అంతే, కథ అయిపోయింది.

అన్నకి కోపం వొచ్చింది మా విడ మాటలకి.

"ఇంత బంగారం మీ కష్టార్జితం తోటే సంపాదించుకున్నారా? మరి మీ కన్నా ఎక్కువ కష్ట పడేవాళ్ళూ, మీకన్నా ఎక్కువ చదువుకున్న వాళ్ళూ ఎందుకు సంపాదించుకోలేక పోతున్నారూ?" అని అడిగాడు అన్న.

"అలా అనకండి! 'గేటెడ్ కమ్యూనిటీ" కథ చదవలేదా? 'వివిధ'లో కూడా అందరూ సంవత్సరంలో వచ్చిన ఏకైక ఉత్తమ కథ అని మెచ్చేసుకున్నారు. మేమేమీ ఎవరి పొట్టా కొట్టడం లేదు. ఆ కథలో, పెద్ద పెద్ద కంపెనీల్లో పెద్ద పెద్ద వుద్యోగాలు చేస్తూ, పెద్ద పెద్ద

జీతాలూ, పెద్ద పెద్ద బోనస్‌లూ తీసుకునే వాళ్ళు గవర్నమెంటుకి టాక్సులు కట్టడం వల్ల తప్పు చేస్తున్నట్టు కాదనీ, వాళ్ళనేం అనకూడదనీ, మిగిలిన వాళ్ళు కూడా కష్టపడి వాళ్ళలా పైకి రావాలనీ చెప్పారు, తెలుసా?'' అంటూ ఆవేశంగా మా ఆవిడ మెడలో నగలు సవరించుకుంది.

''పెట్టుబడిదారుడు ఇతరుల శ్రమను దోచుకుంటూ, అందులో కొంత భాగాన్ని పెద్ద పెద్ద వుద్యోగులకి పెద్ద జీతాల రూపంలోనూ, పెద్ద బోనస్‌ల రూపంలోనూ, పెర్కుల రూపంలోనూ ఇస్తాడు. అంతేగానీ, మీ పెద్ద జీతం అంతా మీ కష్టార్జితమే అనుకోవడం మీ భ్రమ. ఆ పెట్టుబడిదారుడు మీకిచ్చిన స్టాకుల మీద వచ్చే డివిడెండ్ అంతా శ్రామికుల నించీ దోచుకున్న విలువే! పెట్టుబడిదారుడు కూడా టాక్సులు కడతాడు. అంత మాత్రాన అతని ఆదాయం అతని కష్టార్జితమా? ఈ దోపిడీ, 'చట్టబద్ధమ'యినంత మాత్రాన, 'నైతికం' అని అనుకోవడం మీ అజ్ఞానం!'' అంటూ అన్న చిన్న లెక్చరిచ్చాడు.

నాగ్గానీ, మా ఆవిడగ్గానీ ఒక్క ముక్క అర్థమయితే ఒట్టు. ఎటొచ్చీ మమ్మల్నీ, మా సంపాదననీ తిడుతున్నాడని మాత్రం మా ఇద్దరికీ అర్థం ఆయింది.

''ఏం, మీరు మాత్రం తక్కువ తిన్నారా? మమ్మల్నంటున్నావు మాటలు. చొక్కా విప్పుకుని పాటలు పాడుతూ, డాన్సులు చేసే మీ పార్టీ ఆయన అన్ని ఆస్తులూ కష్టంతో సంపాదించుకున్నవేనా? ఇప్పుడు సిన్మా యాక్టరుతో చెయ్యి కలిపి ముఖ్యమంత్రి అయిపోదామని చూస్తున్నాడు లాగుంది. చెప్పకండి మీ భాగోతం!'' అంటూ మా ఆవిడ, తన వార్తా పత్రికల జ్ఞానంతో, ఝాడించేసింది.

మా ఆవిడ వాగ్ధాటికి మురిసిపోయి, మర్నాడు రాబోయే బోనస్‌తో డైమండ్ నెక్లసు కొనివ్వాలని నిశ్చయం చేసుకున్నాను.

అనుకోని ఆ ఎదురు దాడికి అన్న కాస్త తెల్లబోయినట్టు కనబడ్డాడు. ఆ చీకట్లో మాకలా కనబడ్డాడేమో! అతని ఆమాయక మొహం చూసి నాకూ వుత్సాహం పొంగుకు వచ్చేసింది.

''మానవ శ్రమా, మానవ శ్రమా అంటారు కదా మీరంతా? మరి అలాంటప్పుడు, మానవ శ్రమతో నిర్మితమైన కట్టడాల్నీ, బిల్డింగుల్నీ, వాహనాల్నీ ధ్వంసం చేస్తారెందుకూ:? అది మానవ శ్రమని ధ్వంసం చేస్తున్నట్టు కాదా? ఆ మధ్య పేపర్లో ఒక వ్యాసం చదివాను. అందులో రాసినట్టు, పెట్టుబడిదారుల్ని విమర్శిస్తూనే, మరి వాళ్ళ దగ్గరే చందాలు వసూలు చేస్తారెందుకూ మీ వుద్యమానికి? తుపాకులు కొని ఆ పెట్టుబడిదారుల్ని కాల్చడానికేనా? అంటే పెట్టుబడిదారులు, 'తుపాకులు కొనుక్కుని మమ్మల్ని కాల్చండీ' అంటూ మీకు చందాలిస్తున్నారా?'' అనంటూ పేపర్లలో అక్కడా, ఇక్కడా చదివి అర్థం చేసుకున్నవి అడిగి, కడిగేశాను.

అన్న సిగ్గు పడిపోయి, అడవిలోకి పారిపోతాడేమోననుకున్నాను. నిజంగా అతను గొప్ప వీరుళ్ళాగా నిలబడ్డాడు. గంభీరంగా నవ్వాడు.

''మీరైతే వున్న దోపిడీ వ్యవస్థని రక్షించడానికి, పెట్టుబడిదారుడికి కావల్సిన సైన్సు ప్రయోగాలు చేసి, వాళ్ళకు కావల్సినవన్నీ కనిపెడుతున్నారు. మేము చిన్న చిన్న పెట్టుబడిదారుల్నించీ చందాలు తీసుకున్నా, ఈ వ్యవస్థని కూలదొయ్యడానికే ప్రయత్నిస్తున్నాము. మా జీవితాలు దానికే అర్పణ చేస్తున్నాము. మితిమీరిన జీతాలు తినడం మరిగి, మా లక్ష్యం గ్రహించకుండా, మమ్మల్ని తప్పు బడుతున్నావు. మాలో తప్పులు జరిగితే దిద్దుకుంటాం. నీ బతుకే తప్పుడు బతుకు. నీ షేర్లు పెంచుకోవడం తప్ప నీకు వేరే లక్ష్యం లేదు'' అని గబగబా మాటలు గుప్పించేసి, చెట్లలోకి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు అన్న.

నేనూ, మా ఆవిడా కారెక్కాము కిక్కుమనకుండా. గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళం కదా?

****

# అత్తలేని కోడలుత్తమురాలు

ఒకరోజు తెలిసున్న వాళ్ళింటికి చాలా కాలం తర్వాత కొంచెం పని మీద వెళ్ళాను. ఆయన పేరు ప్రభాకరం. ఆవిడ పేరు పార్వతి. వారికి పిల్లలున్నారని తెలుసు గానీ, చాలా కాలంగా గేప్ వుండటం వల్ల వివరాలు తెలియవు. నన్ను చూసి దంపతులిద్దరూ సంతోషించారు. వాళ్ళ మొహాలు దివిటీల్లా వెలిగిపోతూ వున్నాయి. మొదట్లో నన్ను చూసిన సంతోషం అనుకుని వుబ్బిపోయాను. వచ్చిన గంటకి కూడా ఆరని ఆ దివిటీల్ని చూసి, నాక్కొంచెం అనుమానం వచ్చింది. ఇదేదో మన్ని చూసిన ఆనందంలా లేదని డౌటొచ్చింది.

"ఏంటండీ? అంత సంతోషంగా వున్నారూ?" అని ఆశక్తిగా అడిగాను వాళ్ళని.

"మా మీనాక్షి వస్తోందండీ ఈ రాత్రికి. రేపిక్కడ ఏదో ట్రైనింగుందంట. మళ్ళీ రేపు రాత్రికి వాళ్ళూరెళ్ళిపోతుంది" అని చెప్పింది పార్వతి మురిసిపోతూ.

"మీనాక్షెవరండీ? మీకేమవుతారు ఆవిడ?" అనడిగాను కుతూహలంగా.

"ఆవిడా? మా ఆవిడకి కోడలవుతారు! అందుకే ఆ సంతోషం అంతా!" అని నవ్వుతూ, సరదాగా అన్నాడు ప్రభాకరం.

"అక్కడకి మీకు సంతోషం లేనట్టు!!" అని భర్తని దెప్పి పొడిచింది పార్వతి నవ్వుతూ.

వాళ్ళిద్దర్నీ చూసి ముచ్చటేసింది నాకు. తర్వాత పోటీలు పడి మీనాక్షి విషయాలు చెప్పుకొచ్చారు.

మీనాక్షీ, మీనాక్షి భర్త శ్యాం ఇద్దరూ వేరే వూళ్ళో వుద్యోగాలు చేస్తారు. ఇంట్లో పనులు కూడా పంచుకుంటారు. ఒకసారి వీళ్ళు వాళ్ళింటికి వెళ్ళారు.

శ్యాం డ్రైయర్‌లో బట్టలు తీసి విడి విడిగా పెడుతున్నాడు.

"ఏరా శ్యామూ? బట్టలు మడత పెట్టకుండా విడిగా పెడతావేం?" అని అడిగింది పార్వతి ఆశ్చర్యంగా.

"అది నా డ్యూటీ కాదు. పేంటులూ, చొక్కాలూ, సాక్సులూ, వగైరా అన్నీ విడి విడిగా పెట్టడమే నా పని. అవి మడత పెట్టడం మీనాక్షి పని. నా పని నాదీ, తన పని తనదీ" అన్నాడు శ్యాం పని చేస్తూనే.

పార్వతీ, ప్రభాకరం గట్టిగా నవ్వేశారు.

"ఏం మీనాక్షీ? మొత్తం పని ఎందుకివ్వలేదూ శ్యాముకీ?" అని పార్వతి ఆరాగా అడిగింది.

"శ్యాం బట్టలు సరిగ్గా మడత పెట్టడు ఆంటీ! నాకు నచ్చదు బట్టలు అలా మడత పెడితే" అని నవ్వుతూ చెప్పింది మీనాక్షి.

మళ్ళీ దంపతులిద్దరూ నవ్వారు శ్యాంతో సహా.

కాస్సేపొయ్యాక ప్రభాకరం వంట చెయ్యడంలో మీనాక్షికి సాయం చేయసాగాడు. పార్వతి సింకు దగర కెళ్ళి అందులో వున్న పాత్రలు చూసింది. కడిగి పెడదామని డిష్‌వాషర్ తెరిచింది. దాన్నిండా పాత్రలున్నాయి. ఎక్కడ ఏవి పెట్టాలో తెలియలేదు పార్వతికి.
"మీనాక్షీ! ఈ పాత్రలు ఏవి ఎక్కడ పెట్టాలో చెబుతావా? సింకులో గిన్నెలు తోమి ఇందులో పెడతాను." అని అడిగింది పార్వతి.
"డిష్‌వాషర్ లోంచి పాత్రలు తీయడం నా పని కాదు ఆంటీ! అది శ్యాం పని" అని అంది మీనాక్షి.
"మీ పని విభజన సంతకెళ్ళా! అదేంటీ?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రభాకరం కూరలోకి పోపు వేయిస్తూ.

"శ్యాం గిన్నెలు సరిగ్గా తోమడంకులేదు! అన్నం గిన్నెలో పక్కులు అలాగే వుండి పోతాయి. అందుకని డిష్‌వాషర్ ఖాళీ చెయ్యడం తన పని. అందులో గిన్నెలు తొలిచి పెట్టడం నా పని" అంటూ వివరించింది మీనాక్షి.

మళ్ళీ అందరూ నవ్వారు.

"ఇలా పనులు సరిగ్గా చెయ్యకుండా, నెమ్మదిగా అన్ని పనులూ నీమీదకి తోసేస్తున్నాడేమో?" అనుమానంగా అంది పార్వతి.

"నేనంత తెలివితక్కువదాన్ని కాదు ఆంటీ! శ్యాం బాగా చేసే పనులు బోలెడున్నాయి. అవన్నీ తనే చేస్తాడు" అంది మీనాక్షి.

వాళ్ళిద్దర్నీ చూసి అత్తమామలిద్దరూ ముచ్చట పడ్డారు.

ఇదంతా విని నాకు ఒకటే ఆశ్చర్యం. కోడలితో అంత సామరస్యంగా వుండే మనుషులున్నారంటే నమ్మలేకపోవడం.

భార్యాభర్తలిద్దరూ ఎయిర్‌పోర్ట్ కెళ్ళి మీనాక్షిని తీసుకొని, ఇంటికి తీసుకొచ్చేసరికి పదయ్యింది రాత్రి. ఆ అమ్మాయి బాత్రూం లోంచీ వచ్చేసరికి పార్వతి భోజనం వడ్డించేసింది. ప్రభాకరం పక్కనే కూర్చుని కబుర్లు చెప్పాడు. దంపతులిద్దరూ శ్యాం గురించి విషయాలడిగారు. కొసరి కొసరి వడ్డించి తినిపించారు. అందరి ముఖాల్లోనూ సంతోషమే, నా మొహంలో తప్ప. నా మొహంలో ఒకటే నమ్మలేని ఆశ్చర్యం.

మర్నాడు పొద్దున్నే వాళ్ళతో పాటు ఆరింటికే లేచిపోయాను. ఏడింటికల్లా మీనాక్షి ఏదో ట్రైనింగుకెళ్ళాలట. తర్వాత అక్కడ నించీ తమ వూరెళ్ళి పోతుందట.

మీనాక్షి స్నానం చేసి వచ్చేసరికి ప్రభాకరం ఆమెకి రెండు పెసరట్లు వేసి ప్లేట్లో పెట్టాడు. పార్వతి చక్కటి బోర్నవిటా కలిపిచ్చింది, మీనాక్షి కాఫీ తాగదంటూ. నేను మాత్రం కాఫీని చుక్క చుక్కా ఆస్వాదిస్తూ, వాళ్ళనే గమనిస్తున్నాను. బోర్నవిటా వేడిగా వుందని, ప్రభాకరం వేరే గ్లాసులో ఆరబెట్టి, కొంచెం కొంచెం ఇచ్చాడు. మీనాక్షి పెసరట్లు చాలా బాగున్నాయని మెచ్చుకుంది.

బయల్దేరే ముందర, మీనాక్షి ఆ దంపతుల బుగ్గల మీద చిన్న చిన్న ముద్దులెట్టి, నాకు 'బై' చెప్పి వెళ్ళింది.

మీనాక్షిని ట్రైనింగు సెంటర్ దగ్గర దింపేసి వచ్చిన దంపతులు నాతో పిచ్చాపాటీ మొదలుపెట్టారు.

"ఈ లోకంలో మీలాంటి వాళ్ళుంటారంటే నేను నమ్మలేక పోతున్నాను. కోడలిని కూతురు కన్నా మిన్నగా చూసుకునే వాళ్ళుంటారని వినడమే గానీ, ఎప్పుడూ చూడలేదు. వెళ్ళే ముందర మీకు ముద్దులు పెట్టి వెళ్ళిందంటే, మీ మధ్య వుండే ఆప్యాయత అర్థం అవుతోంది. మీలాంటి అత్తమామలున్న మీనాక్షీ, మీలాంటి తల్లితండ్రులున్న శ్యాం అదృష్టవంతులు" అంటూ చెడామడా పొగిడేశాను.

దంపతులిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"శ్యాం మా సొంత కొడుకు కాదు. మా అక్క కొడుకు" అంది పార్వతి నెమ్మదిగా.

"అయితే మీనాక్షి మీ సొంత కోడలు కాదన్న మాట?" అని అడిగాను ఆశ్చర్యం పట్టలేక.

కాదన్నట్టు తలూపారు ఇద్దరూ!

ఈ కథంతా ఎందుకు చెప్పానంటే, ఆ దంపతులు తమ సొంత కోడలితో ఇంత ఆప్యాయంగా వుంటారా అని. 'సొంత' మనుషులనే సరికి, డిమాండ్లూ, ఎక్స్‌పెక్టేషన్లూ మొదలవుతాయి. నేర్చుకున్న సంస్కారంతో ఎంత సభ్యతగా ప్రవర్తించినా, మనసులో ఎక్కడో, ఏదో కలుక్కుమంటూ వుంటుంది ఇటువంటి సంబంధాలలో.

నేనిక్కడ మాట్లాడేది చెడ్డ మనుషుల గురించి కాదు. అంతో, ఇంతో మంచి అని అందరి చేతా అనిపించుకునే సగటు మనుషుల గురించి. ముఖ్యంగా అత్తా, కోడళ్ళ సంబంధం గురించీ.

భర్తతో భార్యకి వున్నది సాంఘిక సంబంధమే అయినా, జీవితం పంచుకోవడం వల్ల అది చాలా ప్రత్యేక సంబంధంగా, కొన్ని సందర్భాలలో రక్త సంబంధం కన్నా ఎక్కువగా వుంటుంది. అయితే అత్తామామలతో స్త్రీకున్నది కేవలం సాంఘిక సంబంధం మాత్రమే. ఇలా సాంఘిక సంబంధాలలో వున్న వారు గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకోవాలి. అది లేకుండా, డిమాండ్లూ, ఎక్స్‌పెక్టేషన్లూ ఎక్కువయినపుడు, ఇంకా సమస్యలు పెరుగుతూ వుంటాయి. సాంప్రదాయాలు ఈ సమస్యలని పెంచుతాయి.

ఇందాక చెప్పిన విషయంలో, శ్యాం, మీనాక్షిలు పనులు పంచుకోవడం చాలా యాంత్రికంగా వుంది. "నా పనే నేను చేస్తానూ, ఇంకొకరి పని నేను ముట్టుకోనూ" అని అనడం వారి మధ్య వుండే అన్యోన్యతని చూపించదు. ఇలా పని విభజన జరగడం ఒక డ్యూటీనే చూపిస్తుంది తప్ప, మనుషుల మధ్య వుండాల్సిన అభిమానాలు కాదు.

"నాయనమ్మా, నేనెందుకు చదువుకోవాలే? నాకు సినిమాలు చూడ్డం అంటేనే చాలా ఇష్టం. సినిమాల్లో జమున చూడు ఎంత హాయిగా వుంటుందో!" అంటూ గారాలు పోయేది సునీత తన నాయనమ్మతో.

"చదువుకోకపోతే చదువుకున్న మొగుడు రాడు. చదువుకోని మొగుడికి వుద్యోగం వుండదు నిన్ను పోషించడానికి. అప్పుడు నీ మొగుడు నిన్ను వూళ్ళు తిప్పలేడూ, నీక్కావలసినవి కొనలేడూ. అందుకని" అని చెప్పేది ఆ ముసలావిడ.

చదువుకుని వుద్యోగం చేసే మొగుడి కోసం వానాకాలం చదువు చదివింది సునీత. పది మంది వున్న ఇంట్లో పుట్టడం వల్ల ఇంట్లో పని చెయ్యాల్సిన అవసరం రాలేదు. జీవతం అంటే అలాగే సుఖంగా గడిచిపోతుందనుకుంది.

అనుకున్నట్టుగానే చదువుకున్న మొగుడొచ్చి, తనింటికి తీసుకెళ్ళాడు. అప్పుడు మొదలయ్యాయి సునీత కష్టాలు.

ఇంటిపని చెయ్యమంటే సునీత క్కోపం. చెయ్యద్దంటే అత్తకి కోపం. సునీత ఒక గిన్నె తీసి ఇక్కడ నించీ అక్కడ పెట్టేలోపున అత్త స్పీడుగా బోలెడు పని చేసేది. తను చెప్పకుండానే కోడలు పని చెయ్యాలని అత్తకి తపన. తను నెమ్మదిగా చేసేవరకూ ఇంకో పని వుండకూడదని కోడలికి ఆశ. భార్య పని సరిగా చెయ్యడం లేదని భర్తకి బాధ. ఆ విధంగా ఇంటి పనిలో బద్ధకస్తురాలని సునీతకి పేరొచ్చేసింది. దానికి అత్తే కారణమని సునీతకి ఒళ్ళు మంట.

అంత వయసొచ్చినా అత్తకి కోడలితో సమానంగా షోకులు. వయసుకి తగ్గ హుందాతనం లేదు. కోడలు కొనుక్కున్న లాంటి చీరే తనూ కొనుక్కోవాలి. దానితో అది ఒక పోటీగా తయరయి కూర్చుంది.

పనీ, పనీ అని సతాయించేవాడు భర్త.

అత్త సునీతని తనతో పోటీకి సమానంగా చూస్తే, భర్త సునీతని చిన్న పిల్లలాగా చూసేవాడు. నిజానికి ఇది రివర్సులో వుండాలి. భర్త సునీతని తనతో సమానంగా చూడాలి. అత్త సునీతని చిన్న పిల్లలాగా చూడాలి. తనంత చదువుకోలేదనీ, తనలాగా వుద్యోగం చెయ్యడం లేదనీ, తనలాగా తెలివిగా లేదనీ, ప్రతీదానికీ తనపై ఆధారపడుతుందనీ భర్త సునీతని తన కంటే తక్కువగా చూసేవాడు. అత్త అన్నింటిలోనూ పోటీ పడుతూ తనతో సమానంగా చూసేది. సునీత మాత్రం వాళ్ళిద్దరినీ తనతో సమానంగా చూస్తూ, ఇద్దరితోనూ సమానంగా గొడవ పడేది.

సునీతకి కూడా పరిష్కారం ఏమిటో తెలియదు.

సుమ పెళ్ళికి ముందర నించీ వుద్యోగం చేసేది. ఈ పెళ్ళిలో కట్నకానుకలకీ, పెట్టుపోతలకీ సంబంధించిన గొడవ లేవీ లేవనుకోండీ. పెళ్ళయ్యాక సుమ అత్తారింటికి వెళ్ళింది సామానులన్నీ తీసుకుని. నాలుగు సందులవతలే పుట్టిల్లు.

అత్తకి కోడలు పూర్తిగా తమ ఇంటి మనిషి అయిపోవాలని విపరీతమైన కోరిక.

సాంప్రదాయం ప్రకారం, కోడల్ని ముందుగా ఇంటిపేరు మార్చుకోమన్నారు. అంత చదువుకుని, వుద్యోగం చేస్తున్న కోడలూ గెంతుకుంటూ గవర్నమెంటాఫీసుకెళ్ళి, ఇంటి పేరు మార్చేసుకుంది.

వూళ్ళో వాళ్ళందరికీ మా కోడలు వుద్యోగం చేస్తోందని చెప్పుకోవడం చాలా గొప్ప అత్తకి. అయితే ఇంటి పనిలో మాత్రం రాజీ పడలేదు. కొడుకు ఇంటి పని బొత్తిగా చెయ్యకపోయినా, కోడలి చేత ఇంటి పని బోలెడు చేయించేది.

"ఆడదన్నాక ఇంటి పనులు చేసుకోకపోతే ఎలా?" అనుకుంది ఆ కోడలు.

అలా అనుకుందే గానీ, ఇంటిపనితోటీ, వుద్యోగం తోటీ సతమతమయ్యేది.

ఎప్పుడైనా తల్లితండ్రులని చూడ్డానికి పుట్టింటికెళ్ళొస్తానంటే, అత్తా, భర్తా గంటు మొహాలు పెట్టుకునేవారు.

"నువ్విక ఈ ఇంటి మనిషివి. అలా చీటికీ, మాటికీ ఇల్లొదిలేసి పుట్టింటికి పోవడం బాగుండదమ్మా" అంటూ సణిగేది అత్త.

అప్పటికి సుమ కళ్ళు కాసింత తెరుచుకున్నాయి. అప్పటికీ తన తప్పు తెలిసిరాలేదు. కానీ అత్త తప్పు మాత్రం బాగా అర్థం అయ్యేది.

భార్య వుద్యోగం మీద ఆ భర్తకి అస్సలు గౌరవం లేదు. అయినా సుమకి అత్త మీద కంప్లైంటులే గానీ, భర్త మీద కంప్లైంటులు లేవు. అత్త లేకపోతే జీవితం బాగుంటుంది అనుకునేది.

"నువ్వు ఒకరోజు వుద్యోగం చేసినందుకు నీకు కొంత డబ్బిస్తారు కదా? ఆ డబ్బు నేనిస్తాను, ఇవాళ శలవు పెట్టి నాతో గడిపితే" అంటాడు భర్త, తనకి శలవు వుండీ, భార్యకి శలవు లేని నాడు.

ఆ మాటలకి బాధ పడ్డం తప్పితే, మరింకే విషయమూ అర్థం కాలేదు సుమకి.

అత్తకి కోడలంటే తనకి సేవలు చేసే మనిషి. ఇంటి పనంతా చేసే మనిషి. తను అన్నం తిన్న పళ్ళెం ఎత్తాల్సిన మనిషి. తన చేత ఏ పనీ చెయ్యనీయని మనిషి. ఇదంతా అయ్యాక కొడుక్కి అణిగి మణిగి వుంటూ, కొడుకుని అతని ఇష్ట ప్రకారం సంతోషపెట్టాల్సిన మనిషి. ఆ తరువాత బయటకెళ్ళి వుద్యోగం చేసి సంఘంలో మంచి పేరు తేవాల్సిన మనిషి. మనవళ్ళని కని ఇవ్వాల్సిన మనిషి. ఇవీ ఆ అత్త భావాలు.

సుమ ఎంతో కాలం భరించలేకపోయింది. ఒకరోజు పిల్లాడిని తీసుకుని తల్లితండ్రుల ఇంటికి వెళ్ళిపోయింది. ఇంకేముందీ? సంఘంలో పరువు పోయింది. మరి ఇలాంటి మనుషులు వాటి కోసమే బతుకుతారు కదా? ఒక మూడేళ్ళు రెండు వేపులా మంతనాలూ, కౌన్సిలింగులూ, బ్రతిమాలాటలూ, బెదిరింపులూ - అలా ఎన్ని జరగాలో అన్నీ జరిగాయి. ఆఖరికి అదే ఇంట్లో రెండు పొయ్యిలు వుండే - వేరే వాటాలో వేరేగా వుండేటట్టుగా వుండే - ఒప్పందం మీద, సుమ పిల్లాడిని తీసుకుని వెనక్కి వచ్చింది.

పేరుకే వేరు గానీ, అత్త జులుం ఎప్పటిలాగానే వుంది. కొన్నాళ్ళు అవస్థలు పడి, భర్తకి వేరే దేశం వెళ్ళే అవకాశం వచ్చినపుడు, వుద్యోగం మానేసి భర్తతో ఆ దేశం వెళ్ళిపోయింది. ఇక కష్టాలు పోయేయనుకుంది. ఎంతో కాలం పట్టలేదు ఆ భ్రమ నించీ దూరం అవడానికి. అత్త ఆ దేశం కూడా విజిటర్‌గా వెళ్ళింది. ఆర్నెల్లుంది. సుమ జీవితం మళ్ళీ మొదటికొచ్చింది. కాలేజీకెళ్ళే వయసుకి పిల్లలెదిగినా అత్తతో గొడవలు తగ్గలేదు.

"మగవాడు భార్యని ఈజీగా వదిలి పెట్టగలడు. తల్లి నెప్పుడూ వదిలి పెట్టలేడు తెలుసా?" అని అత్త బెదిరించింది కోడల్ని.

"నువ్వు నా తల్లితో ప్రేమగా వుంటేనే, నేను నీతో ప్రేమగా వుంటాను" అని వాళ్ళిద్దరి మధ్యా ఇంకో చిచ్చు పెట్టాడు భర్త.

భర్తయితే, తనకి పెళ్ళాం-పిల్లల కన్నా తల్లే ముఖ్యం అని తేల్చి చెప్పేశాడు. ఇటువంటి సమస్యలో సుమకి అసలైన పరిష్కారం ఏమిటీ? సుమకి భర్త తనని పెద్ద పిల్లలాగా, తల్లిని చిన్న పిల్లలాగా చూస్తాడని ఓ కంప్లైంటు.

దేవి బాగా చదువుకున్న పిల్ల. చిన్న వయసులోనే ఇల్లు వదిలి బయటికి వచ్చి, చిన్న చిన్న వుద్యోగాలు చేసుకుంటూ చదువుకుంది. పెద్ద చదువులయ్యేసరికి పెద్ద వుద్యోగమే వచ్చింది. ఆధునిక భావాలు బాగా వున్నాయి. సంగీత, నాట్య శాస్త్రాల్లో మంచి ప్రవేశం వుంది. తనతో సమానంగా చదువుకున్న అబ్బాయితో పరిచయమవడం, అది ప్రేమకి దారి తీయడం, గోత్రాలు కలవలేదన్న పెద్దవాళ్ళ సణుగుళ్ళ మధ్య పెళ్ళి జరగడం, అన్నీ అయ్యాయి.

పెళ్ళయిన తర్వాత వుద్యోగ రీత్యా వేరే వూళ్ళో వుండటం వల్ల అత్త సమస్య ఇంకా వుద్భవించలేదు.

ఆ లోపుల దేవి మరి కొంత మారింది. మంగళ సూత్రం, మట్టెలూ, గాజులూ, బొట్టూ, చెవులవీ, అన్నీ తీసేసింది. భర్త కూడా భార్య చేస్తున్నవి ఆమోదిస్తూనే వుండేవాడు.

అందరిముందరా పట్టుబట్టలతో, తలొంచుకుని, కన్యాదానం చేయించుకుని, తాళి కట్టించుకున్న కోడలు ఇలా అయిపోవడం అత్తకి ఏ మాత్రమూ కిట్టలేదు. అంతేకాదు, తన కొడుకుని మార్చేసిందని అత్తకి కోడలి మీద కోపం.

"రేపు నేను పోతే, నువ్వు నాకు శ్రాద్ధకర్మలు చెయ్యవురా! నాకు తెలుసురా!" అంటూ కొడుకుతో జగడమేసుకునేది అత్త కొడుకింటికి వచ్చినప్పుడల్లా.

ఇంటికి వచ్చిన శ్రావణ మంగళ వారం ముత్తయిదువుల చేత పసుపు రాయించుకోలేదనీ, బొట్టు పెట్టించుకోలేదనీ అత్తకి కోడలి మీద కినుక.

దేవి అవన్నీ ఎలాగో అలాగ భరించింది. భరించలేని విషయం తొందరలోనే మొదలయింది.

ఇద్దరూ వుద్యోగస్తులవడంతో, ఇంట్లో పనులు ఇద్దరూ చేసేవారు. దేవికి నిద్ర ఎక్కువ. పొద్దున్న ఆలస్యంగా నిద్ర లేచేది. భర్త మాత్రం పెందరాళే నిద్ర లేచిపోయి, బోలెడు పని చేసేవాడు. వాళ్ళిద్దరూ మాత్రమే వున్నపుడు బాగానే వుండేది ఆ పద్ధతితో.

అత్త వచ్చినపుడు కొడుకు అంత పని చెయ్యడం చూసి తట్టుకోలేక పోయింది. మళ్ళీ కోడల్ని ఏమన్నా అనాలంటే కోడలు ఎదురు తిరుగుతుందని భయం. దాంతో కొడుకు పని చేస్తున్నప్పుడల్లా, "నీకెందుకురా పనులు? నేను చేస్తాగా!" అంటు కొడుకు చేతిలోంచీ పని లాక్కునేది. అదే కోడలు పని చేస్తుంటే, దరిదాపుల్లోకి వెళ్ళేది కాదు. అది కోడలికి పెద్ద అవమానంగా తోచేది. అత్తతో మాట్లాడ్డం మానేసింది కొన్నాళ్ళు.

వృద్ధాప్యం వచ్చాక, అత్తామామలిద్దరూ తమింట్లోనే వుండిపోయినప్పుడు, ఎలాగా అని కోడలికి అంతు చిక్కని సమస్య.

ఈ చర్చంతా కోడళ్ళ వేపునించే చేస్తున్నాను. వీళ్ళే పెరిగి పెద్దయి అత్తలౌతారు కాబట్టి.

అందరి జీవితాల్లోనూ ఇటువంటి సమస్యలుంటాయని కాదు. ఎక్కువ కుటుంబాలలో ఇటువంటి సమస్యలుంటున్నాయి. ఎంతో చైతన్యం, సంస్కారం వున్న మనుషుల మధ్య మాత్రమే ఈ అత్తా, కోడళ్ళ బంధం సరిగా సాగుతోంది.

ఈ సమస్యకున్న ముఖ్య కారణాల్లో ఒకటి సాంప్రదాయం. దాని ప్రకారం కూతుర్ని కన్యాదానం చేసేస్తాడు తండ్రి. అది అవమానంగా తోచదు కూతురికి. తనని ఎవరికో దానం చేసెయ్యడం వల్ల, తనెంత స్వేచ్ఛ కోల్పోతోందో అర్థం చేసుకోదు ఆమె. ఆ తర్వాత ముక్కూ, మొహం తెలియని అత్తవారింటికెళ్ళిపోతుంది. వాళ్ళు మంచి వాళ్ళయితే ఈమె జీవితం కాస్త సుఖంగా సాగుతుంది. వాళ్ళు కూడా ఈమెలాగే పిచ్చి సాంప్రదాయాల్లో పెరిగి వస్తే, కోడల్ని తమింటికి వచ్చిన వస్తువుగానే భావించి, తమింటి పేరే ఆమెకి కూడా మారుస్తారు. కోడలు గంగిరెద్దులా దీనంతటకీ ఒప్పుకుంటుంది. తనది కాని ఇంట్లో ఒక స్థానం కోసం పోరాటం మొదలు పెడుతుంది.

పురుషుడు అత్తారింటికి వెళ్ళి వుండటం అనేది చాలా అరుదుగా జరుగుతూ వుంటుంది.

అత్తతో సమస్య వున్న సంసారాల్లో పరిష్కారం, పెళ్ళవగానే భార్యాభర్తలిద్దరూ విడిగా, స్వతంత్రంగా వుండటమే. దీనర్థం మనుషులు వారి తల్లితండ్రుల్ని పట్టించుకోవద్దని కాదు. ఆ సమస్యని వేరే విధంగా పరిష్కరించాలి.

ఆర్థిక స్వతంత్రం లేనివాళ్ళకి స్వేచ్ఛ వుండదు. ఒకరు ఇంటిపనికీ, ఒకరు బైటపనికీ అంకితమయితే వాళ్ళ మధ్య సమానత్వం వుండదు. ఇద్దరూ అన్ని పనులూ చెయ్యాలి.

ఇది ఉమ్మడి కుటుంబాలకి వ్యతిరేకంగా రాసేది కాదు. సంస్కారం, మంచితనం, చైతన్యం వున్న వారి మధ్య మాత్రమే ఉమ్మడి కుటుంబం సాధ్యమవుతుంది. అది లేని మనుషులే చాలా ఎక్కువ. అదికూడా అల్లుడు తన అత్తవారి ఉమ్మడి కుటుంబంలో వుండే పరిస్థితులున్నప్పుడు. భర్త వేపు ఉమ్మడి కుటుంబాలు మాత్రమే వుండే వ్యవస్థలో ఇది కుదరదు.

ఎంతో చదువుకున్న స్త్రీలు కూడా పెళ్ళయి, భర్త మీద ఆధారపడుతూ, కొన్నాళ్ళు రెస్టు తీసుకుని తమ తక్కువతనాన్ని ఎస్టాబ్లిష్ చేసేసుకుని, అప్పుడు ఏదో వుద్యోగం చెయ్యడానికి తయారవుతారు. వీరికి భర్త వుద్యోగమే ముఖ్య విషయంగా వుంటుంది. తమ వుద్యోగం మీద అంత పట్టుగా వుండరు. ఇంటి చాకిరీ అంతా భర్త పాత్ర లేకుండా గాడిదల్లా చేసేస్తూ వుంటారు, భర్త సాయం చేయకపోయినా, లేదా ఏదో పిసరంత సాయం చేసినా. భర్తకి చాకిరీ చెయ్యడం నామోషీగా అనిపించదు వీళ్ళకు. అది తాము ప్రేమ చూపించే విధానం అనుకుని, తమని తాము మోసం చేసుకుంటారు. అయితే భర్త వేపు వాళ్ళకి చాకిరీ మాత్రం తప్పకుండా నామోషీ వీళ్ళకి. ఇలాంటి తప్పు తడకల పద్ధతుల్లో వీళ్ళుంటే, వీళ్ళకి సమస్యలు కాక, మరేం వొస్తాయి?

తమింటి పేరు మార్చుకోకపోయినా పిల్లలకి మాత్రం భర్తింటి పేరు వేరే ప్రశ్న లేకుండా పెట్టేసుకుంటారు. ఇలా ప్రతీ దానికీ లొంగిపోతూ, అత్తల విషయంలో మాత్రం కష్టపడిపోతూ వుంటారు.

ఈ సాంప్రదాయాల చెత్తలో తమని తాము సరిగా ఎస్టాబ్లిష్ చేసుకోలేని వారికే ఈ సమస్యలన్నీ. వీరే పెరిగి, పెద్దయి తమ అత్తల్లాగానే తయారవుతారు, చిన్న చిన్న మార్పులతో. ఆ చిన్నా, చితకా మార్పులే తమని తమ అత్తల నించీ వేరుగా చేస్తున్నాయని మురిసిపోతారు. మౌలికంగా వీరికీ, వీళ్ళ అత్తలకీ తేడా వుండదు. అవతల మనుషుల మీద డిమాండ్లూ, ఎక్స్‌పెక్టేషన్లూ.

అత్త వల్ల ఎన్నో కష్టాలు పడుతున్న ఒకావిడకి, అమెరికాలో కొడుకు ఇండియన్ని మాత్రమే పెళ్ళి చేసుకోవాలని పెద్ద కోరిక. కొడుకు పెళ్ళి మీద ఇంకా అత్త కాని ఈవిడకి అప్పుడే ఆశలు. అది జరక్కపోతే భవిష్యత్తులో అదో పెద్ద అసంతృప్తి.

అత్తలు కాదు మారేది, ఈ కోడళ్ళే మారాలి. వీళ్ళే రేపటి అత్తలు మరి!

## ఇలాంటి మనుషులు కూడా వుంటారు

ప్రభాకరం నాస్తికుడు. తనలాంటి నాస్తికులు ఎక్కడన్నా దొరుకుతారా, కబుర్లు చెప్పుకుందాం అని నాస్తికుల కోసం తెగ వెదికేస్తూ వుంటాడు. దొరికి ఛస్తేనా! ఎవరితోనన్నా కొంచెం పరిచయం పెరిగితే చాలు, వాళ్ళ మత నమ్మకాలు తెలుసుకోవాలని ప్రయత్నిస్తాడు. వాళ్ళేమో రక రకాల నమ్మకాలు వెలిబుచ్చుతూ వుంటారు. మొత్తానికి అందరూ, తమకి మూఢ నమ్మకాలు లేవనీ, అప్పుడప్పుడు మాత్రమే గుడి కెళ్తామనీ, దేముడి మీద నమ్మకం వుందనీ చెప్పుకున్నారు.

అగ్రకులానికి చెందని ఒకాయన్ని అడిగాడు ప్రభాకరం ఒకసారి.

"నాకు దేముడి మీద నమ్మకం వుంది గానీ, కులాల మీద నమ్మకం లేదండీ!" అన్నాడా పెద్ద మనిషి.

నోరు తెరిచాడు ప్రభాకరం.

"మరి మీరు మొన్న మీ ఇంటికి బ్రాహ్మణ్ణి పిలిచి పూజ చేయించారు కదా? ఎక్కువగా ఒకే కులానికి పరిమితమైన ఈ వృత్తిని చేపట్టిన వారి చేత పూజ చేయించడానికి, మీకు కులం అడ్డు రాలేదా?" అని ఆశ్చర్యంగా ప్రభాకరం అడిగాడు.

"అబ్బే! అదేం లేదండీ! ఆ పూజలు చేయించడం వాళ్ళకే వచ్చు మరి. తప్పని సరి!" అన్నాడాయన తన్ని తాను సమర్ధించుకుంటూ.

"ఈ మధ్య కాలంలో పూజా విధాన పుస్తకాలు బోలెడు దొరుకుతున్నాయి. మంత్రాలతో సహా అన్నీ వుంటాయందులో. పూజ చేయించే కేసెట్లు కూడా దొరుకుతున్నాయి. ఇన్ని వసతులు పెట్టుకుని కూడా, బ్రాహ్మడి చేత పూజ చేయించుకున్నారంటే, అది మీకు బ్రాహ్మణుల మీద వున్న గౌరవాన్నే చూపిస్తుంది. వాళ్ళు ఈ పూజా సంస్కృతిలో అధికులన్న భావం మీకుందనే చూపిస్తుంది. మరి మీకు కులాల మీద నమ్మకం లేదంటారేం?" అని చనువుతో ఘాటుగానే ప్రభాకరం అడిగాడు.

"మీరలా అంటే ఎలా? బ్రాహ్మణుడి చేత పూజ చేయించుకుంటే వచ్చే తృప్తి, కేసెట్ల పూజలోంచీ రాదండీ! అలా అంటే ప్రతీ గుళ్ళోనూ పూజారి బ్రాహ్మడే కదా? ఎక్కడో ఒక చోట అలా కాకుండా వుందేమో మరి. కులాన్ని నమ్మనని చెప్పి, గుడి కెళ్ళడం మానేయగలమా చెప్పండీ!" అని ఎదురు తిరిగి ప్రశ్నించాడాయన.

"కులాల మీద నమ్మకం లేనప్పుడు, ఆ కులాలకి సంబంధించిన విషయాల్లో సీరియస్ గానే వుండాలి. గుళ్ళో వుండే దేముడు మీ ఇంట్లో లేడా, మీ థియరీ ప్రకారం? మీ వల్ల ఆ పేద పూజారికి కాస్త ఆదాయం దొరుకుతోందన్న విషయం తప్పిస్తే, కులానికి సంబంధించిన విషయం ఇందులో స్పష్టంగా వుంది" అని గట్టిగా జవాబిచ్చాడు ప్రభాకరం.

"మీరెన్ని చెప్పినా సరే, నేను గుడి కెళ్ళకా మానను. బ్రాహ్మడి చేత పూజ చేయించకా మానను. అయినా నాకు కులాల మీద నమ్మకాలు లేవని మీరు నమ్మకపోతే, అది మీ ఖర్మ" అని అన్నాడాయన నవ్వుతూ  నిర్మొహమాటంగా.

"హతవిధీ" అనుకొని నోర్మూసుకున్నాడు ప్రభాకరం.

అప్పట్నించీ ప్రభాకరం తన జోరు కాస్త తగ్గించాడు. అయినా సరే, వేరే నాస్తికుల కోసం తన వేట మాత్రం మానలేదు.

కొన్నాళ్ళకి ప్రభాకరం వెనకటి కంపెనీ మానేసి, వేరే కంపెనీలో చేరాడు. అక్కడ ఒకావిడతో పరిచయం అయింది. ఆవిడకి ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయికి పదమూడేళ్ళూ, చిన్నబ్బాయికి పదకొండేళ్ళూ.

ఒకరోజు, ప్రభాకరం ఆవిడని, "మీకెవరన్నా నాస్తికులు తెలుసాండీ?" అని అడిగాడు.

"తెలియకేం? బాగా తెలుసు. ఎందుకంటే అది మేమే కాబట్టీ" అందావిడ నవ్వుతూ.

ఆశ్చర్యపోయాడు ప్రభాకరం.

"ఏమిటీ? మీరు నాస్తికులా?" నమ్మలేనట్టు అడిగాడు.

ఆవిడ గొప్పగా బొట్టు పెట్టుకుని, గాజులేసుకుని వస్తుంది. అప్పుడప్పుడు మెళ్ళో మంగళసూత్రం కూడా వేసుకుంటుంది. అప్పుడప్పుడు మాత్రమే. ఒకటీ, రెండు సార్లు కాళ్ళకి మట్టెలు కూడా చూశాడు. ఆవిడ నాస్తికురాలంటే నమ్మలేక పోయాడు. అదే విషయం అడిగాడు ఆవిణ్ణి.

"మీకు మరీ చాదస్తం లెద్దురూ! నాస్తికులు బొట్టు పెట్టుకోకూడాదని ఎక్కడన్నా రాసి వుందా? గాజుల్లేకపోతే నా చెయ్యి చాలా బోసిగా వుంటుంది. నాకు నచ్చదు. మంగళసూత్రం వేసుకుని, మట్టెలు పెట్టుకుంటే, చాలా అందంగా వుంటానని మా ఆయన అంటాడు. అందుకని అప్పుడప్పుడు సరదా కోసం అవి కూడా వేసుకుంటాను. అంతే తప్ప, మేము నాస్తికులమే!" అందావిడ ధీమాగా.

ఆవిడ జవాబు మరీ అంత తప్పుగా అనిపించలేదు ప్రభాకరానికి. ఇంకా ఎక్కడో ఆశ మిణుకు, మిణుకు మంటూనే వుంది. తను వెదుకుతున్న నాస్తిక కుటుంబం వీళ్ళదేనేమోననే ఆశ వుంది.

"అయితే మీరెప్పుడూ గుడి కెళ్ళరన్న మాట" అని అడిగాడు.

"మీ ప్రశ్న బావుందండీ! ఎక్కువగా వెళ్ళమండీ! అప్పుడప్పుడు మాత్రమే వెళతాము. ఎందుకంటారా? అలా వెళితే మనసు ప్రశాంతంగా వుంటుందండీ! మనసుని ప్రశాంతంగా వుంచుకోవడానికి ఏం చేసినా తప్పు లేదని నా నమ్మకం. అంత మాత్రానికే మేము నాస్తికులం కాకుండా పోతామా?" అందావిడ గలగలా నవ్వుతూ.

వెర్రి మొహం వేశాడు ప్రభాకరం. అయినా ఆశ చావలేదు. తాడో, పేడో తేల్చుకోవలనుకున్నాడు.

"అలా అయితే, పూజలు మాత్రం చెయ్యరన్న మాట!" అన్నాడు ఆశకి కొన వూపిరి పోస్తూ.

"అబ్బే! పూజలూ, అవీ కూడా ఎక్కువగా చెయ్యమండీ. ఒక్క కృష్ణాష్టమి మాత్రమే బాగా చేసుకుంటాం. ఆ రోజు మాత్రం పూజ చేస్తామండీ. తెలిసున్న ఓ నాలుగు కుటుంబాల వాళ్ళు మా ఇంటికి వస్తారు ఆ రోజు. అందరం కలిసి సరదాగా పూజ చేసుకుంటాము. పిల్లలు కూడా ఇష్టపడతారు. వాళ్ళకి కృష్ణుడి వేషం వేస్తాము. ఆ వేషంలో మా చిన్నాడయితే చాలా ముద్దుగా వుంటాడండీ. పట్టు చీర కట్టుకుని, వడ్డాణం పెట్టుకుంటాను. రకరకాల పిండి వంటలు చేసి, నైవేద్యం పెడతాము. చాలా సరదాగా గడుస్తుంది ఆ రోజు" అని చెప్పిందావిడ తన్మయత్వంతో.

ప్రభాకరం మొహం చిల్లు కానీ అంత అయింది.

"ఆవిడ నాస్తికత్వం ఎలా వుంటేనేం, కొన్ని విషయాల్లో అభివృద్ధికరంగా వుంటుంది కదా!" అని అనుకున్నాడు.

ఆ మర్నాడు వాళ్ళిద్దరి మధ్యా రిపబ్లికన్ల గురించి చర్చ జరిగింది.

"రిపబ్లికన్లు చాలా ఛాందసవాదులండీ! వాళ్ళకి మూఢ నమ్మలాలూ, మత నమ్మకాలూ ఎక్కువ" అన్నాడు ప్రభాకరం.

"అవునండీ! మీరన్నది కరెక్టే. వాళ్ళంటే నాకూ ఒళ్ళు మంటే!" అందావిడ.

అంతే! ప్రభాకరానికి వుత్సాహం పెరిగిపోయింది.

"బాగా చెప్పారు. రిపబ్లికను అబార్షన్లకి వ్యతిరేకం. స్త్రీలకి వాళ్ళ శరీరాల మీద వాళ్ళకి హక్కులున్నాయని ఒప్పుకోరు. 'భ్రూణ హత్య, భ్రూణ హత్య' అంటూ ఒకటే గోల. వాళ్ళు గనక పవర్లోకి వస్తే, అబార్షన్ చట్ట విరుద్ధం చేసేస్తారు" అన్నాడు ప్రభాకరం.

"అవునండీ! స్త్రీలకి వాళ్ళ శరీరాల మీద హక్కులు వాళ్ళకే వుండాలి. ఆ విషయం నేనూ ఒప్పుకుంటాను. అయితే నేను కూడా అబార్షన్‌కి వ్యతిరేకినే!" అందావిడ తీవ్రంగా.

"అదేంటండీ, అలాగంటారూ?" అని తెల్లబోతూ అడిగాడు.

"అవునండీ! అబార్షన్ నాకూ ఇష్టం లేదండీ. హాయిగా పిల్లల్ని కనొచ్చు కదా? అందుకే నేనూ అబార్షన్‌కి వ్యతిరేకం" అందావిడ.

పక్కనే వున్న చెత్తబుట్టలోని చెత్తంతా, ఆవిడ నెత్తి మీద గుమ్మరించి, అక్కడ్నించీ పారిపోయాడు ప్రభాకరం

* * * * * * * * * *

స్వాతీ, విక్టోరియాలు యూనివర్శిటీ హాస్టల్లో రూమ్మేట్లు. స్నేహంగా వుంటారిద్దరూ. విక్టోరియాకో బాయ్ ఫ్రెండున్నాడు. ఆడం.

"కాలేజీ చదువయ్యేవరకూ ప్రేమ వ్యవహారాలు పెట్టుకోవద్దు. అప్పటికి వయసూ, దానికి సరిపోయే మానసిక పరిణతీ వుంటాయి. అప్పుడూ నీ కాళ్ళ మీద నువ్వు నిలబడి, ఆత్మగౌరవంతో బతకొచ్చు. అప్పుడు కలిగే ప్రేమలు మానసిక పరిణతతో వుంటాయి" అని తల్లి స్వాతికి బాగా బోధించి పంపింది కాలేజీకి.

ఆ మాటలకి కట్టుబడ్డ స్వాతి చదువు మీదే దృష్టి పెట్టుకుంది. అయితే, చదువుకి సంబంధించని పుస్తకాలు కూడా చాలా చదువుతుంది. 'ఆత్మగౌరవం' అన్న మాట బాగా వొంటబట్టింది స్వాతికి.

విక్టోరియా, ఆడంలను కుతూహలంగా పరిశీలిస్తూ వుటుంది స్వాతి. వాళ్ళిద్దరూ తరుచూ కలుసుకునేవారు. రక రకాల చోట్లకీ, పార్టీలకీ కలిసి వెళ్ళేవారు. ఒకరి తల్లితండ్రుల కొకరిని పరిచయం చేసుకున్నారు. అప్పుడప్పుడు రెండు ఫామిలీలూ కలుసుకునేవి. ఆడం తల్లితండ్రులు సొంత కోడలిని చూసినట్టు విక్టోరియాని ప్రేమగా చూసే వారు. హాలిడేస్‌లో తమ సొంత డబ్బుతో తమతో పాటు, విక్టోరియాని కూడా వూళ్ళు తిప్పేవారు. విక్టోరియా తల్లితండ్రులు ఏ సంకోచం లేకుండా, తమ కూతుర్ని ఆడం కుటుంబంతో ఆనందంగా పంపేవారు.

ఆడం, విక్టోరియాలు ఇద్దరూ చదువులో కూడా చురుగ్గా వుంటారు. కాలేజీ తర్వాత గ్రాడ్యుయేట్ స్కూలుకెళ్ళాలని కూడా మాట్టాడుకుంటారు. ఆ తరువాత వుద్యోగాలు సంపాదించుకుని, పెళ్ళి చేసుకోవాలని కబుర్లు చెప్పుకుంటారు.

స్వాతి వల్ల విక్టోరియాకి కూడా 'ఆత్మగౌరవం' అనే పదం బాగా అలవాటయిపోయింది. ఆ తర్వాత 'ఆత్మగౌరవం' గురించి ఆడంతో చర్చిస్తూ వుండేది. 'మేల్ ఛావనిస్టు పిగ్' కాని ఆడం, విక్టోరియాని ప్రోత్సహిస్తూ వుంటాడు.

వాళ్ళ చనువు చూసి, స్వాతికి ఒకింత ఆశ్చర్యం.

"మీరిద్దరూ ఇంత చనువుగా వుంటే, మీ పెద్దలకి అభ్యంతరం లేదా?" అని కుతూహలంగా స్వాతి విక్టోరియాని అడిగింది.

"ఇంత చనువంటే, ఎంత చనువనీ?" నవ్వుతూ బదులడిగింది విక్టోరియా.

విక్టోరియా అప్పుడప్పుడు ఆడం రూంలో రాత్రి గడపడం స్వాతికి తెలుసు.

"నువ్వు ఆడంతో రాత్రుళ్ళు గడుపుతావు కదా? ఆ చనువు గురించి అడుగుతున్నాను"

"అయ్యో, పిచ్చి స్వాతీ! ముద్దులూ, కౌగలింతలూ తప్ప మా మధ్య ఏమీ జరగలేదు ఇప్పటి వరకూ. మేమిద్దరమూ గట్టి కేథలిక్స్. వివాహం జరిగే వరకూ, దగ్గరితనం వుండరాదని మా మత నమ్మకం. అందుకే మేమెప్పుడూ లిమిట్స్ దాటలేదు!" అంది విక్టోరియా.

అలా వేరే వాళ్ళు చెప్పుంటే నమ్మేది కాదు స్వాతి. స్నేహితురాలికి తనతో అబద్ధం చెప్పే అవసరం లేదని తెలిసి, నమ్మక తప్పలేదు.

ఒకరోజు పెళ్ళి గురించి డిస్కషన్ వచ్చింది వాళ్ళ మధ్య.

"ఇండియన్లలో స్త్రీలు పెళ్ళి తర్వాత ఇంటిపేరు మార్చుకునే పద్ధతి వుంది. భర్త ఇంటి పేరే భార్యకి వస్తుంది. భార్య ఇంటిపేరు భర్త ఎప్పుడూ తీసుకోడు. కొన్ని చోట్ల అయితే భర్త పేరే, భార్యకి ఇంటిపేరుగా వుంటుంది. అది స్త్రీలకి ఏ మాత్రం ఆత్మగౌరవమైన విషయం కాదు గదా? స్త్రీలే ఎందుకు ఇంటిపేరు మార్చుకోవాలి? నేను పెళ్ళి తర్వాత నా ఇంటిపేరు మార్చుకోను. నా ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటాను" అంది స్వాతి.

"అదేమో బాబూ! పెళ్ళి తర్వాత నేను ఇంటిపేరు మార్చుకోవాలని ఆడంకి కోరిక. నాకూ అది ఇష్టమే. ఇందులో ఆత్మగౌరవం పోయే విషయం ఎక్కడుందీ? నా ఆత్మగౌరవం నాకే వుంటుంది, నేను ఇంటిపేరు మార్చుకున్నాక కూడా. ఇంటి పేరు మార్చుకున్నంతలో ఆత్మగౌరవం పోతుందని నేననుకోను" అంది విక్టోరియా తన్ను తాను సమర్థించుకుంటూ.

ఆ అయోమయం మాటలు విన్నాక, స్వాతికి వాళ్ళ మధ్య నున్న ప్రేమ మీద అనుమానం కలిగింది. ఆత్మగౌరవానికి అర్థం తెలియని మనుషుల మధ్య కూడా ప్రేమ గట్టిగా వుంటుందా అని ఆమెకి అపనమ్మకం.

ఆ విషయమే తల్లితో చర్చించింది ఒకసారి.

"అజ్ఞానం అనేది ఒక వరం. ప్రేమ గట్టిగా వుండటం అనేది ఒక రెలిటివ్ విషయం. వాళ్ళకి వాళ్ళు అది గట్టిగా వుందనే అనుకుంటారు. ఆ ప్రేమ సంబంధంలో ఒకరి వల్ల ఇంకొకరు ఎంత అవమానాలకి గురవుతున్నా, అది అర్థం చేసుకునే జ్ఞానం వారికి లేనప్పుడు, వారు ఆ ప్రేమ సంబంధంలోనే కొనసాగుతూ, తమ ప్రేమ చాలా గట్టిదని నమ్ముతూ వుంటారు. అలాంటి వాళ్ళు ఎప్పుడూ

విడిపోకుండానే వుంటారు కూడా. అందుకని, తమ జ్ఞానానికి సంబంధించినంతవరకూ, తమ ఆత్మగౌరవాన్ని తమ నిర్వచనంతో నిలబెట్టుకుంటే, ఆ సంబంధం చాలా కాలమే వుంటుంది" అంటూ తల్లి చిన్న లెక్చరిచ్చింది.

ఒకరోజున విక్టోరియా కంగారు కంగారుగా స్వాతి దగ్గరకి వచ్చింది. 'ఏమైందన్నట్టు' చూసింది స్వాతి. కొంచెం సిగ్గుపడుతూ, "మరేం లేదు. ఏదో ప్రోబ్లం వచ్చినట్టుంది. గైనకాలజిస్టు దగ్గరకి వెళ్ళాలి. ఇవాళ క్లాసుకి రాలేను. నీ దగ్గర నోట్సు తీసుకుంటాను" అంది విక్టోరియా.

స్వాతి ఆశ్చర్యపోయింది. ఏమనాలో తెలియక వూరుకుంది. తర్వాత విక్టోరియా గైనకాలజిస్టు దగ్గరకి వెళ్ళి, అబార్షన్ చేయించుకుంది.

మరి కొన్నాళ్ళకి విక్టోరియా విషాదంగా రూంకి వచ్చింది. ఏమయిందని స్వాతి అడిగింది.

"ఆడం, నేనూ బ్రేక్ చేసుకున్నాము. ఫ్రెండ్స్ గానే వుంటాము తప్ప, ఇంకేమీ వుండదు మా మధ్య" అని బాధగా అంది విక్టోరియా.

"ఏమయింది? ఇవాల్టి వరకూ బాగానే వున్నారుగా? పొద్దున్న పువ్వులు కూడా పంపాడుగా ఆడం నీకూ?" ఆశ్చర్యంగా అడిగింది స్వాతి.

"కాదు. ఇది కొన్నాళ్ళుగా సాగుతోంది. ఆడంకి మత విశ్వాసం నాకున్నంతగా లేదు. ఎప్పుడన్నా చర్చికి వస్తాడు గానీ, రెగ్యులర్‌గా ప్రతీ ఆదివారం రాడు. జీసస్ అంటే నమ్మకం వుందంటాడు గానీ, అన్ని మత విషయాల్లోనూ పట్టుగా వుండడు. అబార్షన్ ఫరవాలేదంటాడు. అతని మతాభిప్రాయాలు నాకు పట్టడం లేదు. ఇవాళ పూర్తిగా విడిపోదామని నిశ్చయించుకున్నాము మేమిద్దరమూ. గట్టి కేథలిక్ కాని మనిషితో నేను జీవితాంతం కలిసి వుండలేను" అంది విక్టోరియా గట్టిగా.

వెర్రిమొహం వేసుకుని చూడ్డం తప్ప, ఏమీ చెయ్యలేకపోయింది స్వాతి.

* * * * * * * * * *

రామారావుకో పెద్ద సంకటం వచ్చింది. తల్లిని ఇంటికి తీసుకువచ్చి, ఓ ఆర్నెల్లు వుంచుకుంటానంటే, భార్య సుమ ఒప్పుకోవడం లేదు. సుమకి అత్తతో భయంకరమైన గతం వుంది. దాంతో అత్తతో ఒక్కరోజు సహజీవనం చెయ్యడానికి క్కూడా సుమ ఒప్పుకోవడం లేదు.

"నా తల్లిని నా ఇంటికి తీసుకురాకుండా ఎలా వుంటానూ? నా అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ నా గురించి ఏమనుకుంటారూ? నా పరువు మొత్తం పోతుంది, పెళ్ళానికి లొంగిపోయి, తల్లిని తీసుకురాకపోతే" అన్నాడు సుమతో.

"మీ భార్య గయ్యాళిదని అందరితోనూ చెప్పుకోండి. మీరే వెళ్ళి మీ అమ్మ దగ్గర ఓ నెలుండి రండి. అంతే గానీ ఆవిడ్ని భరించడం ఇక నా వల్ల కాదు" అని తేల్చి చెప్పేసింది.

"అలా కుదరదు" అన్నాడు రామారావు మొండిగా.

"అలా కుదరకపోతే, నన్ను మా పుట్టింటికి పంపండి. పిల్లల్ని తీసుకుని వెళ్తాను. మీ అమ్మని పంపించేక వస్తాను" అని సలహా ఇచ్చింది సుమ.

"నువ్వూ, పిల్లలూ లేకపోతే అమ్మ ఏమనుకుంటుంది? ఆర్నెల్లు వద్దు గానీ, ఒక్క నెల నాకోసం భరించు" అన్నాడు రామారావు బతిమాలుతూ.

వల్లకాదంది సుమ.

భార్యని ఒప్పించడానికి రోజూ పువ్వులు తీసుకెళ్ళాడు. గిఫ్టులు తీసుకెళ్ళాడు. భర్త ప్రేమకి మురిసింది గానీ, అత్తతో నరకానికి సిద్ధంగా లేదు సుమ.

ఇంక లాభం లేదని, సుమని తీసుకుని సైకాలజిస్టు దగ్గర కెళ్ళాడు. సుమ తన ఘోషంతా వెళ్ళ బుచ్చుకుంది. అంతా విని, ఆ సైకాలజిస్టు సుమనీ, అతని తల్లినీ ఒకే చోట వుంచొద్దని సలహా ఇచ్చింది.

రామారావుకి ఒళ్ళు మండిపోయింది.

''నువ్వంతా నా భార్య వేపు నించీ విన్నావు. మా అమ్మ వేపు నించి అస్సలు వినలేదు. అలా వినకుండా, ఇలా జడ్జిమెంటు ఇస్తే, అదేం న్యాయం?'' అంటూ దెబ్బలాడాడు రామారావు.

''మీ అమ్మ నించీ ఏమీ వినక్కర్లేదు, మీ అమ్మ మదర్ థెరిస్సా అయినా సరే. నీ భార్యకీ, నీ తల్లికీ అంత పడకుండా వున్నప్పుడు, ఏ మాత్రం బుద్ధున్న వాళ్ళయినా సరే, వాళ్ళిద్దర్నీ ఒకే చోట వుంచొద్దని చెబుతారు. దానర్థం వాళ్ళిద్ద ర్లో ఒకరు చెడ్డమనిషీ, ఒకరు మంచి మనిషీ అని చెప్పినట్టు కాదు. ఎవరు మంచీ, ఎవరు చెడూ అనే విషయం పక్కన పెడదాం. వాళ్ళిద్దరి మధ్యా ఇంత ద్వేషం వున్నప్పుడు, వాళ్ళిద్దర్నీ కలిపి ఒకే కప్పు కింద వుంచడం వాళ్ళిద్దరికీ మంచిది కాదు. నీక్కూడా శాంతి వుండదు'' అని బోధించిందా సైకాలజిస్టు.

ఆ మాటలు ఒక్కటీ బుర్రకెక్కలేదు రామారావుకి. పైపెచ్చు ఆ సైకాలజిస్టుని బాగా తిట్టి వచ్చాడు.

''మీ అత్తతో నువ్వు కలిసి వుండాలి'' అని సైకాలజిస్టు భార్యకి చివాట్లు పెడుతుందని రామారావు ఆశ. అది కాస్తా వమ్ము అయ్యేసరికి, భార్యని పుట్టింటికి పంపడానికి నిశ్చయించుకున్నాడు.

''నేను మొదట్లో అడిగినప్పుడు మీరు ఒప్పుకోలేదు. ఇన్ని రోజులు గొడవ పడి, ఇంత హడావిడి చేసి, ఇప్పుడు మమ్మల్ని పంపిస్తానంటే, వెళ్ళడానికి ఇప్పుడు నేను సిద్ధంగా లేను'' అని ఖరారుగా చెప్పింది సుమ.

''మా అమ్మని తీసుకురావడం ఖాయం. వుంటే వుండు, చస్తే చావు'' అని తిట్టాడు సుమని.

ఇంత జరిగాక, అత్తని భర్త తీసుకురాడని సుమ నమ్మకం. అలాగే సుమ ఒప్పుకుంటుందనో, లేదా భరించి వూరుకుంటుందనో రామారావు నమ్మకం.

ఇద్దరి నమ్మకాలూ వమ్మయ్యాయి.

ఆ మర్నాడే సుమ అత్త వచ్చే రోజు.

''నేనీ ఇంట్లో వుండను. వేరే అపార్ట్‌మెంట్లో వుంటాను పిల్లల్తో'' అని చెప్పింది సుమ.

అప్పటికప్పుడు అపార్ట్‌మెంటు అద్దెకి తీసుకుని, తాళం సుమ చేతిలో పెట్టీ, తల్లిని తీసుకురావడానికి వూరెళ్ళాడు.

తన కన్నా తల్లి కంత విలువివ్వడంతో, సుమకి భర్త మీద మనసు విరిగిపోయింది.

''నేనేమన్నానూ? ఆయన తల్లితో కలిసి వుండనన్నాను. ఆయన్ని కలిసి వుండొద్దనలేదే! ఆయన్ని తన వాళ్ళతో సంబంధాలు తెంపుకోమనలేదే! మా అమ్మనీ ఈయన చాలా ద్వేషిస్తాడు. ఆవిడతో కలిసి ఒక్క పూట కూడా గడపలేదు ఇన్నేళ్ళ లోనూ. ఆఖరికి భార్యా,పిల్లల్ని ఇంట్లోంచి పంపుతున్నాడు బయటకి'' అంటూ బాధ పడింది సుమ.

ఆ అపార్ట్‌మెంట్లో మంచం లేదు. ఫోను లేదు. టీవీ లేదు. కంప్యూటర్ లేదు. కుర్చీలు లేవు. ఏదో వుడకేసుకుని, కింద పడుకోవడమే పిల్లల్తో. పిల్లల కష్టం చూసి కూడా ఆ తండ్రి మనసు కరగలేదు. అత్త వెళ్ళే వరకూ, తనకీ జైలు శిక్ష తప్పదనుకుంది సుమ.

ఈ లోపల అత్తా, భర్తా స్నేహితులందరిళ్ళకీ వెళ్ళి, ''సుమ గయ్యాళిదనీ, తనే పొగరుగా ఇంట్లోంచీ వెళ్ళిపోయిందనీ'' చెప్పుకున్నారు. అదే విషయం బంధువులక్కూడా చెప్పుకున్నారు.

భర్త మీద విరక్తి ఎక్కువయిన సుమ మంగళసూత్రం తీసేసింది. నిర్లిప్తంగా తయారయింది.

ఆ రోజు భర్త అపార్ట్‌మెంటుకొచ్చాడు పిల్లల్ని చూడ్డానికి. భర్తతో అప్పటికే అవసరమైతే తప్ప, మాట్లాడ్డం మానేసింది సుమ.

"రేప్పొద్దున్న మా అమ్మని తీసుకుని బయటకి వెళతాను. ఏడు తర్వాత నువ్వు రావొచ్చు ఇంటికి. మళ్ళీ పన్నెండు తర్వాతే ఇంటికొస్తాం. అప్పటికి ముందే నువ్వెళ్ళిపోవచ్చు" అన్నాడు రామారావు.

సుమకేమీ అర్థం కాలేదు. 'ఏమిటన్నట్టు' చూసింది.

"ఏమిటేమిటీ? మరి రేపు పూజ చేసుకోవా?" ఏదో ఘోరమైన తప్పు జరిగిపోతోందన్నట్టు చూశాడు.

ఇంకా అర్థం కాలేదు సుమకి. అలాగే కళ్ళప్పగించి చూసింది భర్తని.

"అది కాదే! రేపు వరలక్ష్మీ వ్రతం కదా? మా అమ్మని పొద్దున్న బయటకి తీసుకెళ్తాను. నువ్వు ఇంటికొచ్చి, నీ మాంగళ్య సౌభాగ్యం కోసం పూజ చేసుకో. అది నీకే మంచిది. సుమంగళిగా జీవిస్తావు కలకాలం. పూజకి నైవేద్యం కోసం వంట చేస్తావు కదా? కొంచెం ఎక్కువ చెయ్యి. ఇంకో రెండు ఐటమ్సు ఎక్కువ చెయ్యి. సాయంకాలం మేము వంట చేసుకోము మళ్ళీ" అన్నీ చెప్పాడు రామారావు ధారాళంగా.

మంగళసూత్రం తీసేసిన సుమ భర్తని అలాగే చూస్తూ వుండిపోయింది.

# పిల్లలున్నారు జాగ్రత్త

చాలా మంది తల్లితండ్రులకు పిల్లలతో ఎలా ప్రవర్తించాలో, వాళ్ళని ఎలా పెంచాలో, వాళ్ళకి ఎటువంటి విలువలు నేర్పించాలో సరిగా తెలియదు. మనం ఎంత కరెక్టుగా ప్రవర్తిస్తున్నామని మనం అనుకున్నా, ఫలితాలు వేరేలా వుండడంతో, మన నమ్మకాల మీద మనకే అనుమానం వస్తుంది. అయితే పిల్లల మీద సంఘ ప్రభావం చాలా ఎక్కువగా వుంటుందనీ, వాళ్ళ వయసు పెరిగే కొద్దీ ఆ ప్రభావం వాళ్ళ మీద పెరుగుతూ వుంటుందనీ చాలా మందికి అర్థం కాదు.

తల్లింతండ్రులు పిల్లలకి ఎటువంటి 'విలువలు' నేర్పిస్తారు? ఎప్పుడూ తాము నమ్మే 'విలువల'నే నేర్పిస్తారు. కొన్ని విషయాల్లో మారుతున్న కాలంతో పాటు తమ 'విలువలు' కూడా మారుతున్నాయని అర్థం చేసుకోక, చుట్టూ వున్న వాళ్ళు మారినా సరే, తాము మారక, అవే విలువల్ని అంటి పెట్టుకుని, అవే తమ పిల్లలపై రుద్దుతారు. ఇవి కలకాలం నిలవవు చాలా కేసుల్లో. ప్రపంచంలో వున్న కొత్త భావాలు పిల్లలకి ఇవ్వాలి, తమ భావాలు ఎలా వున్నా. ఎటొచ్చీ తమ భావాలు చెడ్డవి కాకుండా చూసుకోవాలి. "ఎవరు నిర్ణయిస్తారూ మంచినీ, చెడునూ" అని అంటారా? ఎవరికి వారే, లోకాన్ని చదువుతూ, తమ చైతన్యంతో నిర్ణయించుకోవాలి.

ఇంకొన్ని కేసుల్లో తల్లితండ్రులు తాము నమ్మే "విలువల్ని" తమ పిల్లలకి సరిగా ఇవ్వలేకపోతారు. ఎందుకంటే దానికి సరిపడే జ్ఞానం వారి దగ్గర లేకపోవడం వల్ల. వాళ్ళు 'విలువలు' నేర్చుకుంటున్నప్పుడు, వారికి రాని ప్రశ్నలు, వాళ్ళ పిల్లల కొస్తాయని వూహించరు. వచ్చినప్పుడైనా తాము నమ్మిన 'విలువలు' గురించి జ్ఞానాన్ని పెంపొందించుకోకుండా, వున్న జ్ఞానంతోనే సంతృప్తి పడి వుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు, తమ తల్లితండ్రులకేమీ తెలియదని అర్థం చేసుకుని, బైట నించీ వచ్చే జ్ఞానానికి లొంగిపోతారు, అది తప్పైనా, ఒప్పైనా. కాబట్టి తల్లితండ్రులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, అదే తమ పిల్లలకి నేర్పుకోవాలి. సాధారణంగా తల్లితండ్రులు తాము అన్నీ నేర్చేసుకున్నామనీ, నేర్చుకోవడానికి ఇంకేమీ లేదనీ, వున్నదంతా పిల్లలకి నేర్పడమేననీ, మిగిలిన కాలం అంతా

సుఖాలతో ఎంజాయ్ చెయ్యడమేననీ భ్రమిస్తూ వుంటారు. భ్రమలు తొందరలోనే పటాపంచలైపోతూ వుంటాయి. ముఖ్యంగా తాము నమ్మిన విలువల గురించి ఎప్పుడూ కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటూ వుండాలి.

కొన్ని కేసుల్లో ఇంకా విచిత్రం. తల్లితండ్రులు పిల్లలకి ఒక 'విలువ'ని నేర్పుతారు. అయితే అజ్ఞానం వల్లో, తెలివితక్కువదనం వల్లో, నిర్లక్ష్యం వల్లో, అమాయకత్వం వల్లో తాము సరిగా పాటించరు. పిల్లలు తల్లితండ్రులని చాలా సునిశితంగా పరిశీలిస్తారని తల్లితండ్రులకి సరిగా తెలియదు. అందువల్ల పిల్లల సమక్షంలోనే అవాకులూ, చవాకులూ మాట్లాడుతారు. పిల్లలు అవే నేర్చుకుంటారు. "మేమెప్పుడు ఈ తప్పుడు విలువలు పిల్లలకి నేర్పేమా" అని తలలు కొట్టుకుంటారు తల్లితండ్రులు. అది తమ అజ్ఞానం అని గ్రహించుకోరు.

అంటే తల్లితండ్రులు తమ పిల్లలని తమ భావాలకి అనుగుణంగా పెంచాలంటే, తాము కొత్త విషయాలు నేర్చుకుంటూ, పాత తప్పుడు విషయాల్ని వదిలేస్తూ, పిల్లల సమక్షంలో ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్టాడుతూ, చుట్టూ వున్న సంఘ వాతావరణంతో నిరంతర సమరం సాగిస్తూ వుండాలి.

ఇప్పుడు కొన్ని అనుభవాలని పరిశీలిద్దాం.

* * * * *

రామారావుకి పిల్లాడిని భయభక్తులతో పెంచడం ఇష్టం. తను తన తండ్రిని "నాన్నగారూ" అని పిలిచినట్టే తన కొడుకు చేత "నాన్నగారండీ" అని పిలిపించుకుంటాడు.

నాలుగేళ్ళ తేజకి అంత పెద్ద పదం నోరు తిరక్క, "నానండీ" అని పిలిచేవాడు. "మీరు" అని మాత్రం తప్పకుండా అనేట్టు చూసుకున్నాడా తండ్రి. ఈ పద్ధతుల్లో రామారావు భార్య సుమకి అభ్యంతరాలేవీ లేవు. దాంతో గొడవ లేకుండా పోయింది. సుమ కూడా ఎక్కువమంది లాగే భర్తని "ఏమండీ" అనీ, "మీరు" అనీ పిలిచేది. రామారావు ఆ పిలుపులకి మురుసుకుంటూ వుంటాడు.

తేజకి ఆరేళ్ళ వయసులో ఆ కుటుంబం అమెరికా వచ్చేసింది. వచ్చిన రెండేళ్ళకి చుట్టూ వున్న తెలుగు కుటుంబాల్నీ, ఆ ఇళ్ళల్లో వున్న పిల్లల్నీ గమనించాడు తేజ. ఎవరూ తమలా లేరని గ్రహించుకున్నాడు.

ఒక రోజు తండ్రిని అడిగాడు ఆశగా.

"నానండీ! నా ఫ్రెండ్సు నన్ను వెక్కిరిస్తున్నారు. వాళ్ళు నన్నస్తమనూ, 'నానండీ" అని పిలుస్తున్నారు. నేను కూడా మిమ్మల్ని 'నువ్వు' అని అంటాను అందరిలాగా. సరేనా?" అని.

రామారావుకి కోపం వచ్చేసింది.

"అస్తమానూ ఆ పిల్లలతో తిరగొద్దన్నానా, లేదా? నువ్వుత్త జడ్డి వెధవ్వి. నన్ను 'నువ్వు' అని అంటే చంపేస్తాను. 'మీరు' అనే అనాలి" అని అన్నాడు గట్టిగా.

ఎనిమిదేళ్ళ తేజ తండ్రి కోపానికి హడలిపోయాడు. ఆ విషయం మళ్ళీ కల్లోకి కూడా రాకుండా మర్చిపోయాడు. ఆ సంఘటన చూసిన తల్లి కూడా ఏమీ అనలేదు. ఆవిడ కూడా తన తండ్రిని "మీరు" అనే అంటుంది మరి ఇప్పటికీ.

అలా ఇంకో ఎనిమిదేళ్ళు కాలచక్రం లోకి జారుకున్నాయి. ఏవేవో సంఘటనలు జరగడం, రామారావూ, సుమల మధ్య ఘర్షణలు జరగడం చాలాసార్లు అయింది.

అలాంటి ఘర్షణల్లో, ఒకసారి సుమ అనుకోకుండా ఆవేశంలో "నువ్వు" అంది భర్తని.

అంతే! ఆ భ ర్త వ్యగుడైపోయాడు.

"అదేం పిలుపు? అదేం మర్యాద? ఇదేనా నిన్ను మీ వాళ్ళు పెంచిన పద్ధతి? భర్తని "నువ్వు" అనడం ఏం మర్యాద? ఇంకేం? ఇకనించీ 'లం..కొ..' అనీ, 'ముం..కొ..' అనీ పిలు. పిల్లలు కూడా అవే నేర్చుకుంటారు. ఇలాంటి దరిద్రగొట్టు పద్ధతులు ఇంటా, వంటా లేవు మా వంశంలో. అన్నీ దరిద్రగొట్టు బుద్ధులూ, దౌర్భాగ్య పెంపకాలూ!" అని తిట్టిన తిట్లే తిరిగి తిరిగి తిట్టాడు.

సుమ బిక్కమొహం వేసుకుని, కళ్ళనీళ్ళు కుక్కుకుని మౌనంగా వుండిపోయింది.

అక్కడే వున్న తేజ వూరుకోలేకపోయాడు.

"తప్పేముంది నానండీ, అమ్మ మిమ్మల్ని "నువ్వు" అంటే? ఈ దేశంలో అందరూ అలాగే చనువుగా వుంటారు కదా? మీరు చాలాసార్లు అమ్మని 'అదీ', 'ఇదీ' అని అన్నారు. అమ్మ మాత్రం 'నువ్వు' అంటే భరించలేకపోతున్నారు. అసలు మీరు పెరిగిన పద్ధతులే సరికావేమో చూసుకోండీ ఒకసారి. ఎంతకాలం మమ్మల్ని భయపెట్టి, మీ కంట్రోల్లో వుంచుకుంటారూ?" అని గట్టిగా ప్రశ్నించాడు.

తన కన్నా పొడుగ్గా, బలంగా వున్న పదహారేళ్ళ కొడుకు, అలా ఎదురు తిరిగి జవాబు చెప్పడంతో, తల తిరిగి, ఏం అనాలో తెలియక, అప్పటికి మాత్రం అలాగే చూస్తూ వుండిపోయాడు రామారావు.

* * * * *

ఆ సంఘటనలో తండ్రి పెత్తనం బాగా కనబడుతోంది. ఎన్నో కుటుంబాల్లో పురుష పెత్తనం వున్నా, భార్యల చేత భర్తలు 'మీరు' అని పిలిపించుకుంటున్నా, పిల్లల విషయంలో మాత్రం ఆ నిబంధనలు సడలించారు. నిజానికి ఈ ఒక్క కుటుంబాన్ని తప్ప, తండ్రిని "మీరు" అనే వేరే కుటుంబాన్ని అమెరికాలో నేను చూడలేదు. దీనర్థం అలాంటి కుటుంబాలు అసలు లేవని కాదు. ఎక్కువగా లేవని మాత్రమే.

చిన్న వయసులో భయపెట్టి లొంగదీసినా, వయసొచ్చాక ఆ భయం నిలవదని అర్థం కాలేదు రామారావుకి. ప్రేమాభిమానాలతో కాకుండా, భయంతో తమకిష్టమైనవి పిల్లల మీద రుద్దాలని చూస్తే, వాటి కోనాడు కాలదోషం పడుతుంది. పిల్లల ముందర దోషిలా నిలబడాల్సి వస్తుంది. పెద్దవాళ్ళు సరిగా వున్నా, సంఘ ప్రభావం వల్ల పిల్లలు తప్పుగా ప్రవర్తించే విషయాలు వేరు. మారిన సమాజంతో పాటు తమ విలువని మార్చుకోకపోతే, పిల్లలు సంఘ పరిణామాన్ని గమనించి పెద్దలకి ఎదురు తిరుగుతారు.

* * * * *

కృష్ణ మంచి మనిషి. స్నేహితులకి సాయంగా వుంటాడు. ఇంట్లో తల్లితండ్రులకి ఇష్టం లేకపోయినా, వాళ్ళ నెదిరించి తన కిష్టమైన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. తర్వాత కాలంలో ఆ తల్లితండ్రులు కూడా రాజీ పడ్డారు. కొన్నాళ్ళకి కొడుకు పుట్టడం, ఆ తరవాత ఇంకో నాలుగేళ్ళకి అమెరికా రావడం జరిగాయి.

కృష్ణా, అతని భార్య రంజనీ దేముడిపై గట్టి నమ్మకం కలవారు. పిల్లాడికి కూడా అవే నమ్మకాలు నేర్పారు చాలా సహజంగా. ఆ పిల్లాడు తల్లితండ్రులతో గుళ్ళు తిరిగాడు. పూజలు చేశాడు. పార్టీల కెళ్ళాడు. ఆధునిక వసతులన్నీ అనుభవించాడు. ఆ క్రమంలో బుర్రలో ప్రశ్న లుదయించడం మొదలు పెట్టాయి.

పాపం, తల్లితండ్రులకి చిన్నప్పటి నించీ అలవాటయిన మత విషయాలూ, వాటి పద్ధతులూ తప్ప ఏమీ తెలియవు. ఇష్టమైన గట్టి భక్తి మాత్రం వుంది. ఒక్క పుస్తకం చదవలేదు. సినిమాలూ, టీవీలూ, గ్రంథా ద్వారా తెలిసిన పురాణ కథలు తప్ప ఏమీ తెలియవు, చాలా మందికి మల్లే. తమకు తెలిసిన అరకొర విజ్ఞానంతో పిల్లాడికి కూడా భక్తి పుట్టించాలని ప్రయత్నించారు.

పిల్లాడి పేరు శ్రీకర్. వాణ్ణి బాల విహార్‌లో చేర్చారు. అర్థం చెప్పకుండా శ్లోకాలు కంఠస్తం పట్టించేవారు. చిట్టీ, పొట్టీ రామాయణ, భారత కథలను నేర్పించేవారు అక్కడ. తమ కిష్టమైన సంస్కృతిని పిల్లాడికి అందించినందుకు తల్లితండ్రులు సంతోషంగా వున్నారు. శ్రీకర్ తన తల్లితండ్రులకు అన్నీ తెలుసు అని అనుకుంటాడు.

ఒకరోజు పదేళ్ళ శ్రీకర్ స్కూలు నించీ ఇంటికి విసురుగా వచ్చాడు.

"ఏమైందిరా కన్నా స్కూల్లో? ఎందుకలా చిరాగ్గా వున్నావూ?" అని ప్రేమగా అడిగింది రంజని.

"అమ్మా! శ్రీరాముడి అక్క పేరేమిటీ?" అని సీరియస్‌గా శ్రీకర్ అడిగాడు తల్లిని.

"ఏమిటీ? శ్రీరాముడికి అక్క వుందా? నీకెవరు చెప్పారూ? నాకు తెలిసి శ్రీరాముడికి ముగ్గురు తమ్ముళ్ళు తప్ప అక్క లేదు. ఎందుకలా అడుగుతున్నావూ?" అని ఆరాగా అడిగింది తల్లి.

"మా స్కూల్లో ఓ పిల్లాడున్నాడు. వాడికి దేముడంటే నమ్మకం లేదంట. వాళ్ళ నాన్న వాడికి అలా నేర్పాడుట. నేను శ్రీరాముడి గురించి మాట్లాడితే, 'నీకు రాముడి అక్క పేరే తెలియదు, నువ్వేంటి రాముడి గురించి మాట్లాడేది?" అని నన్ను వెక్కిరించాడు. నాకు సిగ్గేసింది. మీరెందుకు నాకు ఆ కథ చెప్పలేదూ?" అని నిలదీసి అడిగాడు శ్రీకర్.

"బావుందిరా! ఆ కథలన్నీ మాకేం తెలుసు? రాముడిని భక్తిగా పూజించడమే మాకు తెలుసు. మేమా పుస్తకాలు చదవలేదు" అంది రంజని తనని తాను సమర్థించుకుంటూ.

శ్రీకర్ తల్లి వేపు నమ్మలేనట్టు చూశాడు. అంతలో కృష్ణ ఇంటికి చేరాడు.

"ఏమిట్రా సీరియస్ చర్చ?" అని అడిగాడు నవ్వుతూ.

రంజని జరిగింది చెప్పుకొచ్చింది.

"అవునా? రాముడికో అక్క వుందని కూడా తెలియదు నాకు. పూజ చేసుకోవడమే తెలుసు చిన్నప్పటి నించీ!" అని ఆశ్చర్యపోయాడు కృష్ణ.

అన్నీ తల్లితండ్రులకి తెలుసన్న నమ్మకం సడలిపోయింది శ్రీకర్‌కి. తల్లితండ్రులని మతానికి సంబంధించిన ఏ విషయం ప్రశ్నించినా, "నువ్వు చిన్న పిల్లాడివి. ఇప్పుడు అర్థం కాదు. పెద్దయ్యాక అన్నీ తెలుస్తాయి" అని అనేవాళ్ళు. దానర్థం వాళ్ళకి ఎక్కువగా ఏమీ తెలియదనీ, వాళ్ళు పుస్తకాలు ఏమీ చదవలేదనీ అర్థం అయింది శ్రీకర్‌కి. సంగ్దిగ్ధ భావం బుర్రలోకి దూసుకెళ్ళింది.

కొన్నేళ్ళకి శ్రీకర్‌ని ఒక క్రిష్టియన్ హైస్కూలో చేర్చారు. ఆ స్కూలుకి బాగా చదువు చెబుతారని పేరు. అందుకే పెద్ద ఇష్టం లేకపోయినా, ఆ స్కూల్లో చేర్చారు. స్కూల్లో క్రిష్టియన్ మతాన్ని ఒక సబ్జెక్టుగా బోధించేవారు. బైబిల్ స్టడీ గ్రూపులు వుండేవి ఆ స్కూల్లో. ఎవరిని ఏ ప్రశ్న వేసినా వివరంగా, వాళ్ళ నమ్మకాలతో జవాబిచ్చేవారు. శ్రీకర్‌కి వేరే ప్రపంచపు తలుపులు తెరుచుకున్నట్టయ్యాయి.

పన్నెండో క్లాసు కొచ్చేసరికి శ్రీకర్ పూర్తిగా మారిపోయాడు.

"నేను హిందువుని కాను ఇకనించీ! నేను క్రిష్టియన్ అయ్యాను. నాకు హిందూ మతం మీద నమ్మకం లేదు. విజ్ఞానం కూడా లేదు. ఇక నించీ నేను హిందూ మత తంతులు చెయ్యను" అని డిక్లేర్ చేశాడు ఇంట్లో.

తల్లితండ్రులు హతాశులయ్యారు. కొడుక్కి ఎంతో చెప్పి చూశారు. ఎంతకీ వినకపోవడంతో, "పోనీలే! కనీసం ఏదో ఒక దేముడిని నమ్ముతున్నాడు. పూర్తిగా నాస్తికుడవ్వ లేదు, నయం" అని సర్దిపెట్టుకున్నారు.

అయితే ఆ క్రిష్టియన్ స్కూలు మీద విద్వేషం పెంచుకున్నారు. ఆ స్కూలు వల్లే తమ పిల్లాడు అలా చెడిపోయాడని వాళ్ళ నమ్మకం. అందుకని రెండో పిల్లాడిని ఏదో మామూలు పబ్లిక్ స్కూలుకి పంపడానికి సిద్ధమయ్యారు గానీ, ఆ క్రిష్టియన్ ప్రైవేటు స్కూలుకి మాత్రం పంపలేదు.

*   *   *   *   *

ఆ సంఘటనలో మనకి ఏం కనబడుతోందీ? ఆ తల్లితండ్రులకి తమ నమ్మకాలకి సంబంధించిన విషయాలు పూర్తిగా తెలియవు అని. "రాముడి అక్క" అనేది ఒక చిన్న వుదాహరణ మాత్రమే. అనేక విషయాలు తెలియవు. పిల్లాడు అడుగుతుంటే, జవాబులు చెప్పలేక పోయేవారు. పిల్లాడికి ప్రశ్నలు బుర్రలో వుదయించకపోతే, అతనూ తన తల్లితండ్రుల్లా పెరిగేవాడే. తల్లితండ్రులు ఏమీ పుస్తకాలు చదవరు. ఏవో సినిమా బొమ్మలు చూసి, ఆ కబుర్లు చదవడం తప్ప. మహా అయితే అక్కడా, ఇక్కడా రాజకీయాలు చదవడం. దాంతో తమకి లేని జ్ఞానం (తప్పో, ఒప్పో) తమ పిల్లాడికి అందివ్వలేకపోయారు. తమ తప్పు తాము తెలుసుకోలేకపోయారు. ఆ లోగా వేరే మతం వాళ్ళు ఆ పిల్లాడికి తమ జ్ఞానాన్ని (తప్పో, ఒప్పో) అందజేయడంతో, పిల్లాడు కాస్తా మతం మార్చేసుకున్నాడు. ఒక తప్పులోంచీ ఇంకో తప్పులోకి దుంకడమే ఇది. దానికి కారణం ఆ తల్లితండ్రుల అజ్ఞానమే. నిజమైన జ్ఞానం వుంటే, వాళ్ళు ఏ మతాన్నీ నమ్మి వుండేవాళ్ళు కాదు. అది వేరే సంగతి. తమ జ్ఞానాన్ని పెంచుకోకపోతే, దానికి బాధ్యులు తల్లితండ్రులే.

*   *   *   *   *

ఆ మధ్య కాలంలో ఏదో హైకింగ్‌లో ఒక ఎనిమిదేళ్ళ అమ్మాయిని కలిశాను. ఆ అమ్మాయి పేరు అంజలి అందాం. హైకింగ్ దార్లో ఒక చోట ఆ అమ్మాయి ఆగిపోయి వుంది.

"ఏమ్మా? ఏమన్నా ప్రోబ్లం వచ్చిందా?" అని నవ్వుతూ ఇంగ్లీషులో అడిగాను.

"నాకు తెలుగొచ్చు! నాతో తెలుగులో మాట్టాడొచ్చు" అంది అంజలి కాస్త తిప్పుకుంటూ.

అంత చిన్న పిల్ల అలా అంటే, నాకు నవ్వొచ్చింది.

"సరే! నీకు తెలుగొచ్చని నాకు తెలియదులే. నీతో తెలుగులోనే మాట్టాడుతాలే!" అనంటూ అంజలితో కబుర్లు చెబుతూ హైకింగు చెయ్యసాగాను.

దార్లో ఇంకో అమ్మాయి సింధు కలిసింది. ఆ అమ్మాయి కూడా తెలుగులో మాట్టాడసాగింది. చక్కగా తెలుగులో మాట్టాడుతున్న ఆ చిన్న పిల్లలిద్దర్నీ చూస్తే చాలా ముచ్చటేసింది.

ముగ్గురం మంచి ఆకలి మీదున్నాం. ఎప్పుడు హైకింగ్ అయిపోతుందా, ఇంటికెళ్ళి తిండి తినొచ్చా అని నకనకలాడి పోతున్నాం.

"నాకైతే మంచి చీజ్ బర్గర్ తినాలనుంది బాబూ!" అంది అంజలి ఆశగా.

"మొదట్లో చీజ్ బర్గర్ అంటే చీజ్‌తో చేస్తారని అనుకునేవాడిని. అందులో మీట్ వుంటుందని తర్వాత తెలిసింది" అన్నాను నవ్వుతూ.

"మీట్? నేను మీట్ తినను బాబూ" అంది సింధు మొహం కాస్త చిట్లించుకుని.

"ఏం? మీరు బ్రాహ్మలా?" అని అడిగింది అంజలి చటుక్కున.

తెల్లబోయాను. అమెరికాలో అంత చిన్న పిల్ల, కులం గురించి అలా అడుగుతుందని వూహించని నేను ఆశ్చర్యపోయాను.

"అవును, మేం బ్రాహ్మలం" అంది సింధు.

ఇంక వూరుకోలేకపోయాను.

"ఇంత చిన్న వయసులోనే నీకు కులాల గురించి ఎలా తెలుసు? ఎవరు మాట్టాడుతారు ఇలా ఇక్కడ? ఎక్కడ నేర్చుకున్నావు ఈ మాటలు?" అనడిగాను ఆశక్తిగా.

"మా అమ్మా,నాన్నల దగ్గర నేర్చుకున్నాను ఈ మాటలు. వాళ్ళెప్పుడూ అలాంటివి మాట్టాడుతూ వుంటారు. అందుకే నాకన్నీ తెలుసు" అంది అంజలి గడుసుగా.

రెండు చేతుల్తో నోర్మూసుకున్నాను.

ఇంకొన్నాళ్ళకి ఎనిమిదో క్లాసు చదివే ఇంకో తెలుగబ్బాయి రవి వచ్చాడు నా దగ్గరకి ఏదో చెప్పించుకోవడానికి. ఏవో మాటల్లో అడిగాను అతని హాబీలు ఏమిటని. అతను ఏదో తెలుగు ఆర్గనైజేషను ప్రోగ్రాంలో పాల్గొంటున్నాడుట. అదంటే అతనికి ఇష్టమని చెప్పుకున్నాడు.

టీవీ ముందర టైం వేస్టు చేసుకునే కన్నా, ఇలాంటివి నయం అని నా వుద్దేశ్యం.

"అయితే నాకు ఒక కంప్లైంటుంది ఆ ప్రోగ్రాం కండక్టు చేసేవాళ్ళ మీద" అన్నాడు రవి.

"ఏమిటది నాయనా?" అనడిగాను కుతూహలంగా.

"ప్రోగ్రాం రోజున వాళ్ళు చికెన్ పెట్టరు. అన్నీ బ్రాహ్మణ వంటకాలే పెడతారు. అవంటే నాకిష్టమే గానీ, చికెన్ పెట్టరని నాకు దిగులు" అన్నాడు కాస్త దిగులుగా రవి.

నాకు నవ్వాగలేదు.

"అవి బ్రాహ్మణ వంటకాలని నీకెలా తెలుసూ? వాటి మొహం మీద రాసి వుంటుందా, అలా?" అని నవ్వుతూ అడిగాను.

అమెరికా తెలుగు పిల్లలకి కులాల గురించి బాగా తెలుసని నాకు ఎప్పుడో అర్థం అయిపోయింది. అందుకే బొత్తిగా ఆశ్చర్యం వేయలేదు.

"ఎప్పుడూ మామిడికాయ పప్పూ, గుత్తొంకాయ కూరా, ఆవకాయా, గోంగూర పచ్చడీ పెడుతూ వుంటే, తెలియదా ఏంటీ?" అన్నాడు రవి సరదాగా.

"అదేం మాటా? ఆ పదార్థాలు బ్రాహ్మలు మాత్రమే తింటారా యేమిటీ? అయినా నీకా కంప్లైంటుంటే, ఆ ప్రోగ్రాం నిర్వహించే వాళ్ళకి చికెన్ పెట్టమని ఎందుకు చెప్పలేదూ? అనడిగాను నవ్వుతూ.

"అక్కర్లేదు. నాకు తెలుసు ఆ విషయాలు"

"ఎలా?"

"మా అమ్మా,నాన్నా మాట్టాడుకుంటారు అలాంటి విషయాలు. కాబటి నాక్కూడా తెలుసవి"

"ఏంటబ్బా అవి?"

"మొదటి కారణం, ఆ ప్రోగ్రాం లో వాళ్ళందరూ బ్రాహ్మలు. అందుకని చికెన్ పెట్టరు. వంటలు చేసేది వైశ్య మనిషి అయినా, చికెన్ మాత్రం వుండదు. రెండవ కారణం ప్రోగ్రాం ఎప్పుడూ శనివారం వుంటుంది. మేమెప్పుడూ శనివారం చికెన్ తినం. వినాయక చవితికి పూజ చేశాక ఆ విగ్రహం ఇంట్లో వున్న తొమ్మిది రోజులూ చికెన్ తినం. ప్రోగ్రాం ఆదివారం పెట్టినా కూడా వాళ్ళు చికెన్ పెట్టరు. అప్పుడప్పుడు ప్రోగ్రాం గుళ్ళో చేస్తారు. అందుకని చికెన్ పెట్టరు. అయినా ముఖ్య కారణం వాళ్ళు బ్రాహ్మలు కావటం వల్లే. నాకు తెలుసు."

ఈసారి కూడా పెద్దగా ఆశ్చర్యం కలగలేదు నాకు.

"పోనీ, మరా విషయమే వాళ్ళతో అనలేకపోయావా? నీకోసం చికెన్ వేరేగా పెట్టేవారేమో!" అని తమాషాగా అన్నాను.

"ఇంకా నయం. ఇలాంటి మాటలు బయట మాట్టాడితే మా అమ్మా,నాన్నా చంపేస్తారు. ఏదో మీతో కాబట్టి, రహస్యంగా చెబుతున్నాను. మీరెక్కడా అనకండేం!" అని అన్నాడు రవి.

బండి బాగా దారి తప్పుతోందని అర్థం చేసుకుని, మాట మార్చేశాను.

మీరు నమ్మరని తెలిసినా, నిజం చెప్పాలి కాబట్టి చెబుతున్నాను. పై సంభాషణ, యధాతథంగా అచ్చ తెలుగులో జరిగింది. ఎనిమిదో క్లాసు కుర్రాడు అట్టాంటి తెలుగు మాట్టాడంటే అది, తల్లితండ్రులా, చుట్టూ వున్న వాళ్ళా చలవే మరి.

కానీ కులాల చెత్త పిల్లాడిలో నింపుతున్నామని తల్లితండ్రులు గమనించలేక పోతున్నారు. పిల్లల సమక్షంలో ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రవర్తించకపోతే, వాళ్ళ ప్రవర్తనలోని తప్పుడు విషయాలు పిల్లలు కూడా నేర్చుకుంటారు.

ఇలాగే చాలా విషయాల్లో తల్లితండ్రులు చాలా కఠినంగా వుండటం, పిల్లలు రహస్యంగా తల్లితండ్రుల వెనకాల ఆ పనులు చెయ్యడం చాలా బాగా తెలుసు నాకు. తల్లితండ్రులకు మాత్రం ఏమీ తెలియవు. కొంప మీదకి ఏదీ రానంత వరకూ వాళ్ళకి సమస్య లేదు. వచ్చినపుడు చూసుకుందాం అనుకుంటారు. చాలా కేసుల్లో ఆ విషయాలు ఎప్పటికీ బయటికి రావు. దాంతో తల్లితండ్రులు తమ పిల్లలు మాణిక్యాలని మురిసిపోతారు. కానీ ఆ చెత్త విషయాల ప్రభావం మిగిలిన వాటి మీద ఎలా పడుతుందో అర్థం చేసుకునే తెలివీ, టైం రెండూ లేవు తల్లితండ్రులకు.

'ఏదన్నా పాట పాడండ్రా' అని పిల్లనడిగితే, 'నీకోసం ప్యాడీ ప్యాడీ చస్తానే' అనీ, 'ఓలమ్మీ, తిక్క రేగిందా' అనీ, 'నా వలపంతా నీకోసమే, నా సొగసంతా నీకోసమే' అనీ పాడే చిన్న పిల్లలు ఎంతమందో! 'యమదొంగ' లాంటి సినిమాలు వచ్చినరోజే పిల్లలతో చూసే తల్లితండ్రులెంతమందో! అది వారికి చాలా మామూలు విషయం. చిరంజీవి సినిమా మొదటి రోజు, హాలంతా బుక్ చేసుకుని వెళ్ళి, ఈలలు వేస్తూ, కాగితం ముక్కలు ఎగరేసే సంస్కృతిని ఎంతమంది తల్లితండ్రులు తమ పిల్లకి నేర్పుతున్నారో! పిల్లలకి 'మంచి విలువలు' అన్న మాటలే తెలియవసలు. పెద్దాళ్ళకి తెలిసేడిస్తేగా!



# రాముడు ఎవరి సొత్తు?

"ఏ దేశ చరిత్ర చూసినా, ఏమున్నది గర్వ కారణం? నర జాతి చరిత్ర సమస్తం, పర పీడన పరాయణత్వం" అన్నాడు శ్రీశ్రీ ప్రతీ దేశానికీ ఓ చరిత్ర. ఆ చరిత్రకి గర్వపడే మనుషులు కొందరయితే, ఆ చరిత్ర నించి ఏదన్నా నేర్చుకుందామని మరి కొందరు. మొత్తానికి అన్ని దేశాలకి మల్లే, భారత దేశానికి కూడా పెద్ద చరిత్ర వుంది. ఆ చరిత్రలో ఎన్నో మత గ్రంధాలు వెలువడ్డాయి. అన్నింటిలోకీ ముఖ్యమైనది వాల్మీకి రాసిన "రామాయణం". ఈ గ్రంధం ఆధారంగా ఎన్నో నమ్మకాలూ, ఎన్నో విమర్శలూ, ఎన్నో తగువులూ, దాంతో హడావుడీ. టీవీలో సాగర్ "రామాయణం" వచ్చినా సందడే, "రామాయణ విషవృక్షం" పుస్తకం వెలువడినా సందడే

ఈ మధ్య కాలంలో కొత్తగా వచ్చిన తగవు - రామసేతు. ఈ విషయం మీద ఇప్పటికే ఎన్నెన్నో వ్యాసాలు ప్రచురితం అయ్యాయి. ఎంతమందో తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. "రాముడున్నాడని" కొందరూ, "లేడని" కొందరూ, "రామసేతుని కూలగొట్టకూడదని" కొందరూ, "కొట్టొచ్చని" మరి కొందరూ. నేనిప్పుడు "రాముడున్నాడా, లేడా" అని గానీ, "రామసేతు వుంచాలా, కూలగొట్టాలా" అని గానీ చర్చించడం లేదు. "రామసేతు" విషయం గురించి వచ్చిన వ్యాసాల్లో కొన్ని పాయింట్లున్నాయి. వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదు. వాటి గురించి రాయడమే నా వుద్దేశ్యం.

అయితే ఏమిటా పాయింట్లు?

1. రాముడు ఎవరి సొత్తు?

2. పరమత విమర్శలు

3. అవాకులూ, చవాకులూ

**రాముడు ఎవరి సొత్తు?**

రాముడిని దేముడిగా కొలిచే భక్తులకు రాముడి గురించి ఎలా తెలుసు? చిన్నప్పటి నించీ ఇంట్లో తల్లితండ్రులూ, స్కూల్లో టీచర్లూ, చుట్టూ వున్న వాళ్ళూ చెప్పటం వల్లా, రామాయణంలో వాల్మీకి రాముడి గురించి రాయటం వల్లా. వాల్మీకి రామాయణంలో చెప్పిన రాముడే అందరికీ తెలుసు, చెప్పని రాముడు ఎవరికీ తెలియదు. అందుకని ఎవరైనా రాముడి గురించి మాట్లాడితే, వాల్మీకి రామాయణాన్నే రిఫరెన్సు గ్రంథంగా తీసుకోవాలి. అందులో ఒక భాగం ప్రక్షిప్తమని వాదించినా, ఆ ప్రక్షిప్తకులు కూడా రామ భక్తులే కాబట్టి, వారు చెప్పింది కూడా తీసుకోవాల్సిందే. వాళ్ళెవరూ చెప్పని రాముడు ఎవరికీ తెలియదు కదా? హేతువాదులకి కూడా రాముడి గురించి ఇలాగే తెలుసు. ఎటొచ్చీ హేతువాదులు ఆ విషయాలు చదివి, రాముడు దేముడని ఒప్పుకోవటం లేదు. అంటే సమాజంలో ఆస్తికులకీ, నాస్తికులకీ ఒకటే మూలం రాముడి గురించి తెలుసుకోవడానికి - వాల్మీకి రామాయణమూ, చుట్టూ వున్న వాళ్ళు చెప్పే విషయాలూ. మిగిలినవన్నీ నమ్మకాలే. ఆస్తికులు నమ్మకాలు పెంచుకొంటే, హేతువాదులు అవి తెంచుకున్నారు.

"రాముడి గురించి మాట్లాడ్డానికి నీకు హక్కు లేదు" అని ఆస్తికులు నాస్తికులతో అనడానికి, ఆస్తికులకి హక్కు లేదు. నమ్మకం అనేది మనుషులకి హక్కు ఇవ్వదు. నమ్మకం అనే దాని వల్ల కొంత మంది మనుషులకి కొన్ని రకాల అనుభూతులు కలగొచ్చు. అంతేగానీ, "నేను నమ్మే విషయం గురించి నువ్వు మాట్లాడకూడదు" అని అనడం నియంత్రణే అవుతుంది. ఇది కేవలం నమ్మకానికి సంబంధించిన విషయమే అయితే, దాన్ని తమకి మాత్రమే పరిమితం చేసుకుని, ప్రైవేటుగా వుంచితే, దాన్నెవరూ విమర్శించరు. కానీ పబ్లిక్‌లోకి వచ్చి, తమ నమ్మకాల గురించి మాట్లాడితే, వాటిని విమర్శించడానికి ఎవరికన్నా హక్కు వుంటుంది. హేతువాదుల్ని విమర్శించడానికి ఆస్తికులకి ఎంత హక్కు వుందో, అదీ పబ్లిక్‌లో, ఆస్తికుల్ని గానీ, వారి నమ్మకాల్ని గానీ విమర్శించడానికో, ప్రశ్నించడానికో హేతువాదులకి కూడా అంతే హక్కు వుంటుంది.

గొల్లపూడి మారుతీరావు గారు "వార్త " పత్రికలో "ఒక గర్జన" అనే వ్యాసం రాశారు, "రామసేతు" వివాదం గురించి. ఆయన, "మన దేశంలో హేతువాదం, చదువు కొన్న వారి తెలివితేటలూ, బరి తెగించిన శాస్త్రీయ దృక్పథం, ఏ దశకు పోయిందంటే" అంటూ హేతువాదుల్నీ, చదువుకున్న వారినీ, శాస్త్రీయ దృక్పథం కలవారినీ (అక్కడకి వీరందరూ వేరు వేరు మనుషులు అయినట్టు) ఒకే గాటిన కట్టేసి కేకలేశారు, 'హన్నా' అని. ఎందుకని ఇలా కేకలేశారూ? "లక్షల సంవత్సరాల సాంస్కృతిక మూలాధారాన్ని కేవలం తమకి తెలిసిన పరిజ్ఞానంతో, కోట్ల మంది 'విశ్వాసాన్ని' అయినా దృష్టిలో పెట్టుకోకుండా, కోర్టులకి ఎక్కి కుక్కగొడుగుల్లాగ బుకాయించే స్తాయికి వచ్చింది" కాబట్టి.

ఈయన దృష్టిలో 'లక్షల సంవత్సరాల సాంస్కృతికి మూలాధారాన్ని' ఎవరూ ప్రశ్నించకూడదు. కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని అంతకన్నా ప్రశ్నంచకూడదు. కోట్ల మంది ప్రజలు లక్షల సంవత్సరాల కొద్దీ చంద్రుడు గ్రహం కాదని అనుకున్నా సరే, శాస్త్రీయ పరిశోధనలు చేసి చంద్రుడు గ్రహం అని చెప్పకూడదు. ఎందువల్ల? వీళ్ళందరూ రాముడు తమ సొత్తు అని అనుకోవడం వల్ల. అలా అనుకుని ప్రైవేటుగా తమ గొడవ ఏదో తాము చూసుకున్నారా? అబ్బే, లేదు. పబ్లిక్‌లోకి వచ్చి అరుస్తూనే వున్నారు. మిగిలిన వాళ్ళు మాత్రం అరవకూడదు.

శ్రీశ్రీ అన్నట్టు, (అచ్చు ఇవే మాటలు కావు) "వ్యక్తులూ, సంస్థలూ ప్రైవేటులో వారి సొంతం. పబ్లిక్‌లోకి వస్తే ఏవైనా అడుగుతాం, ఏమైనా అంటాం". ఎవరి అభిప్రాయాల్ని వారికి బయట పెట్టుకునే హక్కు ఉంది. "నేనే మాట్లాడుతానూ, నువ్వు నోర్మూసుకోవాలీ" అని అనడం దౌర్జన్యం తప్ప మరేమీ కాదు.

"వాళ్ళ రాముడినైనా వారికి మిగల్చండి" అని మారుతీరావుగారు బాగా వాపోయారు. అంటే, "రాముడి గురించి మాట్లాడకండీ" అని వాపోతూ చెప్పారన్న మాట.

శ్రీరమణగారు ఆంధ్రజ్యోతిలో ఓ వ్యాసం రాశారు. అందులో ఆయన, "అదే నిండు మనసుతో రాముణ్ణి నమ్మే, నా మనసుపై వీళ్ళంతా ఎందుకు రాళ్ళు రువ్వుతున్నారో బోధపడటం లేదు" అని వాపోయారు.

రాముడు అనే పాత్ర గురించి అందరికీ వాల్మీకి రామాయణంలో చెప్పినట్టుగానే తెలుసు. 'రాముడు దేముడు' అని నమ్మినా, నమ్మకపోయినా, రాముడి గురించి వున్న విషయ విజ్ఞానం అంతా అన్ని రకాల మనుషులకీ సమానంగా తెలుసు. రాముణ్ణి నమ్మేవాళ్ళు తమ నమ్మకాలతో, రాముణ్ణి నమ్మని వాళ్ళ మనసుల మీద రాళ్ళు రువ్వుతున్నారా, లేదా? ఈ వూరికి ఆ వూరు ఎంత దూరమో, ఆ వూరికి ఈ వూరూ అంతే దూరం కాదా? రాముణ్ణి ప్రశ్నించడం, విమర్శించడం, రాముణ్ణి నమ్మే వాళ్ళ మీద రాళ్ళు అన్యాయంగా రువ్వుతున్నట్టేనా? "నేనో విషయాన్ని నమ్ముతున్నాను కాబట్టి, మీరు ఆ విషయాన్ని ప్రశ్నిస్తే, లేదా విమర్శిస్తే అది నా మీద రాళ్ళు రువ్వినట్టే" అని అంటూ సున్నితత్వాన్ని ప్రకటించే వాళ్ళు, తమ నమ్మకాలతో పబ్లిక్‌లోకి రాకూడదు మరి. అందరికీ తమ అభిప్రాయాలు బయట పెట్టుకునే హక్కు వుంటుంది.

శ్రీరమణగారు ఇంకో అడుగు ముందుకేసి, "రాముడు మిధ్య అయితే, అన్నమయ్య మిధ్య, ...... రామదాసు మిధ్య. త్యాగరాజస్వామి మిధ్య" అంటూ దేవుణ్ణీ, ఆ దేవుడి భక్తులయిన మనుషుల్నీ, ఒకే గాటిన కట్టేశారు. ఇంకా నయం, "రాముడు మిధ్య అయితే,

శ్రీరమణగారు మిధ్య'' అని అనలేదు. `రాముడు` నమ్మకం అయితే, ''అన్నమయ్యా, రామదాసూ, త్యాగయ్యా, శ్రీరమణగారూ'' నిజాలు. ఈ నలుగురూ వున్నారనడానికి, నమ్మకంతో సంబంధం లేకుండా, రుజువులు వున్నాయి.

''ఎవరి నమ్మకాలు వాళ్ళకు ఉండనివ్వండి'' అని కాస్త నిష్టూరపడ్డారు శ్రీరమణగారు. అలాగే ఉండనిస్తారు. కానీ ఎప్పుడూ? ఆ నమ్మకస్తులు తమ నమ్మకాల్ని తమలోనే వుంచుకున్నప్పుడు. పబ్లిక్‌లోకి వచ్చి తమ నమ్మకాల్ని బయటపెడితే, అవి వాళ్ళు తమకే ఉంచుకోకుండా, మిగిలిన వారితో పంచుకున్నట్టే కదా? అప్పుడు మిగిలిన వాళ్ళల్లో కొందరైన హేతువాదులు ప్రశ్నించకా, విమర్శించకా వూరుకుంటారా?

ఇంతకీ ఈ గోలంతా, కరుణానిధి మాటలతో మొదలయింది. శ్రీరమణగారు కరుణానిధి రాజకీయ నిజాయితీని చక్కగా తన వ్యాసంలో తేల్చేశారు. ఈ విషయంలో పేచీ లేదు. కరుణానిధి, నిజాయితీ లేని మనిషయితే, ఆ మనిషి అన్న మాటలకి అర్థం లేకుండా పోతుందా? 'రాముడు మధ్యపానం చేశాడని` వాల్మీకి రామాయణంలో రాసి వుంటే, దాన్ని కరుణానిధి సాగదీసి, `తాగుబోతు` అనే దూషణా పదాన్ని అంటగట్టాడు. దూషణని సమర్థించకుండా పక్కన పెట్టండి. రాముడు మధ్యపానం చేశాడని వాల్మీకి రామాయణంలో వుందా, లేదా? అదీ రాముణ్ణి నమ్మేవాళ్ళు తెల్సుకోవాల్సిన ముఖ్య విషయం. దీనర్థం కరుణానిధి చేసిన దూషణల్ని సమర్థిస్తున్నట్టు కాదు. ఆ దూషణలకి మూలాధారం పరిశీలించాలి.

ఆంధ్రజ్యోతిలో, ''రామసేతు వివాదం మీద వ్యాఖ్యానించమని ప్రముఖ పౌరాణికులు మల్లాది చంద్రశేఖర శాస్త్రిగారిని, రామాయణంతో ఎంతో అనుబంధం వున్న బాపు, రమణలను కోరగా వారు సున్నితంగా తిరస్కరించారు'' అని రాశారు. బాపుగారు `సున్నితంగా` తిరస్కరించారుట. `రామాయణ విషవృక్షానికి` ముఖచిత్రం వేయమని డిమాండ్ డ్రాఫ్ట్ పంపినపుడు, ఆ డిమాండ్ డ్రాఫ్ట్ మీద, `రామ రామ` అని తాటికాయలంత అక్షరాలు రాసి, తిప్పి పంపినపుడు, ఈ `సున్నితత్వం` ఏమైందో? ''నాకిష్టం లేదు ముఖ చిత్రం వేయడం'' అని సున్నితంగా చెప్పడం ఎందుకు చేతగాలేదో బాపుగారికి. డిమాండ్ డ్రాఫ్ట్ పాడుచేయడం మాత్రమే తెలిసింది ఆయనకి.

వాల్మీకి రామాయణం లోంచి వచ్చిన రాముడు ఎవరి సొత్తు? అందరి సొత్తూనూ. నమ్మినా, నమ్మకపోయినా రాముడి గురించి మాట్లాడే అధికారం ఆ మతంలో పుట్టి, ఆ మతానికి సంబంధించిన కథల జ్ఞానం తెలుసుకున్న వారందరికీ వుంటుంది. మనసులు సున్నితాలయితే, పబ్లిక్ లోకి రాకండి.

హేతువాదులకి మతం లేకపోయినా, ఒక గతం వుంది. ఆ గతం ప్రకారం, ఎక్కువ మంది హేతువాదులు, పుట్టుకతో హేతువాదులు కాకుండా, ఏదో ఒక మతానికి చెందిన ఇంట్లో పుట్టారు. మిగిలిన వాళ్ళ లాగానే, వీళ్ళు కూడా ఆ మతానికి సంబంధించిన విషయాలు ఎన్నో నేర్చుకున్నారు. కానీ కాలచక్రంలో ఎన్నో కారణాల వల్లా, ఎన్నో పుస్తకాల వల్లా, తమ నమ్మకాలు వదులుకుని తార్కికంగా ఆలోచించే హేతువాదులుగా మారారు. వారికి కూడా రాముడి గురించి మాట్లాడే హక్కు ఎప్పుడూ వుంటుంది.

''మా రాముడిని మాత్రం మిగలనివ్వండి'' అని మారుతీరావుగారు ఎవర్ని అడుగుతున్నారు తన వ్యాసంలో? హేతువాదుల్ని! ఆ హేతువాదులు రాముడి గురించి మారుతీరావుగారి లాగానే నేర్చుకున్నారు. వాళ్ళు రాముడి గురించే కాదు, రాముణ్ణి కన్నవారి గురించి

కూడా ప్రశ్నిస్తారూ, విమర్శిస్తారూ. చేతనయితే ఆ ప్రశ్నలకి జవాబు చెప్పాలి. లేకపోతే వూరుకోవాలి. అంతేగానీ దౌర్జన్యంగా మాట్లాడినా, ప్రవర్తించినా చెల్లుతుందనుకోవడం అమాయకత్వం.

ఆంధ్రజ్యోతి ఆదివారం కవర్ స్టోరీలో, "ఈ సమయంలో రాముడి మీద నిందా పూర్వక వ్యాఖ్యలు చేయడం పరమ రాక్షసం" అని మల్లెమాలగారు గట్టిగా చెప్పారు. దీనర్థం, ఎవరన్నా రాముడి గురించి వ్యతిరేకంగా ప్రశ్నించినా, విమర్శించినా, అది చాలా రాక్షసం అని దూషించడం. అది హేతువాదుల్ని జడిపించడం ఎప్పుడో మానేసింది. అందరికీ తెలిసున్న వాల్మీకి రామాయణం ఆధారంగా రాముడి గురించి మాట్లాడ్డానికి ఆస్తికులకి ఎంత హక్కు వుందో, నాస్తికులకీ అంత హక్కూ వుంది.

**పర మత విమర్శలు**

రాముడి గురించి మాట్లాడే వాళ్ళందరికీ, ఈ రామభక్తులు ఒక సవాలు విసురుతున్నారు. అదేమంటే – "హిందువులు చాలా సహనం కలవాళ్ళు. వాళ్ళ పురాణ వ్యక్తుల గురించి విమర్శించడం కాదు. ఇతర మతాల వాళ్ళని విమర్శించి చూడండి, ఏం జరుగుతుందో! చేతనయితే వెళ్ళి ఆ పని చేయండి" అంటున్నారు.

ఇదీ హేతువాదులకి వీళ్ళిచ్చే సవాలు. హిందూ కుటుంబంలో పుట్టి పెరిగిన హేతువాదులకు హిందూ మతం, హిందూ పురాణాలూ బాగా తెలుస్తాయి. తెలియని వేరే మతం గురించి వీళ్ళేం మాట్లాడగలరు?

ఇతర మతాల్లో వున్న హేతువాదులు తమ మతాల సంస్కృతిలో వున్న విషయాలను అర్థం చేసుకుని ప్రశ్నించారు. సాల్మన్ రష్దీ, తస్లీమా దీనికి వుదాహరణలు. వీళ్ళు తమ మతాన్ని విమర్శించలేదా? అయితే వారి మీద వారి మత ఛాందసులు ఎలా దాడి చేశారో, దాన్ని సభ్య సమాజం ఎలా ఖండించిందో అందరికీ తెలుసు.

మనుషులందరూ సమాజంలో ఒకరితో ఒకరు మంచిగా వుండటం అనేది కనీస మానవ ధర్మం. అది గొప్ప కాదు. ఇతర మతాల్లో లాగా, హిందూమతంలో హేతువాదుల్ని హింసించడం లేదని చెప్పుకోవడం గొప్ప కాదు.

మాట మాటకీ మన రామభక్తులు, "వెళ్ళి ఇంకో మతాన్ని విమర్శించండి" అని దబాయిస్తూ వుంటారు. ఇంకో మతం గురించి కూలంకషంగా తెలియని హేతువాదులు ఇంకో మతం గురించి విమర్శలు చెయ్యరు. అలా చెయ్యడానికి ఆ మతాల్లోనే హేతువాదులున్నారు.

**అవాకులూ, చవాకులూ**

చాలా మంది వ్యాసకర్తలు తమ వ్యాసాల్లో తమ అభిప్రాయాలూ, నమ్మకాలూ వెలిబుచ్చడంతో పాటు, రకరకాల అవాకులూ, చవాకులూ కూడా రాశారు. అందులో మొట్ట మొదటి ముఖ్యమైన అవాకు – రాముడి పేరుతో హిందువుల్ని రెచ్చగొట్టడం. దాని తర్వాత చవాకు – ఆడవాళ్ళని అవమానించడం.

ఇలా అవాకులూ, చవాకులూ రాసిన వారిలో అగ్రగణ్యులు గొల్లపూడి మారుతీరావుగారు. ఈయన, స్త్రీలని అవమానిస్తూ, రామభక్తుల్ని రెచ్చగొడ్తూ ఏం రాశారో చూడండి.

"ఇంతకీ ఈ దేశ ప్రజలు - ముఖ్యంగా హిందువులు గాజులు తొడిగించుకు కూర్చున్నారు."

"భారతీయులకి ఇదే నా పిలుపు. మీ చేతుల నిండా చాలా రకాల గాజులున్నాయి. కనీసం ఇప్పుడు - మీ రాముడి కోసమైనా - ఒక్కొక్క గాజునీ తీసి పక్కన పెట్టడం - ఇప్పటికైనా ప్రారంభించండి."

భారతీయులందరూ హిందువులేనా? భారతదేశంలో వున్న ఇతర మతాల వాళ్ళు భారతీయులు కారా? హిందువులు ఒక్కరే భారతీయులా? ఈ సత్యాన్ని  చాలా గొప్పగా తేల్చేశారు. మిగిలిన మతాల వాళ్ళూ, హేతువాదులూ ఎలా భారతీయులు కాకుండా పోతారో చెప్పలేదు!

పైపెచ్చు, పై మాటలు ముఖ్యంగా పురుషులకే గానీ, స్త్రీలకి కాదు. అంటే, స్త్రీలు కూడా భారతీయులు కారు. గాజులు తొడుక్కోవడం అనేది అంత చేతకాని విషయం అయిపోయింది ఈ వ్యాసకర్తకి. గాజులు తొడుక్కోవడం అంత చచ్చు విషయం అయితే, స్త్రీలకి కూడా గాజులు తొడుక్కోవద్దని బోధించడం ధర్మం. పురుషులకి చచ్చు విషయం అయినది స్త్రీలకీ చచ్చు విషయం అవుతుంది. ఒక పక్క స్త్రీలని గౌరవించాలంటూ, ఇంకో పక్క సందు దొరికినప్పుడల్లా వాళ్ళని ఇలా అవమానించడమే! "గాజులు తొడుక్కునే స్త్రీలు ఎందుకూ పనికిరారు" అని వ్యాసకర్త ఎంత గొప్పగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారో! స్త్రీలు గాజులు, మట్టెలూ ధరించాలని బోధించేదీ వీళ్ళే, మళ్ళీ ఆ వేషాన్ని వెటకారం చేసేదీ వీళ్ళే!

స్త్రీ నింద పక్కన పెట్టండి. "చేతులకున్న గాజులు పక్కన పెట్టండి" అని అనడం అంటే, "మగాళ్ళలా తిరగబడి, రాముడిని ప్రశ్నించే వారి మీదా, విమర్శించే వారి మీదా దాడులు చెయ్యండి" అని రెచ్చగొట్టడమే. ఒక పక్క "విశ్వ హిందూ పరిషత్ సభ్యుడిని కాను" అని చెప్పుకుంటూ, ఇంకో పక్క వాళ్ళలా హిందువుల్ని రెచ్చగొట్టే మాటలు అనడం ఏం నిజాయితీ? ఇలాంటి రెచ్చగొట్టడాలే గుజరాత్ లాంటి నరమేధాలకి దారి తీసింది?

"హజ్‌కి వెళ్ళడానికి ప్రతీ పేద భక్తునికీ ఆర్థిక సహాయం చేస్తూ, కాశీకి వెళ్ళదల్చిన ఏ పేద కేరళ హిందువుకైనా 'ఒక్క రూపాయి' ఇవ్వరాదా అని అడగడం చేతకాని దద్దమ్మ మతస్థుల దేశం మనది" అని మారుతీరావుగారు పేద హిందువులకి ఇతర మతస్థుల 'సౌకర్యాలు' ఎత్తి చూపిస్తూ, మీరంతా 'దద్దమ్మలూ', 'ఎదురుతిరగండీ' అని రెచ్చగొడుతున్నారు.

ఈ 'కేరళ' అన్న పదం ఎక్కడ నించీ వొచ్చిందో నాకయితే అర్థం కాలేదు. ఏం, కేరళలోనే పేద హిందువులుంటారా? ఇదో అయోమయం!

'హజ్'కి వెళ్ళి తీరాలని ముస్లింల మత గ్రంథంలో ముఖ్యంగా ప్రవచించారని అంటారు. మరి హిందూ  మత గ్రంథాల్లో కూడా, జీవిత కాలంలో కాశీ వెళ్ళి తీరాలని వుందా? ఇక్కడ ఒకే రకం విషయాల గురించి మాట్లాడుతున్నామా, లేదా అన్నది అసలు విషయం.

మారుతీరావుగారు రాసిన ఇంకో వ్యాఖ్య చూడండి, "మనం అన్య మత సోదరుల్లాగా బస్సులు తగలెట్టద్దు. రాళ్ళు రువ్వి పక్కవాడి ఇళ్ళు నాశనం చెయ్యొద్దు. మతం పేరిట తమ మతం వారిని మారణ హోమం చేసే బాంబుల యుద్ధం వద్దు. 'అన్య మత సోదరులు' అనంటూ, వాళ్ళు చేసే చెత్త పనుల లిస్టు ఇచ్చి, 'మేమెంతో గొప్పవాళ్ళం' అని చెప్పుకోవడం ఏ రకంగా సమంజసం? ఏమీ ఎరగనట్టు, ఇంకో మతం వారిని సోదరుల్లాగా సంబోధిస్తూ, మళ్ళీ కించపరచడం!

శ్రీరమణగారు కూడా తన వంతు తాను రాశారు. "హిందూ మతం ఓర్పు సహనాలను ఉగ్గుపాలతో నూరి పోస్తుంది. హిందువులకి కూడా ఉదాసీనత ఎక్కువ. దానిని కుహనా మేధావులు అలుసుగా తీసుకుంటారు" అని తన మతస్థుల గొప్పను చాటారు. అయితే, గుజరాత్‌లో జరిగిన నరమేధాల గురించి విన్నాక కూడా, ఈ మాటలు అనబుద్ధేస్తుందా?

గుజరాత్ నరమేధాల గురించి తీసిన సినిమా, " పర్జానియా - హెవెన్ అండ్ హెల్ ఆన్ ఎర్త్" చూడండి. హిందువుల ఓర్పు ఎంతో, సహనం ఎంతో, ఉదాసీనత మరి ఎంతో తెలుస్తుంది.

ఇలా రెచ్చగొడితే, రెచ్చిపోయే హిందువులు వుంటారంటే, అతిశయోక్తి కాదు.

ఇంతకీ ఈ కుహనా మేధావులు ఎవరంటా? ఇంకెవరూ, మన హేతువాదులే! "రాముడిని విమర్శించినా, హేతువాదుల్ని మేము కొట్టడం లేదూ, చంపడం లేదూ. అది వారు అలుసుగా తీసుకుంటున్నారూ" అని బెదిరించడం అన్నమాట. ఇక  ఆ పనులు కూడా చెయ్యబోతాం అని.

"హేతువాదులు, వాదలన్నింటికీ హిందూ ధర్మాన్ని ప్రయోగశాలగా చేస్తారు. వారి తెలివికి వారే మురిసిపోతూ వుంటారు" అని శ్రీరమణగారి వ్యాఖ్యానం. ఏ మత సంస్కృతి తెల్సిన హేతువాదులు, ఆ మత ధర్మాన్నే విమర్శిస్తారు. తెలియని వాటి గురించి విమర్శిస్తే, అది కుహనా మేధావితనం అవుతుంది. వాల్మీకి రాసిన రామాయణం చదవకుండా, అందులో రాముడు మధ్యపానం చేశాడో, లేదో తెలుసుకోకుండా,  తమ కిష్టమొచ్చిన పొగడ్తల్ని రాముడికి ఆపాదించి, మురిసిపోయే వారు కుహనా మేధావులు కారా?

చాలా మంది రామభక్తులు రాసిన వ్యాసాల్లో హేతువాదుల మీద తిట్లూ, బెదిరింపులూ చాలా వున్నాయి. కరుణానిధికి నాలుక కొయ్యాలనీ, తల నరకాలనీ భక్తులకి కార్యక్రమాలు ఇస్తే, అది హత్యలు చెయ్యమని చెప్పడం కాదా? ఎక్కువ మంది వ్యాసకర్తలు తిట్ల పురాణాలు తెరిచారు. లాజిక్కు అనేదే మర్చిపోయారు. ఏది అనేసినా చెల్లుతుంది అనే ధైర్యం మరి. వేశారు చాలా కుప్పిగంతులు.

***

# స్పందనకి ప్రతిస్పందన

ఏదైనా కథ గానీ, వ్యాసం గానీ, కవిత గానీ ప్రచురించాక, అవి రాసిన వాళ్ళు ముఖ్యంగా ఎదురు చూసేది పాఠకుల స్పందన కోసం. ఎందుకంటే వాళ్ళు రాసింది పాఠకుల కోసమే గానీ, తమ కోసం కాదు కదా? అలా తమ కోసం రాసుకున్నట్టయితే, పబ్లిక్‌లో ప్రచురించడం ఎందుకు? కాబట్టి ఏ రచన కైనా పాఠకుల స్పందన చాలా ముఖ్యం - అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ. "నా మానాన్న నేను రాసుకుపోతాను. పాఠకులేం అనుకున్నా నేను పట్టించుకోను" అని రాసేవాళ్ళు అనుకోవడంలో అర్థమే లేదు. సాధారణంగా ఎవరూ అలా అనుకోరు.

'కౌముది' పత్రిక వెలువడగానే, నేను ముందుగా చూసేది పాఠకుల స్పందన ఎలా వుందా అని. రక రకాల కారణాల వల్ల ఎక్కువ మంది తెలుగు పాఠకులు స్పందించరు. దీనర్థం వారికి స్పందన లేదని కాదు. ఆ స్పందనని వాళ్ళు బయట పెట్టరు. ఏ కొద్ది మందో మాత్రమే బయట పెడతారు. అందుకే పాఠకుల స్పందన అంత అపురూపంగా వుంటుంది రాసేవాళ్ళకు. ఇలా బయటకి వచ్చిన స్పందనల్లో ఎక్కువ భాగం మెచ్చుకోళ్ళే వుంటాయి. ఆ మెచ్చుకోళ్ళకు బదులు చెప్పడానికి ఏమీ వుండదు. రచయిత అభిప్రాయాలూ, పాఠకుల అభిప్రాయాలూ ఒకేలా వున్నాయనుకోవడం తప్ప, మరింకేమీ వుండదు ఇటువంటి స్పందనల్లో. అయితే విమర్శల విషయంలో అలా కాదు. కొన్ని సందర్భాల్లో పాఠకులు నిర్భయంగా రచయితతో విభేదిస్తారు. తమ వ్యతిరేకతని బయటకి వెలిబుచ్చుతారు. ఈ విషయాల్లో రచయిత జవాబివ్వాల్సిన అవసరం వుంటుంది. పాఠకులు విమర్శిస్తూ అడిగిన ప్రశ్నలకి గానీ, లేవదీసిన పాయింట్లకి గానీ, తమ రచనలో జవాబులున్నాయా అని రాసిన వాళ్ళు చూసుకోవాలి. లేవని గానీ, వున్నా చాలా స్పష్టంగా లేవని గానీ అనిపిస్తే, విమర్శలకు జవాబివ్వాలి. అదీ సరైన పద్ధతి.

అయితే చాలా మంది తమ రచనల మీద వచ్చిన విమర్శల్ని లోపల లోపల పట్టించుకుని బాధ పడతారు గానీ, పైకి పట్టించుకోరు. ఆ విమర్శలకు జవాబులు పబ్లిక్‌లో ఇవ్వరు. కారణం ఏదైనా కావొచ్చు. వాళ్ళు పట్టించుకున్నా, జవాబు రాసే పరిస్థితులు కూడా వుండకపోవచ్చు.

"అస్త్రం" శీర్షిక పది నెల్ల నించీ వస్తోంది. అక్కడోటీ, ఇక్కడోటీ తప్ప పెద్దగా స్పందనల్లేవు. కానీ "శంకరాభరణం" సినిమా గురించి రాసిన వ్యాసం మీద మాత్రం కొంచెం గట్టి విమర్శలొచ్చాయి. వాటికి జవాబు చెప్పడానికే ఈ వ్యాసం.

మొదటగా, ప్రద్యుమ్నగారు, మే 8, 2007 నాడు కౌముది గెస్టు బుక్‌లో తన విమర్శ ఇలా రాశారు - "శంకరాభరణం మీద రాసిన మీ విమర్శ చదివాను. తర్కం ఎక్కువ, హృదయం తక్కువ. నా కర్థం కాని విషయం ఏమంటే, ఇన్ని ఫ్యూడల్ విషయాలున్నప్పటికీ, అది ఒక మంచి సినిమా అని మీరెందుకన్నారు?"

ప్రద్యుమ్నగారు ఇంగ్లీషులో రాసిన విమర్శని నేను తెలుగులోకి అనువాదం చేశాను.

నా వ్యాసంలో "తర్కం ఎక్కువ, హృదయం తక్కువ" అని ప్రద్యుమ్నగారు "తర్కించారు" చక్కగా. "తర్కం" అనే పదాన్ని సరిగా అర్థం చేసుకోకుండా, దానికి విముఖత్వం చూపిస్తూ, "హృదయం" అనేది తర్కానికి వ్యతిరేకమని భావిస్తూ, ఇవన్నీ "తర్కిస్తూ" వుంటారు వీరు. "హృదయానికి కూడా తర్కం కావాలని" అర్థం చేసుకోవాలి మరి.

ఇంతకీ ఈయన వేసిన ముఖ్య ప్రశ్న - "ఇన్ని ఫ్యూడల్ విలువలున్నప్పటికీ ఈ సినిమాని మంచి సినిమా అని నేనెందుకన్నానూ" అని.

ఈ సినిమా మంచి సినిమా అని అనడానికి కారణాలనేకం. ఇందులో అసభ్యత లేదు. కొట్టుకోవడాలు లేవు. మంచి సంగీతం వుంది. కొంత నాట్యం కూడా వుంది. పాత్రలు కొన్ని విషయాల్లో తప్పుడుగా వున్నప్పటికీ, అనేక విషయాల్లో ఉదాత్తంగా వుంటాయి. రొటీన్ ప్రేమ సన్నివేశాలు లేవు. మంచి డైలాగులు వున్నాయి. ఇంకా కొన్ని చక్కటి విషయాలు కూడా వున్నాయి. ఎన్నో దరిద్రగొట్టు సినిమాలు వస్తున్న ఆ రోజుల్లోనూ, ఈ రోజుల్లోనూ ఇది ఒక మంచి సినిమా అని నేనంటే, అందులో తప్పు లేదు. అయితే, ఇన్ని మంచి సంగతులున్నాయి కాబట్టీ, తప్పుడు విషయాలని కూడా మనం సమర్థించాలా అన్నది ముఖ్య విషయం. అలా చెయ్యనక్కరలేదు. మంచిని

మెచ్చుకుంటూనే, ఇష్టపడుతూనే, చెడుని కూడా పీకి పారెయ్యచ్చు. ఇలా ఘర్షణా, ఐక్యతా అనే పద్ధతులతోనే మంచి విషయాలు నేర్చుకోగలుగుతాము.

గంటి సుబ్బారావుగారు అనే పాఠకుడు, దోహా, కొతార్ నించి ఇలా రాశారు - "ఇది మే 2007 కౌముదిలో ప్రచురించిన ఆర్టికల్ 'అస్త్రం' గురించి. 'శంకరాభరణం' సినిమా మీద ప్రసాద్‌గారి 'చెత్త అభిప్రాయం/పరిశీలన' ప్రచురించడం వల్ల మీ విలువైన పత్రికలో నాలుగు పేజీలు వృధా అయ్యాయని నేను వ్యక్తిగతంగా భావిస్తున్నాను. ఇటువంటి వ్యాసాలని ప్రచురించడం అనేది అన్ని వనరులనూ వృధా చెయ్యడమే. ఇటువంటి అభిప్రాయాలూ/పరిశీలనా లాంటివి ప్రచురించే ముందు రెండు సార్లు ఆలోచించమని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను."

ఈ అభిప్రాయంలో 'తిట్లు' తప్ప, 'పాయింటు' ఏమీ కనబడలేదు నాకు. బహుశా తన స్పందనలో 'పాయింటు' వుంటే, దాన్ని కూడా 'చెత్త' అని అంటారేమోనని ఈ పాఠకుడి భయమేమో! తప్పుడు విలువలని విమర్శించే వ్యాసాలు చదివి, బాధపడే వాళ్ళ స్పందన ఇలాగే వుంటుంది. ఈయన ప్రకారం అభిప్రాయ బేధాలే పనికిరావు. కీర్తివంతుల్ని విమర్శించే వ్యాసాలకు పత్రికల్లో చోటు ఇవ్వనేకూడదు. ఇలాంటి స్పందన్ని చదివి, వదిలెయ్యడం తప్ప, చెయ్యగలిగేది ఏమీ వుండదు.

అన్నిటిలోకీ సుదీర్ఘ విమర్శ రాసిన ఘనత దెందుకూరి రఘునాథ్, మిలిపిటాస్ గారికి దక్కుతుంది.

నా వ్యాసం రఘునాథ్ గారికి "రామాయణ విషవృక్షం" పుస్తకాన్ని గుర్తు చేసిందిట. ఏం గుర్తు చేసిందో ఆయన మాటల్లో చూడండి.

"ఇవాళ పొద్దున్నే, కౌముదిలో ఆర్టికల్ 'అస్త్రం' విమర్శనా వ్యాసం, శంకరాభరణం మీద రాసింది, చదవడం జరిగింది. చదువుతుంటే నా చిన్నప్పటి సంగతంతా ఒకటి గుర్తుకొచ్చింది. మా ఇంటిలో అన్ని రకాల సాహిత్య పరమయిన పుస్తకాలు ఉండేవి. వాటితో పాటూ, "రంగనాయకమ్మ" రాసిన "రామాయణ విషవృక్షం" కూడా మూడు భాగాలుండేవి. కాస్త తెలివి వచ్చాక ఒకసారి, నేను దాన్ని చదవటం జరిగింది. స్వతహాగా, మా ఇంటిలో కొంచెం దైవ భక్తి తక్కువగానే ఉండటం కారణంగా.. (అప్పట్లో లెండి) అది చదువుతుంటే ఒక రకమయిన ఎంజాయిమెంటు కలిగింది. అందులో కొన్ని విచిత్రమైన లాంగ్వేజ్‌లు, స్టోరీలు రాసింది రంగనాయకమ్మ" అని రఘునాథ్ గారు తన మొదటి పేరాలో రాశారు.

ఇప్పటికన్నా అప్పట్లో దైవ భక్తి తక్కువగా వుండీ, తెలివి కూడా ఇప్పటి కన్నా తక్కువగా వున్న వారికి, ఇప్పుడు అవన్నీ పెరి గాయి. అప్పటి కన్నా ఇప్పుడు పెరిగిన తెలివి అప్పటి కన్నా భక్తిని పెంచింది. చిన్నతనంలో నిర్మల మనస్సుతో "రామాయణ విషవృక్షం" ఆనందంగా చదివిన అబ్బాయికి, భక్తి పెరిగిన తరువాత ఆ పుస్తకం నచ్చక పోవడంలో ఆశ్చర్యం ఏముంది?

రఘునాథ్ గారు రచయిత్రి లత గురించి రాస్తూ ఇలా రాశారు - "ఇది జరిగాక, కొంచెం తెలివొచ్చాక (ఈ కొంచెం కొంచెం తెలివి రావడం ఏమిటో? వేరే వాళ్ళు అనడం కాదు ఈ మాట, తనకి తానే 'నాకు తెలివి వచ్చింది' అని చెప్పుకోవటం!), విశ్వనాథ సత్యనారాయణ గారి శిష్యురాలు "లత" అని, "రామాయణ విషవృక్ష ఖండన" అని రాసింది... అందులో చాలా బాగా రాసింది.. ఆ రోజుల్లో ఆమె అది చెప్పుతూ.. 'రంగనాయకమ్మ రాముణ్ణి తిట్టుకుంటూ కూడా, అన్ని సార్లు రాముణ్ణి తలుచుకుంది కాబట్టి...పుణ్యం సంపాదించింది' అని.. అది నాకు నచ్చింది."

ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం - రాముణ్ణి విమర్శించినా సరే, తలుచుకున్నాం కాబట్టి 'పుణ్యం' వస్తుంది. అందులోనూ ఈ విషయం రఘునాథ్ గారికి నచ్చిన విషయం. అయితే ఆయన తనని తాను ఎలా కాంట్రడిక్టు చేసుకుంటారో తరువాత చూస్తాం.

అయినా, "శతృత్వంతో 'దేవుణ్ణి' చేరుకోవడం" అనేది లత సృష్టించిన భావనేమీ కాదు. అది పురాణాల్లోనే వుంది. జయ విజయుల విషయంలో ఈ విషయం చెప్పారు. అది వేరే సంగతి. మొత్తానికి నాస్తికులకూ, ఆస్తికులకూ ఒకేలాగ పుణ్యం వస్తుందన్న మాట దేముడి పేరు తలుచుకుంటే . ఇది మాత్రం ఖచ్చితంగా ఆస్తికులకు అన్యాయం జరగడమే!!

రఘునాథ్ గారి (మూఢ) నమ్మకాలు ఎలా వుంటాయో అర్థం చేసుకోవడానికి, ఆయన రాసిన మాటలు చూడండి -
"నా ఇంకో ఎక్స్‌పీరియన్సు.. ఎప్పుడైతే రామాయణ విషవృక్షాన్ని చదివానో అప్పుడు యాదృచ్ఛికంగానే కావొచ్చు.. నాకు చెడు జరిగినట్టుగా అనిపించింది... బహుశా అది విషవృక్షం కావడం వల్లనేమో.. మా నాన్నగారితో అంటే.. ఆయన కూడా అలాగే అన్నారు.. తరువాత.. నేను మా నాన్నగారికి చెప్పి ఆ పుస్తకాలని లైబ్రరీకి డొనేట్ చెయ్యడం జరిగింది..."

"విషవృక్షం" చదవడం వల్ల రఘునాథ్ గారికి చెడు జరిగింది! మళ్ళీ అది "యాదృచ్ఛికం" కూడా కావొచ్చు! ఆ పుస్తకాలు లైబ్రరీకి డొనేట్ చేసేశాక (ఇక ఆ లైబ్రరీకి వెళ్ళే వాళ్ళందరికీ చెడు జరగాలనా?), ఈయనకి జరిగిన చెడు పోయిందో, లేదో? ఆ వివరాలు లేవు మరి. సందర్భాన్ని బట్టి పోయిందనే అనుకోవాలి.

ఇంతకు ముందు రఘునాథ్ గారు ఏమన్నారు? రాముణ్ణి తిట్టుకున్నా, బోలెడు సార్లు తలుచుకోవడం వల్ల పుణ్యం వస్తుందని ఒప్పుకోలేదూ? మరి అది చదివి, ఈయన కూడా రాముణ్ణి బోలెడు సార్లు తలుచుకున్నారు కదా? ఈయన కెందుకు చెడు జరిగిందీ, అంత పుణ్యం సంపాదించాక కూడా?

రఘునాథ్ గారి (మూఢ) విశ్వాసాలకి ఇంతకన్నా ఉదాహరణెందుకు?

ఇంకా, రఘునాథ్ గారు, "ఇవాళ అస్త్రం చదువుతుంటే.. కొంచెం అలాంటి ఆనందం "విషవృక్షం" చదివిననాటి లాంటిది కలిగింది.." అని రాశారు.

సంతోషం! మొత్తానికి ఆయన వంటి భక్తులకు కాస్త ఆనందం కలగజేసినందుకు నాక్కూడా కాస్త పుణ్యం వచ్చే వుంటుంది! పుణ్యం మాటేమో గానీ, నా వ్యాసం ఆయన్ని ఆనంద పరచినందుకు, నాకూ ఆనందం కలిగింది!

కానీ, నేను రాసిన "శంకరాభరణం" మీద వ్యాసాన్ని, "రామాయణ విషవృక్షం" తో పోల్చడం మాత్రం చాలా విచిత్రం. విమర్శలన్నింటినీ ఒకే గాటిన కట్టేస్తారులా వుంది ఈయన.

కాస్సేపు నా రాతనీ, శైలినీ మెచ్చేసుకున్నారు. ఏదన్నా సినిమాని రియాలిటీతో తీస్తే ఆడదనీ, జనాలకి చూడ్డానికి టైం వుండదనీ, వాళ్ళ డబ్బుకి సరిపడే వినోదం కలగదనీ చెబుతూ, శంకరాభరణంలో "రియాలిటీ లోపించిందని" రఘునాథ్ గారే ఒప్పేసుకున్నారు. బిజినెస్ కోసం రియాలిటీని తీసినట్టు చెబుతూ, ఈయన ఇలా అంటున్నారు.

"కానీ నిజానికి ఆలోచిస్తే.. మనం కచ్చితంగా రియాలిటీస్ మాత్రం తీస్తే.. ఏ సినిమా నడుస్తుందంటారు? జనాల్లో సగం మందికి... అంత టైం లేదు.. పెట్టిన డబ్బులకు మూడు గంటల పాటు ఆనందం లేక వినోదం కలిగిందా లేదా అని." అని రఘునాథ్ గారు రియాలిటీ లేకపోవడానికి కారణం చెప్పారు. ఈ కారణం అందరికీ తెలిసిందే అయినా నేను నా వ్యాసంలో కారణాలడగలేదు. 'బిజినెస్' అనే కారణం, సినిమాలో చూపించిన విలువల్ని మంచి విలువలుగా చేసెయ్యదు.

రఘునాథ్ గారు, "మంచి సాంగ్స్ ఉన్న సినిమా.." అని అన్నారు. నేనూ అదే అంటాను. ఆయనే మళ్ళీ, "క్లాస్ ప్లస్ మాస్" అని అన్నారు. ఇదో బిజినెస్ పదజాలం. నా దృష్టిలో మనుషులు తమ ప్రవర్తన్ని బట్టి మాత్రమే క్లాస్ గానూ, మాస్ గానూ వుంటారు.

ఇక రఘునాథ్ గారు, "శంకరాభరణం గురించిన సద్విమర్శలు చెయ్యాలంటే" అంటూ ఏడు పాయింట్లు చెప్పారు. అవేవో 'సద్విమర్శల'నుకున్నాను ముందర. అవసలు విమర్శలే కాదు. 'సత్'ని పక్కన పెట్టండి. ఆ ఏడు పాయింట్లలోనూ, ఆయన ఆ సినిమా గురించి తన సమర్థనలు రాశారు.

1. "శాస్త్రి ప్లస్ తులసిల కాలానుబంధం అన్నట్టుగా చూపించారేమో.. పిల్లలకు పాఠాలు చెబుతూ.. బీచ్‌లో/నది వొడ్డులో పాడుతూ శాస్త్రి will see her dancing and when she stops, he continues to sing… which is showing the relation." అని తన మొదటి పాయింటులో ఏం చెపదల్చుకున్నారో బొత్తిగా అర్థం కాకుండా రాసేరు. శాస్త్రికీ, తులసికీ అనుబంధం లేదని ఎవరన్నారు?

అయినా రఘునాథ్ గారు ఈ పాయింటులో చెప్పిందంతా కరెక్టు కాదు. తులసి నాట్యం చూసి శంకరశాస్త్రి తన పాట ఆ-పుతాడు ముందర. అది చూసి తులసి నాట్యం ఆపి, వెను తిరిగి వెళ్ళబోతూంటే, శాస్త్రి మళ్ళీ పాట మొదలు పెడతాడు. అప్పుడు తులసి మళ్ళీ నాట్యం మొదలు పెడుతుంది. శంకరశాస్త్రి అన్నా, ఆయన సంగీతం అన్నా తులసికి చాలా ఆరాధన అని ముందర నించీ తెలుస్తూనే వుంటుంది. అందులో అనుమానం లేదు.

2. ''కూతురు ఆల్‌రెడీ ఒకసారి కలలు కంటూ మిస్టేక్ చేసినట్టుగా చూపించారు. (సామజ వరగమన పాటలో).. so obvious she could not become successor'' అని ఒక కుంటి సాకు చెబుతూ, రఘునాథ్ గారు, కూతురు శాస్త్రి సంగీతానికి వారసురాలు ఎందుకు కాలేక పోయిందో చెప్పేశానని భ్రమించారు.

శారద ఒకసారి తప్పు పాడితే, ఇక మొత్తం పోయినట్టేనా? తప్పు పాడకుండానే అందరూ మొదటి నించే అస్తమానూ అన్నీ సరిగా పాడేస్తూ వుంటారా? శాస్త్రి కూడా జీవితంలో ఒక్కసారి కూడా తప్పుగా పాడి వుండడా, ఏ కారణం వల్ల గానీ? ఎవళ్ళూ తప్పులు చెయ్యకుండానే, అన్నీ నేర్చేసుకుంటారా? ఏవో ఆలోచనల్లో వుండి ఒక తప్పు చేస్తే, దానికే వారసురాలు కాకుండా చేస్తారా? ఏం ఆర్గ్యుమెంటు ఇది?

3. శాస్త్రి గారి క్షమాగుణం గురించి, రఘునాథ్ గారు తన ధోరణిలో, ''శాస్త్రి గారికి క్షమాగుణం ఉంది అని చెప్పటానికి ఆల్‌రెడీ అల్లుణ్ణి (చంద్రమోహన్ పాడటం చూశాక అల్లుణ్ణి చేసుకోవడానికి ఒప్పుకున్నట్టు) క్షమించినట్టు చూపించారు. Also when other singers always tease him, he showed patience etc. కాబట్టి తన పనివాళ్ళని కూడా క్షమించాడు అనుకోవచ్చు'' అని రాసి, శాస్త్రి గారి పరువును తను కాపాడేశాననుకున్నారు.

పనివారి విషయంలో శాస్త్రి గారిని ఏమని విమర్శించాను? వారి చేత బాగా చాకిరీ చేయించుకుంటాడనీ, ఓ పిసర ఆలస్యం అయితే విసుక్కుంటాడనీ విమర్శించాను. ఇందులో పనివారు తప్పులు చేసిందెక్కడా, వాళ్ళని ఈయన క్షమించే పని ఎక్కడా? అయినా శాస్త్రికి క్షమాగుణం లేదని ఎవరూ అనలేదే? పనివారిని విసుక్కుంటాడు అని అన్నదానికి చెప్పిన వంకర టింకర సమాధానం ఇది.

4. ''తులసి కొడుకుని ఆయన కాళ్ళ దగ్గర చేర్చడానికే అన్ని రోజులు బతికినట్టు అనుకోవాలి.. గండపెండేరం తొడగ్గానే.. she is done అన్నమాట'' అనంటూ రఘునాథగారు తులసి మరణానికి రీజన్ చెప్పారు. తులసి కొడుకుని ఆయన కాళ్ళ దగ్గరకి ఎప్పుడో చేర్చేసింది. శాస్త్రి గండపెండేరం తొడిగింది పిల్లాణ్ణి తన వారసుడిగా ప్రకటించడానికే. ఇది సినిమా కాబట్టి, తమ ధ్యేయం తీరగానే, పాత్రలు ఏ జబ్బూ లేకుండా చనిపోతూ వుంటాయి. అది కూడా ప్రేక్షకుల్లో బోలెడు శోకరసం నింపి, తద్వారా బిజినెస్ విజయం సాధించడానికి ఇటువంటి డ్రామాలు చూపిస్తారు.

5. "Why people attend the program at the end.. అంటే, ఇవాళా రేపు... రీజన్స్ అక్కర్లేదు. తలా పదిరూపాయలు ఇచ్చుండొచ్చు, ప్రసాదం గురించి గుడి కొచ్చేవాళ్ళలా.. మరింకెందుకో వచ్చుండొచ్చు.. We have seen changes happened in real life ఒకప్పుడు సినిమాలో ''ముద్దు'' గురించి మాట్లాడితే.. సెన్సార్.. ఇప్పుడు ముద్దు పెట్టుకున్నా సెన్సార్ కాదు.. సో కాలక్రమేణా జనాల ఇష్టాలు ఛేంజ్ అయ్యాయి కదా? అలా అని మనం ఇప్పుడు కూడా, NTR, ANR పాత సిన్మాలు చూడట్లే.. అలాగే జనాలు అందరూ శంకరశాస్త్రి గారి లాస్ట్ ప్రోగ్రాంకి వచ్చారన్న మాట.

అంతెందుకు లాస్ట్ వీక్ మిలిపిటాస్‌లో ''పి.బి.శ్రీనివాస్'' ప్రోగ్రాంకి, టికెట్స్ దొరకక, సగం మంది జనాలు బయట నించే వెళ్ళిపోయారు. It depends on timing/place etc కూడా'' అని రఘునాథ్ గారు, నేను శంకరశాస్త్రి ప్రోగ్రాంకి అంతమంది జనం ఎలా వొచ్చారూ అని అడిగిన దానికి జవాబుగా, పెద్ద వివరణ ఇచ్చారు.

అసలు పాయింటు అర్థం చేసుకోకుండా, ఏదో చేతికొచ్చినట్టు రాసుకుపోతే, ఏం జవాబివ్వాలి? 'రీజన్' అక్కర్లేదు అంటూ సవాలక్ష రీజన్లిచ్చారీయన. సినిమాలో శాస్త్రీయ సంగీతానికి ఆదరణ తగ్గిపోయిందన్నది పాయింటు. అది పెరిగినట్టు ఒక్క ముక్క కూడా అనకుండా, డబ్బుతో ఒక ప్రోగ్రాం ఏర్పాటు చేసి, దానికి చాలా మంది జనం వచ్చినట్టు చూపించారు. అసలు విషయం గాలికి ఎగిరిపోయింది. అందుకని ప్రశ్నించాను. అంతేగానీ మనుషుల అభిరుచుల్లో మార్పులు రావని కాదు.

6. "అదే 'గంభీరమైన' శంకరశాస్త్రి.. దుకాణం వాడి దగ్గర అడుక్కోవడం చూపించారు అలాగే... సగం డబ్బుల్ని పనివాళ్ళకిచ్చినట్టూ కూడా చూపించారు. కూతురుని సామజ వరగమన పాట తరువాత తిట్టాక, చేతిలో హారతిస్తాడూ.. అదే రాత్రి కూతురు వచ్చి వెన్న రాస్తుంది. అప్పుడు తండ్రిగా ఏడ్వడం కూడా చూపించారు.. it's like a feeling of "లెక్కల మాష్టారు కొడుకు" లెక్కల్లో వందకి పది మార్కులు వస్తే అన్నట్టు అన్నమాట." అంటూ రఘునాథ్ గారు, నేను శంకరశాస్త్రిలో చూసిన ఫ్యూడల్ పురుష గాంభీర్యానికి, బదులుగా తలా, తోకా లేకుండా, అన్నీ కలగాపులగంగా కలిపేసూ రాశారు.

ఇక్కడ కూడా ఆయన ఇచ్చిన వుదాహరణ - లెక్కల మాష్టారి కొడుకు. కూతురు కాదు. ఈ భావాలు సమాజంలో వున్నవే.

ఈయన చెప్పిన ఏ సంఘటనలోనూ శాస్త్రి గాంభీర్యం చెడలేదు. బేలతనం చూపించలేదు. 'అడుక్కోవడం' నించీ, 'ఏడ్వడం' వరకూ గాంభీర్యం గానే చేశాడు. దీనర్థం మనుషులు గాంభీర్యంగా వుండకూడదని కాదు. అనవసరమైన చోట కూడా గాంభీర్యం ప్రదర్శిస్తేనే విమర్శిస్తారు. అంతేగానీ గాంభీర్యం అనేది చెడ్డ విషయం కాదు.

7. "ఇలా ఇంకా ఎన్నో చెప్పుకోవచ్చు.. శంకరశాస్త్రి పాదాలకి రక్తం రాయడం ఆల్‌మోస్ట్ ద్రౌపది జుట్టుకి శిశుపాలుడి రక్తం రాయడంలా.. అక్కడి సంప్రదాయం..." అంటూ ముగించారు రఘునాథ్ గారు.

నేనూ అదే అన్నాను. "పాంచాలీ శపథం గుర్తొచ్చేలా వుంది ఈ సీను" అనే అన్నాను. అయినా, ద్రౌపది జుట్టుకి రాసింది శిశుపాలుడి రక్తం కాదు, దుశ్శాసనుడి రక్తం. అయితే, ఇది, "అక్కడి సంప్రదాయం" అని రఘునాథ్ గారు అనడం చాలా విచిత్రం. ఎక్కడదీ సంప్రదాయం? భారతంలోదా, లేక శాస్త్రిగారి రోజుల్లోదా? పిచ్చి సంప్రదాయాలూ, పిచ్చి గోలా.

మొత్తానికి శాస్త్రి గారిని ద్రౌపదితో పోల్చారు రఘునాథ్ గారు. బాగుంది హాస్యం!

మళ్ళీ చెబుతున్నాను. శంకరాభరణం సినిమాలో చాలా మంచి విషయాలున్నాయి. ఆ మంచితో పాటు కొంత చెత్త కూడా వుంది. చెత్తని ఏరిపారేసి, మంచిని ఆస్వాదిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

చివరి మాట

ఈ "అస్త్రం" శీర్షికని ఈ నెలతో ముగిస్తున్నాను. ప్రతీ నెలా రెగ్యులర్‌గా రాయడం చాలా కష్టంగా వుంది. నెలంతా బరువు, బాధ్యతలతో కుంగిపోయినట్టు నడుస్తున్నాను. ఎడిటర్‌గారు రాయమనే అన్నారు. నాకే చేతకాదు ఇంత రెగ్యులర్‌గా రాయడం. "వీలు కుదిరి రాసినపుడు పంపుతాను పత్రిక్కి" అని చెప్పాను ఎడిటర్‌గారికి. ఆయన అంగీకరించారు. ఇకనించీ నెల, నెలా కాకుండా, అప్పుడప్పుడు రాయడమే పనిగా పెట్టుకుంటాను.

రాసిన విమర్శల్లో కొన్నింటికి కొంతమంది పర్సనల్ మెయిల్లో స్పందించారు. అవి వ్యక్తిగతం కాబట్టి, వాటినిక్కడ ప్రస్తావించలేదు. కొంతమంది మెచ్చుకున్నారు. కొంతమంది విమర్శించారు. అంటే అవి వారికెక్కడో స్పందన కలగజేసినట్టే!

****